


TGTEL/25/A1713

# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక



## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపుణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326



రంగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 145 | పేజీలు : 14 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | శుక్రవారం 29 మే 2026 | వెల : 4/-




## ఎన్టీఆర్ లేకుంటే కేసీఆర్ నాయకులు అయ్యేవారా?

- విగ్రహ ఆవిష్కరణలో రేవంత్ రెడ్డి
- ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ఎన్టీఆర్ స్ఫూర్తితో పరిపాలన చేస్తున్నామన్న రేవంత్ రెడ్డి
- ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి భారీగా వచ్చిన అభిమానులు

## సంక్షేమ పథకాలపై యూనిఫైడ్ కార్డు

- ఆధార్ తరహాలో యూనిక్ ఐడెంటిటీ నంబర్
- సీఎం కీలక సూచనలు
- పౌరుల సమగ్ర సంక్షేమ పథకాలపై యూనిఫైడ్ కార్డు రూపొందించాలన్న సీఎం
- ఎంత లబ్ధి జరుగుతుందో తెలిసేలా కార్డులు ఉండాలని సూచన
- అన్ని శాఖల నుంచి లబ్ధిదారుల డేటా సేకరణకు ప్రత్యేక డ్రైవ్
- ఆధార్ తరహాలో నంబర్ ఇచ్చే అంశాన్ని పరిశీలించాలన్న రేవంత్



హైదరాబాద్

పౌరుల సమగ్ర సంక్షేమ పథకాలపై యూనిఫైడ్ కార్డు రూపొందించాలని అధికారులకు సీఎం రేవంత్?రెడ్డి సూచించారు. ఎవరికి ఎంత లబ్ధి జరుగుతుందో తెలిసేలా ఈ కార్డులు ఉండాలన్నారు. అన్ని శాఖల నుంచి లబ్ధిదారుల డేటా సేకరణకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆధార్ తరహాలో యూనిక్ ఐడెంటిటీ నంబర్ ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని రేవంత్?రెడ్డి సూచించారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వివరాలనూ సేకరించాలన్నారు. రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి అందుతున్న సంక్షేమ పథకాల వివరాలన్నీ ఒకే కార్డులో అందుబాటులో ఉండేలా 'సమగ్ర సంక్షేమ కార్డు'ను రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఏ పౌరుడికి ఏ శాఖ ద్వారా, ఏ పథకం కింద, ఎంత మేర లబ్ధి చేకూరుతోందో ఈ కార్డు ద్వారా స్పష్టంగా తెలిసేలా ఉండాలన్నారు. తక్షణమే అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, అన్ని శాఖల నుంచి లబ్ధిదారుల డేటాను సేకరించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. సమగ్ర సంక్షేమ కార్డు ద్వారా రాష్ట్రంలోని ప్రతి పౌరుడి పూర్తి సంక్షేమ ప్రొఫైల్ ఒకే చోట - మిగతా3లో



## దిల్లీకి సిద్ధరామయ్య, డీకే శివకుమార్

- ఆ విషయంపై అధిష్ఠానంతో చర్చలు!
- కొత్త శాసనసభాపక్ష నేత ఎంపిక, మంత్రివర్గ కూర్పుపై సిద్ధరామయ్య, డీకే శివకుమార్ అధిష్ఠానంతో చర్చ




## నీట్ రీటెస్ట్‌పై కేంద్రం కీలక నిర్ణయం

- ప్రధాని కార్యాలయం పర్యవేక్షణలో ఎగ్జామ్?!
- రీటెస్ట్ ప్రక్రియను ప్రధానమంత్రి కార్యాలయం నిశితంగా పరిశీలిస్తున్నట్లు జాతీయ మీడియా కథనాలు



## తెలంగాణలో రాబోయేది బిజెపి డబుల్ ఇంజన్ సర్కారే

- ప్రశిక్షణా తరగతుల్లో ఎన్. రాంచందర్ రావు ధీమా
- దేశవ్యాప్తంగా యూనిఫామ్ సివిల్ కోడ్ అమలు దిశగా అడుగులు.. స్వాగతించిన ముస్లిం మహిళలు.
- ఓట్ల రాజకీయం కోసమే 'ఎస్ఐఆర్'పై కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీల దుష్ప్రచారం.
- రైతుల పక్షాన నిలబడేది బిజెపినే.. ధాన్యం చివరి గింజ కొనేవరకు పోరాటం ఆగేది లేదు.

## ఫ్యూచర్ సిటీ దేశానికే తలమానికం



- ఫ్యూచర్ సిటీలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబు పర్యటన
- ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ అథారిటీ కార్యాలయ భవనం నిర్మాణ పనుల పరిశీలన
- స్కిల్ యూనివర్సిటీ పనుల పరోగతి పరిశీలించిన మంత్రులు
- అత్యాధునిక సౌకర్యాలతో అభివృద్ధి

హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చేస్తున్న ఫ్యూచర్ సిటీ దేశానికే ఆదర్శంగా నిలిచే విధంగా రూపుదిద్దుకుంటోందని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, శ్రీధర్ బాబు తెలిపారు. గురువారం ఫ్యూచర్ సిటీలో నిర్మాణంలో ఉన్న ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) కార్యాలయ భవనం, స్కిల్ యూనివర్సిటీ నిర్మాణ పనులను మంత్రులు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఫ్యూచర్ సిటీని అత్యాధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తోందని తెలిపారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పనకు కేంద్రంగా స్కిల్ యూనివర్సిటీ - మిగతా3లో




## 52శాతం తగ్గిన ప్రాంతీయ పార్టీల ఆదాయం

- ఇన్‌కమ్‌లో ఎఫ్జా టాప్, టీఎంసీ సెకండ్
- 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారీగా తగ్గిన ప్రాంతీయ పార్టీల ఆదాయం
- అంతకుముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 52 శాతం తగ్గుదల
- ప్రాంతీయ పార్టీల ఇన్‌కమ్‌లో తెలుగుదేశం ఫస్ట్ ప్లేస్

## జెన్‌జీ ఆశించే విధంగా సంస్కరణలు

- ఇగోలు లేకుండా చర్చకు టీడీపీ అందరి వేదిక: లోకేశ్
- సంస్కరణలపై ఇగోలు లేకుండా చర్చకు తెలుగుదేశం పార్టీ అందరి వేదిక
- మీడియాతో మంత్రి నారా లోకేశ్ ఇష్టాగోష్టి


మంగళగిరి

రాజకీయాలైనా, ప్రభుత్వమైనా సంస్కరణలకు తెలుగుదేశం నాంది అని మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. 'కార్యకర్తే అధినేతతో పాటు నా తెలుగుదేశం - నా బాధ్యత నినాదాన్ని బలంగా తీసుకెళ్తామని' వెల్లడించారు. జెన్ జీ పార్టీ నుంచి ఏం అశిస్తుందో అందుకు తగ్గట్టుగా సంస్కరణలు నిరంతరం ఉంటాయని స్పష్టం చేశారు. రాజకీయాల్లో సంస్కరణలనేవి నిరంతర ప్రక్రియన్నారు. - మిగతా3లో



## ఏపీలో 457 కి.మీ. హైస్పీడ్ రోడ్ కారిడార్

- మారనున్న ఏజెన్సీ ప్రాంతాల ముఖచిత్రం
- కోల్‌కతా-చెన్నై హైవేకు ప్రత్యామ్నాయంగా ఖరగ్‌పూర్-అమరావతి మార్గం నిర్మాణం
- మోర్త్ సూచించిన 3 ఎలైన్‌మెంట్లలో 'ఏజెన్సీ' మార్గానికే రాష్ట్రం మొగ్గు
- మొత్తం 1,107 కి.మీ.లలో ఏపీలో 457 కి.మీ.



## దీనిని రాజకీయం చేయవద్దని విజ్ఞప్తి

- సీబీఎస్ఈఓఎస్ఎం వివాదంపై స్పందించిన ప్రధాన్
- ఎలాంటి అవకతవకలు జరిగినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్న ధర్మేంద్ర ప్రధాన్
- వైఫల్యాలకు తాను బాధ్యత వహిస్తానని వ్యాఖ్య
- విద్యార్థులపై ఒత్తిడి పెంచేలా ప్రకటనలు చేయొద్దని విజ్ఞప్తి



# నీట్ రీటెస్ట్‌పై కేంద్రం కీలక నిర్ణయం

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. జూన్ 21 నిర్వహించే రీటెస్ట్?లో మరోసారి ఎలాంటి లోపాలు తలెత్తకుండా కేంద్రం పటిష్ట చర్యలు తీసుకుంటోంది. ఈసారి రీటెస్ట్ ప్రక్రియను ప్రధానమంత్రి కార్యాలయం నిశితంగా పరిశీలిస్తున్నట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. పేపర్ తయారీ నుంచి ఫలితాల వరకు నిశితంగా పరిశీలించనుంది. దిల్లీలో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఈమేరకు నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. జాతీయ మీడియా వివరాల ప్రకారం దిల్లీలోని తన నివాసంలో రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నీట్ రీటెస్ట్‌లో ఎలాంటి అవకతవకలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సుమారు 40 నిమిషాల పాటు జరిగిన సమావేశంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా, ఎన్టీఏ డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్, పీఎంఓ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. పేపర్ తయారు చేయడం, ప్రింటింగ్, ట్రాన్స్‌పోర్టేషన్, పరీక్షా కేంద్రాలకు చేర్చడం వంటి ప్రతి ప్రక్రియను ప్రధాన మంత్రి కార్యాలయం (పీఎంఓ) పర్యవేక్షించనుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. నీట్? రీ టెస్ట్?కు సంబంధించిన పరిణామాలను ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఈ పరీక్షకు సంబంధించి ప్రతి అప్‌డేట్‌ను మోదీ తెలుసుకుంటున్నారని వివరించాయి. మే 3న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహించిన నీట్-యూజీ 2026 పరీక్షను పేపర్ లీక్ అయ్యిందన్న కారణంతో మే 12న రద్దు చేశారు. అనంతరం జూన్? 21న రీ-టెస్ట్ పెడతామని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్? వెల్లడించారు. వచ్చే ఏడాది నుంచి నీట్ పరీక్ష ఆన్?లైన్?లో నిర్వహిస్తామని తెలిపారు. కాగా, మే 3న దేశంలోని 551 నగరాలు, విదేశాల్లోని 14 నగరాల్లో మొత్తం 5,400కు పైగా కేంద్రాల్లో నీట్ యూజీ పరీక్ష జరిగింది. 22 లక్షల మందికి పైగా అభ్యర్థులు ఈ ఎగ్జామ్ రాశారు. అయితే ప్రశ్నాపత్రం లీక్ కారణంగా ఎగ్జామ్ రద్దవ్వడంతో వారు మరోసారి జూన్ 21న పరీక్షను రాయనున్నారు. మరోవైపు నీట్ యూజీ పేపర్ లీక్‌పై రాజకీయ పార్టీలు తీవ్రంగా మండిపడుతున్నాయి. పరీక్షల నిర్వహణలో కేంద్ర సర్కార్ విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. వరుసగా జరుగుతున్న నీట్? పేపర్ లీక్‌లకు ప్రభుత్వ ఉదాసీనతే కారణమని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ దుయ్యబట్టారు. నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్? తన పదవికి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వంలో పేపర్ లీక్ మాఫియా వర్ధిల్లుతోందని ఆరోపించారు. కానీ బాధ్యత వహించాల్సినవారు మాత్రం




కూర్చొని వేడుక చూస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రతిపక్షాల నుంచి వస్తున్న విమర్శల నేపథ్యంలో అప్రమత్తమైన కేంద్రం, నీట్? రీ టెస్ట్?పై దృష్టి సారించింది. ఇదిలా ఉండగా, నీట్ యూజీ అభ్యర్థుల పరీక్ష ఫీజు రీఫండ్ ప్రక్రియకు సంబంధించిన బ్యాంక్ ఖాతా వివరాల సమర్పణ గడువును నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (టీూ) పొడిగించింది. మే 3న జరిగిన నీట్ యూజీ పరీక్షకు సంబంధించిన అంతరాయాల నేపథ్యంలో ఈ ఫీజు రీఫండ్ ప్రక్రియ నడుస్తోంది. వాస్తవానికి మే 27తో ముగియాల్సిన ఈ గడువును 2026 జూన్ 22 వరకు పొడిగిస్తూ ఎన్‌టీఏ ప్రకటించింది. అభ్యర్థులు నీట్ 2026 రిజిస్ట్రేషన్ పోర్టల్ ద్వారా తమ బ్యాంక్ ఖాతా వివరాలను సమర్పించి, నేరుగా తమ ఖాతాల్లోకి ఫీజు రీఫండ్ పొందవచ్చు.

# 52శాతం తగ్గిన ప్రాంతీయ పార్టీల ఆదాయం

2024-25 ఆర్థిక సంవత్సరంలో 36 ప్రాంతీయ పార్టీల మొత్తం ఆదాయం గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 51.57 శాతం తగ్గింది. అంతేకాకుండా ఇందులోని 21 పార్టీలు తాము ప్రకటించిన ఆదాయం కంటే ఎక్కువ ఖర్చు చేశాయి. ఈ మేరకు అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ూణ=) మే 27న నివేదికను విడుదల చేసింది. ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 67 గుర్తింపు పొందిన ప్రాంతీయ పార్టీల్లోని 36 పార్టీల వార్షిక ఆడిట్ ఖాతాలను ఏడీఆర్ విశ్లేషించింది. 2025 అక్టోబర్ 31 గడువు తేదీ ముగిసిన తర్వాత 207 రోజులు గడిచినా కూడా, మిగిలిన 31 పార్టీలు తమ ఆడిట్ నివేదికలను ఈసీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచలేదని ఈ నివేదిక పేర్కొంది.




**ఏడీఆర్ రిపోర్టు ప్రకారం**

2024-25 ఆర్థిక సంవత్సరంలో 36 ప్రాంతీయ పార్టీల మొత్తం ఆదాయం రూ. 1,192.94 కోట్లుగా నమోదైంది. ఇది 2023-24 ఆర్థిక సంవత్సరం ఆదాయంతో (రూ.రూ. 2,463.17 కోట్లు) పోలిస్తే రూ. 1,270.23 కోట్లు తక్కువ. పర్సంటేజీలో చూస్తే 51.57 శాతం తగ్గింది. అయితే, ఈ పార్టీలు ప్రకటించిన మొత్తం ఖర్చు రూ. 1,433.07 కోట్లకు చేరింది. ఇది వాటి మొత్తం ఆదాయం కంటే రూ. 240.12 కోట్లు లేదా సుమారు 20 శాతం అధికం కావడం గమనార్హం. మొత్తం ఆదాయంలో దాదాపు 69 శాతం వాటా, మొత్తం వ్యయంలో 77 శాతానికి పైగా వాటా కేవలం మొదటి ఐదు పార్టీలదే.

**అధిక ఆదాయం పొందిన ప్రాంతీయ పార్టీ ఏదంటే?**

2024-25 ఆర్థిక సంవత్సరంలో అధిక ఆదాయం పొందిన ప్రాంతీయ పార్టీగా తెలుగుదేశం నిలిచింది. ఈ పార్టీ రూ. 228.31 కోట్లు ఆదాయాన్ని పొందింది. ప్రాంతీయ పార్టీల పొందిన మొత్తం ఆదాయంలో ఇది 19.14 శాతం. టీడీపీ తర్వాతి స్థానాల్లో టీఎంసీ రూ. 219.35 కోట్లు, వైసీపీ రూ. 140.39 కోట్ల ఇన్‌కమ్‌ను పొందాయి. ఖర్చుల పరంగా చూస్తే వైసీపీ అత్యధికంగా రూ. 340.20 కోట్లు ఖర్చు చేసింది. ఆ తర్వాతి స్థానాల్లో బీజేడీ రూ. 288.44 కోట్లు, టీఎంసీ రూ. 227.59 కోట్లు ఖర్చు చేశాయి. మొత్తం 36 పార్టీల్లో 21 పార్టీలు 2024-25 ఆర్థిక సంవత్సరంలో తాము ఆర్జించిన ఆదాయం కంటే ఎక్కువ మొత్తాన్ని ఖర్చు చేశాయని ఏడీఆర్ నివేదిక వెల్లడించింది.

**ఏడీఆర్ రిపోర్టు ప్రకారం**

వైసీపీ, టీఎంసీ, బీఆర్ఎస్, బీజేడీ, జేడీయూ, ఎస్పీ సహా పలు పార్టీలు తమ ఆదాయాన్ని మించి ఖర్చు చేశాయి. అదే సమయంలో 15 ప్రాంతీయ పార్టీలు తమ ఆదాయంలో కొంత భాగాన్ని ఖర్చు చేయకుండా ఆదా చేశాయి. అత్యధికంగా డబ్బులు ఆదా చేసిన పార్టీగా టీడీపీ నిలిచింది. ఆ పార్టీ రూ. 166.98 కోట్లను ఖర్చు చేయకుండా పొదుపు చేసింది. ఆ తర్వాతి స్థానాల్లో మహారాష్ట్ర నవనిర్మాణ సేన రూ. 36.27 కోట్లు, అన్నాడీఎంకే రూ. 35.86 కోట్లతో నిలిచాయి.

**డొనేషన్స్ ప్రధాన ఆదాయ వనరు**

ప్రాంతీయ పార్టీలకు నిధుల సమీకరణలో స్వచ్ఛంద విరాళాలే ప్రధాన వనరుగా నిలిచాయి. అన్ని పార్టీలకు కలిపి విరాళాలు, చందాల ద్వారా రూ. 702.36 కోట్లు సమకూరాయి. అత్యధిక విరాళాలను పొందిన ప్రాంతీయ పార్టీగా టీఎంసీ (రూ. 184.08 కోట్లు) నిలిచింది. ఆ తర్వాతి స్థానాల్లో వైసీపీ (రూ. 140.05 కోట్లు), టీడీపీ (రూ. 85.20 కోట్లు) నిలిచాయి. 15 ప్రాంతీయ పార్టీలు తమ మొత్తం వ్యయంలో 55 శాతానికి పైగా ఎన్నికల ప్రచారం కోసమే ఖర్చు చేశాయి. ఎలక్షన్ క్యాంపెయిన్ కోసం అత్యధికంగా వైసీపీ రూ. 299.92 కోట్లు ఖర్చు చేసింది. ఆ తర్వాతి బీజేడీ (రూ. 270.66 కోట్లు), బీఆర్ఎస్ (రూ.147.99 కోట్ల) నిలిచాయి.

**విజేతల్లో 40 శాతం మందికి 50 శాతం కంటే తక్కువ ఓట్లు**

మరోవైపు, బంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల గురించి కూడా ఏడీఆర్ నివేదిక విడుదల చేసింది. బంగాల్ ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థుల్లో సుమారు 40 శాతం మంది తమ నియోజకవర్గాల్లో పోలైన మొత్తం ఓట్లలో 50 శాతం కంటే తక్కువ ఓట్లను సాధించారని పేర్కొంది. 2026లో జరిగిన బంగాల్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం 93.7 శాతంగా నమోదైందని, ఇది 2021 అసెంబ్లీ ఎన్నికల్లో నమోదైన 82.3 శాతం కంటే అధికమని తెలిపింది. మొత్తం 175 మంది అభ్యర్థులు (60 శాతం) తమ నియోజకవర్గాల్లో పోలైన ఓట్లలో 50 శాతం కంటే ఎక్కువ ఓట్లను సాధించి గెలుపొందారని వెల్లడించింది. 118 మంది అభ్యర్థులు (40 శాతం) సగం కంటే తక్కువ ఓట్లతోనే విజయం సాధించారని స్పష్టం చేసింది. నేర చరిత్ర ఉన్న 191 మంది విజేతల్లో 121 (63 శాతం) మంది 50 శాతం లేదా అంతకంటే ఎక్కువ ఓట్ల వాటాతో విజయం సాధించారు. వీరిలో 107 మంది అభ్యర్థులు ఎటువంటి నేర చరిత్ర లేని (క్లీన్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న) సమీప ప్రత్యర్థులపై గెలుపొందారు. దీనికి భిన్నంగా, ఎటువంటి నేర చరిత్ర లేని 102 మంది విజేతల్లో 51 మంది నేర చరిత్ర ఉన్న అభ్యర్థులపై గెలుపొందారు. అదేవిధంగా కోటీశ్వరులైన 179 మంది విజేతల్లో 62 మంది కోటీశ్వరులు కాని సమీప ప్రత్యర్థులపై జయకేతనం ఎగురవేశారు. ఐదు స్థానాల్లో విజేత మెజారిటీ 1,000 ఓట్ల కంటే తక్కువేనని ఏడీఆర్ తన నివేదికలో పేర్కొంది.

## దిల్లీకి సిద్ధరామయ్య, డీకే శివకుమార్

కర్ణాటక ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన కొద్దిసేపటికే సిద్ధరామయ్య దిల్లీ వెళ్లారు. తదుపరి ప్రభుత్వ ఏర్పాటుపై అధిష్ఠానంతో చర్చించేందుకే ఆయన హస్తిన వెళ్లినట్లు అధికార వర్గాలు తెలిపాయి. తదుపరి ముఖ్యమంత్రిగా భావిస్తున్న డీకే శివకుమార్ కూడా దిల్లీకి పయనమయ్యారు. కాంగ్రెస్ వర్గాల సమాచారం ప్రకారం కొత్త శాసనసభాపక్ష నేత ఎంపిక, మంత్రివర్గ కూర్పుపై సిద్ధరామయ్య, డీకే శివకుమార్ అధిష్ఠానంతో చర్చించనున్నారు. ప్రస్తుతం శివకుమార్ నిర్వహిస్తున్న కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవికి మరొకరిని ఎంపిక చేయడంపైనా చర్చించే అవకాశముంది. రాజ్యసభకు, జాతీయ రాజకీయాల్లోకి వెళ్లబోనని చెబుతున్న సిద్ధరామయ్య, తదుపరి కర్ణాటక ప్రభుత్వంలో ఎలాంటి పాత్ర పోషించనున్నారనేది కూడా ఆసక్తికరంగా మారింది.

**వాతావరణ ప్రభావం- విమానం జయపురకు మళ్లింపు**

సిద్ధరామయ్య ప్రత్యేక విమానంలో దిల్లీకి బయల్దేరారు. అయితే దిల్లీలో ప్రతికూల వాతావరణ పరిస్థితుల దృష్ట్యా సిద్ధరామయ్య ప్రయాణిస్తున్న విమానాన్ని జయపురకు మళ్లించారు. అదే విమానంలో రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్, ూ×జజ ప్రధాన కార్యదర్శి రణదీప్ సింగ్ సూర్జేవాలా, మంత్రులు కె.జె. జార్జ్, బైరతి సురేష్, న్యాయ సలహాదారు పొన్నన్న, శాసన మండలి సభ్యులు డాక్టర్ యతీంద్ర, ూ×జజ కార్యదర్శి అభిషేక్ దత్ ఉన్నారు. దిల్లీ చేరుకున్న అనంతరం సిద్ధరామయ్య కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గేలను కలవనున్నారు. శుక్రవారం దిల్లీలోనే బస చేయనున్న సిద్ధరామయ్య, పార్టీ అగ్రనాయకత్వంతో జరిగే సమావేశంలో మంత్రివర్గ ఏర్పాటు, మంత్రి పదవుల కేటాయింపుపై చర్చించనున్నట్లు సమాచారం.

**మద్దతుదారుల ఆందోళన**

ముఖ్యమంత్రి పదవికి సిద్ధరామయ్య రాజీనామా నిర్ణయానికి వ్యతిరేకంగా ఆయన మద్దతుదారులు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టారు. శివమొగ్గలోని శివప్పనాయక సర్కిల్ వద్ద ఆయన మద్దతుదారులు ధర్నాకు దిగారు. కురుబ సామాజికవర్గానికి చెందిన నేతల ఆధ్వర్యంలో ఈ నిరసన చేపట్టారు. రెండు పొట్టేళ్లను కూడా ఘటనాస్థలానికి తీసుకువచ్చారు. సిద్ధరామయ్య నిర్ణయంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ రోడ్డుపై టైర్లను తగులబెట్టారు. ఆయనకు మద్దతుగా, హైకమాండ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కర్ణాటక ముఖ్యమంత్రిగా కొనసాగాలని డిమాండ్ చేశారు. యాద్గిర్‌లో సిద్ధరామయ్య వీరాభిమాని రాజ్‌కుమార్ అనే వ్యక్తి సుభాష్‌చంద్ర సర్కిల్ వద్ద మౌనప్రదర్శన చేపట్టారు. ఆయన రాజీనామా నిర్ణయంపై ఆవేదన వ్యక్తం చేశారు.

## దీనిని రాజకీయం చేయవద్దని విజ్ఞప్తి

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) ఆన్-స్క్రీన్ మార్కింగ్ (ఓఎస్ఎం) విధానం వివాదాస్పదంగా మారింది. ఈ విధానం కారణంగా తమకు తక్కువ మార్కులు వచ్చాయని, సమాధాన పత్రాలు కూడా తారుమారయ్యాయని కొందరు విద్యార్థులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పందిస్తూ, తమ డిజిటల్ మూల్యాంకన ప్రక్రియ సురక్షితమైనది, పటిష్టమైనదని అన్నారు. అలాగే ఇందులో ఎలాంటి అవకతవకలు జరిగినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని విద్యార్థులు, తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు.

**'దీనిని రాజకీయం చేయవద్దు'**

దిల్లీలో సీబీఎస్ఈ అధికారులతో సమావేశమైన అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, "ఎక్కడైనా పొరపాట్లు జరిగి ఉంటే వాటిని వెంటనే సరిచేస్తాం. విద్యార్థులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటాం" అని తెలిపారు. ఈ వైఫల్యాలకు తాను బాధ్యత వహిస్తున్నట్లు కూడా పేర్కొన్నారు. ఈ విషయంలో విద్యార్థులు, ప్రతిపక్ష నాయకులు లేవనెత్తిన ఆందోళనల గురించి ప్రస్తావిస్తూ, దీనిని రాజకీయం చేయవద్దని ధర్మేంద్ర అందరికీ విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు అదనపు మానసిక ఒత్తిడికి గురికాకుండా చూడటానికే ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన అన్నారు. సీబీఎస్ఈ మూల్యాంకన ప్రక్రియపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణల గురించి మాట్లాడుతూ, "ఏదైనా అసౌకర్యం కలిగితే ప్రభుత్వం తరపున నేనే బాధ్యత తీసుకుంటాను, ఇది రాజకీయాలు చేసే సమయం కాదని అందరినీ కోరుతున్నాను" అని ప్రధాన్ అన్నారు.

**డిజిటల్? రూపంలో 98 లక్షల సమాధాన పత్రాలు**

ఆన్‌స్క్రీన్ మార్కింగ్ విధానం గురించి వివరించిన ధర్మేంద్ర ప్రధాన్, ఈసారి మొత్తం 98 లక్షల సమాధాన పత్రాల కాపీలను డిజిటల్ రూపంలో అందుబాటులో ఉంచామని తెలిపారు. ఒక్కో సమాధాన పత్రంలో సగటున 40 పేజీలు ఉండటంతో మొత్తం 40 కోట్ల పేజీలను స్కాన్ చేసినట్లు చెప్పారు. "ఓఎస్ఎం విధానం అనేది ఒక ముందడుగు. ఇప్పటికే అనేక అంతర్జాతీయ సంస్థలు దీనిని అమలు చేస్తున్నాయి. విద్యార్థులకు పారదర్శకత కల్పించేందుకు ఈ వ్యవస్థను తీసుకొచ్చాం" అని వివరించారు. డిజిటల్ ఇండియా, శాస్త్రీయ పురోగతికి సంబంధించిన ప్రతి అంశాన్ని కొందరు రాజకీయ కారణాలతో వ్యతిరేకిస్తున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఉద్దేశించి ధర్మేంద్ర ప్రధాన్ విమర్శించారు. "రాజకీయాలు తర్వాత చేయొచ్చు. ప్రస్తుతం విద్యార్థులపై మానసిక ఒత్తిడి పెరగకుండా చూడటం ముఖ్యం. మార్కులు, వెరిఫికేషన్, రీ వ్యాల్యుయేషన్‌లతో ఇప్పటికే ఆందోళనలో ఉన్న విద్యార్థులపై మరింత ఒత్తిడి పెంచేలా ప్రకటనలు చేయొద్దు" అని అన్ని వర్గాలకు సూచించారు.

**'ఎలాంటి సాంకేతిక లోపాలు గుర్తించలేదు'**

ఓఎస్ఎం విధానంపై వస్తున్న విమర్శల నేపథ్యంలో సీబీఎస్ఈ కూడా స్పందించింది. ఈ మూల్యాంకన పోర్టల్‌లో ఎలాంటి సాంకేతిక లోపాలు గుర్తించలేదని స్పష్టం చేసింది. ఇది పూర్తిగా సురక్షితమైన ప్లాట్?ఫామ్? అని పేర్కొంది. సమాధాన పత్రాల స్కానింగ్, ప్రాసెసింగ్, అప్‌లోడింగ్ ప్రక్రియలు పటిష్టమైన డిజిటల్ వ్యవస్థ ద్వారా నిర్వహిస్తున్నామని వెల్లడించింది. మే 13న సీబీఎస్ఈ 12వ తరగతి ఫలితాలను విడుదల చేసింది. ఈసారి ఉత్తీర్ణత శాతం గతేడాదితో పోలిస్తే 3 శాతం తగ్గింది. ఇదే సమయంలో కొత్తగా అమలు చేసిన ఆన్‌స్క్రీన్ మార్కింగ్ విధానం కారణంగానే తక్కువ మార్కులు వచ్చాయని కొందరు విద్యార్థులు ఆరోపించారు.

**తారుమారైన సమాధాన పత్రాలు**

దీంతో విద్యార్థులకు సమాధాన పత్రాల స్కానింగ్ కాపీలు అందుబాటులో ఉంచిన బోర్డు వాటిని పరిశీలించి అవసరమైతే పునర్? మూల్యాంకనం కోసం దరఖాస్తు చేసుకోవచ్చని సూచించింది. అయితే ఈ ప్రక్రియలో భాగంగా కొందరు విద్యార్థులు తమ సమాధాన పత్రాలు తారుమారయ్యాయని ఆరోపించారు. దిల్లీకి చెందిన వేదాంత్ అనే విద్యార్థి భౌతికశాస్త్రానికి సంబంధించిన సమాధాన పత్రం తనది కాదని ఫిర్యాదు చేశారు. అలాగే సంజన అనే విద్యార్థిని కూడా తన రసాయనశాస్త్ర సమాధాన పత్రం వేరొకరిదిగా అప్‌లోడ్ అయిందని పేర్కొన్నారు. ఈ ఫిర్యాదులపై స్పందించిన సీబీఎస్ఈ సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చింది.

# తృణమూల్ ఇక చరిత్రేనా...

**కోల్ కత్తా :** పశ్చిమ బెంగాల్‌ను 15 ఏళ్లు ఏకచత్రాధిపత్యంగా పాలించారు మమతా బెనర్జీ. అక్కడి కమ్యూనిస్టు పాలకుల రికార్డును చెరిపేయాలని ప్రయత్నించారు. కానీ అమె అనుసరించిన విధానాలు, భారత వ్యతిరేక ధోరణి, వసలవాదుల అనుకూల వైఖరి, ఇటీవల జరిగిన ఎన్నికల్లో మమతతోపాటు, తృణమూల్ కాంగ్రెస్‌ను బెంగాలీలు చిత్తుగా ఓడించారు. అధికారం కోల్పోవడంతో పార్టీలో ఇప్పుడు లుకలుకలు మొదలయ్యాయి. అధినేత్రి అదేశాలను కూడా గెలిచిన ఎమ్మెల్యేలు లెక్క చేయడం లేదు. దీంతో మమతా బెనర్జీ నాయకత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ప్రస్తుతం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. ఎన్నికలు ముగిసిన వెంటనే పార్టీలో ఉత్పన్నమైన అసంతృప్తి, నాయకుల వలసలు, సంస్థాగత బలహీనతలు మమతా ప్రభుత్వానికి పెద్ద సవాల్‌గా మారాయి. ఇటీవలి ఎన్నికల తర్వాత టీఎంసీ ఆహ్వానించిన ధర్నా కార్యక్రమం పార్టీ బలహీనతను బహిర్గతం చేసింది. మొత్తం ఎమ్మెల్యేలలో కేవలం 40 శాతం మంది మాత్రమే పాల్గొనడం ద్వారా పార్టీలోని వ్యతిరేకత స్పష్టమైంది. తర్వాతి ఎమ్మెల్యేల సమావేశాల్లో హాజరు ఇంకా తగ్గి, 25వ తేదీ నాటికి 40 మందికిపైగా గైర్హాజరు అయ్యారు. హాజరైన ఎమ్మెల్యేలు పార్టీ నిర్వహణను తీవ్రంగా విమర్శించారు. ముఖ్యంగా అభిషేక్ బెనర్జీ నాయకత్వ సామర్థ్యంపై ప్రశ్నలు లేవనెత్తారు. ఫాల్తా నియోజకవర్గం (అభిషేక్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని) అభ్యర్థి జహంగీర్ ఖాన్ విషయంలో తీసుకున్న నిర్ణయం కూడా తీవ్ర అసంతృప్తికి దారితీసింది. ఇది పార్టీలో కుటుంబ ప్రాధాన్యతలపై ఉన్న వ్యతిరేకతను ప్రతిబింబిస్తుంది.పార్టీ సంక్షోభం అసెంబ్లీ స్థాయిలో మాత్రమే కాకుండా స్థానిక సంస్థల వరకు వ్యాపించింది. ఎన్నికలు ముగిసిన వెంటనే ఐదుగురు ఎమ్మెల్యేలు పార్టీని వీడగా, మున్సిపల్ కౌన్సిలర్లు కూడా బయటకు వస్తున్నారు. ఈ వలసలు టీఎంసీ గ్రాస్‌రూట్ స్థాయి బలాన్ని బలహీనపరుస్తున్నాయి. ఆసక్తికరంగా, బీజేపీ ఈ రకమైన టీఎంసీ నాయకులను చేర్చుకోవడానికి ఇష్టపడడం లేదని సంకేతాలు వస్తున్నాయి. దీని వల్ల బయటకు వచ్చిన నాయకులు రాజకీయంగా ఒంటరిగా మారే?ప్రమాదం ఉంది.టీఎంసీ ప్రధాన కార్యాలయం అద్దె భవనంలో ఉండటం, యజమాని ఖాళీ చేయమని నోటీసు ఇవ్వడం పార్టీ స్థితిని సంకేతిస్తోంది. సమావేశాలు నిర్వహించడానికి కూడా తగిన మౌలిక సదుపాయాలు లేని పరిస్థితి ఏర్పడింది. ఇక్కడే మరో కీలక పరిణామం: భారాసాత్ ఎంపీ భారాసాత్ జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా చేయడం. ఇలాంటి రాజీనామాలు పార్టీలోని ఉన్నత స్థాయి అసంతృప్తిని తెలియజేస్తాయి. మమత ఈ సవాళ్లను ఎదుర్కోవడంలో నిస్సహాయతకు గురవుతున్నారని అంచనా వేస్తున్నారు.బెంగాల్‌లో కమ్యూనిస్టు శక్తులు ఇప్పటికీ కొంత పట్టు కలిగి ఉన్నాయి. అయితే రాబోయే ఎన్నికల నాటికి రాజకీయ సమీకరణాలు ఎలా మారతాయో చెప్పడం కష్టం. టీఎంసీలోని ప్రస్తుత సంక్షోభం కొనసాగితే, మమతా నాయకత్వం ఐదేళ్లు కూడా మనుగడ సాగించడం కష్టమే అనిపిస్తోంది. మమతా బెనర్జీ రాజకీయ ప్రయాణం ఎప్పుడూ సవాళ్లతో నిండి ఉంది. కానీ ఈసారి సవాళ్లు పార్టీ లోపలి నుంచి వస్తున్నాయి. అంతర్గత ఐక్యతను పునరుద్ధరించకపోతే, దశాబ్దాల పాలన తర్వాత తృణమూల్ కాంగ్రెస్ వేగంగా క్షీణించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# ఎన్టీఆర్ లేకుంటే కేసీఆర్ నాయకులు అయ్యేవారా?



హైదరాబాద్‌లోని అమీర్‌పేట మైత్రీవనం సర్కిల్‌లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం ఎన్టీఆర్ విగ్రహాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి అభిమానులు భారీగా వచ్చారు. పురుషులతో సమానంగా మహిళలకు ఓటు : భారతదేశం గర్వించదగిన గొప్ప నేత ఎన్టీఆర్ అని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. తెలుగుజాతికి స్ఫూర్తి నింపిన వ్యక్తి ఎన్టీఆర్ అని అన్నారు. దేశ చరిత్ర నుంచి స్ఫూర్తి పొందాలంటే ముగ్గురు జాతిరత్నాలను స్మరించుకోవాలని రేవంత్? అన్నారు. అంబేద్కర్, ఇందిరాగాంధీ, ఎన్టీఆర్ భారతదేశ జాతిరత్నాలంటూ కొనియాడారు. సామాన్యుడికి ఓటు హక్కు ఇచ్చిన అంబేద్కర్‌ను స్మరించుకోవాలి, పురుషులతో సమానంగా మహిళలకు ఓటు హక్కు కల్పించారని తెలిపారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో పరిపాలన చేస్తున్నాం : ఇందిరాగాంధీ ఉక్కు మహిళ అని అన్నారు. ప్రపంచదేశాల ముందు దేశాన్ని తలెత్తుకునేలా ఇందిరాగాంధీ చేశారని సీఎం అన్నారు. నీతి, నిజాయతీ, ఉక్కుసంకల్పం కలిగిన వ్యక్తి ఎన్టీఆర్ అని అన్నారు. హైదరాబాద్‌లో ఎన్టీఆర్ విగ్రహం ఎలా పెడతారని కొందరు ప్రశ్నిస్తున్నారన్న సీఎం, కులాలు, మతాలు, భాషలకు అతీతంగా గర్వించదగిన నేత ఎన్టీఆర్ అని రేవంత్?రెడ్డి అన్నారు. ఇందిరాగాంధీ, ఎన్టీఆర్ స్ఫూర్తితో పరిపాలన చేస్తున్నామని, ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ తనకు జీవితకాలం గుర్తుంటుందంటూ సంతోషం వ్యక్తం చేశారు. ఇందిరాగాంధీ భారత్‌ను ప్రపంచ దేశాల ముందు తలెత్తుకునేలా చేశారని కొనియాడారు. భూసంస్కరణలతో పేదలకు ఎంతో లబ్ధి చేకూర్చారని, తెలుగుజాతిలో స్ఫూర్తి నింపిన నేత ఎన్టీఆర్ అని బడుగు, బలహీనవర్గాల కోసం ఎన్నో కార్యక్రమాలు అమలు చేశారని వివరించారు.

"కాంగ్రెస్ ముఖ్యమంత్రి, పీసీసీ చీఫ్ ఎన్టీఆర్ విగ్రహాన్ని ఎలా ఆవిష్కరిస్తారని కొందరు ప్రశ్నిస్తున్నారు. కులమతాలు, ప్రాంతాలు, భాషలకు అతీతంగా దేశం గర్వించదగిన నాయకుడు ఎన్టీఆర్. అందుకే ఆయన విగ్రహాన్ని హైదరాబాద్ నగర నడిబొడ్డులో ఆవిష్కరించుకున్నాం. నాకు జీవితకాలం గుర్తుండిపోయే మధుర జ్ఞాపకం. ఈ విషయంలో ఎవరు ఎలాంటి విమర్శలు చేసినా భయపడను" – రేవంత్ రెడ్డి, సీఎం కేసీఆర్‌కు రాజకీయ భిక్ష పెట్టింది ఎవరు? : ఆనాడు ఇందిరాగాంధీ తెలంగాణ ప్రాంతం నుంచి మర్రి చెన్నారెడ్డి, పీవీ నరసింహారావు, వెంకటస్వామిలాంటి నేతలను అందించారని, ఎన్టీఆర్ తెలంగాణ ప్రాంతానికి తుమ్మల నాగేశ్వరరావు, కడియం శ్రీహరి, మండవ వెంకటేశ్వరరావు, దేవేందర్‌గౌడ్, మోత్కుపల్లి లాంటి నేతలను అందించారని సీఎం గుర్తు చేశారు. మాజీ సీఎం కేసీఆర్‌కు రాజకీయ భిక్ష పెట్టింది ఎవరు? ప్రశ్నించారు. ఎన్టీఆర్ నీడన బతికిన మీరు ఆయన్ను తక్కువ చేసి మాట్లాడటం సమంజసమా? ఎన్టీఆర్ లేకుండానే నాయకులయ్యారా? నిలదీశారు. ఎన్టీఆర్ ఆశీర్వాదంతోనే పాలితులుగా ఉన్న ఎంతో మంది పాలకులయ్యారని అన్నారు. గ్రామాల్లో పటేల్ పట్వారీ వ్యవస్థను ఎన్టీఆర్ రద్దు చేసి పేదలకు విముక్తి కల్పించారని, ఆయన పేరు పెట్టుకున్న కొందరు నకిలీలు కూడా రాజకీయాల్లో ఉన్నారని పేర్కొన్నారు.

"వ్యవసాయాన్ని పండుగ చేయటమే లక్ష్యంగా పరిపాలన చేస్తున్నాం. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు ఇవ్వాలనే రాజీవ్‌గాంధీ నిర్ణయాన్ని ఎన్టీఆర్ అమలు చేశారు. వచ్చే ఎన్నికల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇస్తాం. ఇందిరమ్మ ఇళ్లలో ఉన్న నిరుపేదలకు టికెట్లు ఇచ్చి ఎమ్మెల్యేలను చేశాం. ఎన్టీఆర్ స్ఫూర్తితోనే ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్నాం" – రేవంత్ రెడ్డి, సీఎం

ప్రాంతానికో, వర్గానికో పరిమితం చేయడం సరికాదు : టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్? మాట్లాడుతూ, ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేస్తామని మాట ఇచ్చామని, నిలబెట్టుకున్నామని తెలిపారు. మాట ఇస్తే కాంగ్రెస్ నిలబెట్టుకుందనడానికి ఇదే నిదర్శనని వెల్లడించారు. ఎన్టీఆర్‌ను ఒక ప్రాంతానికో, వర్గానికో పరిమితం చేయడం సరికాదని సూచించారు. పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన వ్యక్తి ఎన్టీఆర్ అని కొనియాడారు. ఇందిరాగాంధీ, ఎన్టీఆర్ పాలన మాదిరే రేవంత్‌రెడ్డి పరిపాలిస్తున్నారని అన్నారు. రేవంత్ రెడ్డి నేతృత్వంలో పేదలకు సంక్షేమ కార్యక్రమాలు అందుతున్నాయని తెలిపారు. తెలుగువాడి గుండెల్లో నిలబడిన వ్యక్తి ఎన్టీఆర్? : జాతి గర్వించదగిన వ్యక్తి ఎన్టీఆర్ అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కొనియాడారు. ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలనేది జూబ్లీహిల్స్ ప్రజల కోరిక అని అన్నారు. తెలుగువాడి గుండెల్లో చిరస్థాయిగా నిలబడిన వ్యక్తి ఎన్టీఆర్ అని, రేవంత్ రెడ్డి ప్రజారంజక పాలన కొనసాగిస్తున్నారని తెలిపారు.

# సీఎం అంటే కామన్ మ్యాన్

-మొదటిపేజీ తరువాయి

తేల్చిచెప్పారు. ప్రజా జీవితంలో ఉండే అందరం ఓపిగ్గా ఉండాలన్నారు. స్థానిక ఎన్నికల్లో మనమంతా కలిసి సత్తా చాటాలని చెప్పారు. ప్రతి ఎన్నికల్లో గెలవాలని సూచించారు. 2029 ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని ఆదేశాలిచ్చారు. ఎన్డీయే భాగస్వామ్య పార్టీలు, నేతలు, శ్రేణులతో సమన్వయంతో పాటు సఖ్యతతో మెలగాలని సూచించారు. 'గొడ్డలి పార్టీ నెవర్ ఎగైన్, ఎన్డీయే ఎగైన్ అండ్ ఎగైన్' అనే నినాదమే మనది కావాలని చంద్రబాబు వ్యాఖ్యానించారు. తెలుగుదేశం పార్టీ ఓ ట్రెండ్ సెట్టర్ అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. రికార్డులు సృష్టించాలన్నా, బద్ధలు కొట్టాలన్నా, తిరిగి రాయాలన్నా అది టీడీపీకే సాధ్యమన్నారు. వర్చువల్ మహానాడు అదరగొట్టిందని ఇది సరికొత్త అనుభవమని చెప్పారు. వర్చువల్?గా 16.75 లక్షల మంది ఇందులో పాల్గొనటం చరిత్రన్నారు. ప్రపంచంలోనే హైబ్రీడ్ కాన్ఫరెన్స్ ఎలా పెట్టాలో మహానాడు చూపిందని పేర్కొన్నారు. ఇదో పెద్ద ప్రయోగమని 1875 క్లస్టర్లు, 12 దేశాల ప్రజలు ఆన్‌లైన్‌లోకి వచ్చారని తెలిపారు. కార్యకర్తే అధినేత అనేది ఇందులో అడుగడుగునా ప్రతిబింబించిందని చెప్పారు. ఈ మహానాడు తనకు ఓ నూతన స్ఫూర్తిని ఇచ్చిందని, కొండనైనా ఢీకొనే శక్తి ఇచ్చినట్లు చంద్రబాబు వివరించారు. ఆకాశమే హద్దుగా కార్యకర్తలు ఎదిగే పరిస్థితి : కష్టపడే కార్యకర్తలు తెలుగుదేశంలో ఆకాశమే హద్దుగా ఎదుగుతారనటానికి రామ్మోహన్ నాయుడు, అనిత లాంటి వారు ఉదాహరణని చంద్రబాబు పేర్కొన్నారు. రామ్మోహన్ నాయుడు బాగా చదువుకున్నారని, రాజకీయాలు కూడా బాగా చేస్తున్నారని అభినందించారు. ఆయన మూడోసారి ఎంపీ అయ్యారని, నాలుగోసారి కూడా ఎంపీ అవుతారని జోస్యం చెప్పారు. అనిత టీచర్ నుంచి హోంమంత్రి వరకు అంచెలంచెలుగా ఎదిగారని తెలిపారు. "ఆకాశమే హద్దుగా కార్యకర్తలు ఎదిగే పరిస్థితి వస్తుంది. యువ నాయకులు ఒకరికొకరు పోటీ పడుతున్నారు. మిమ్మల్ని చూసిన తర్వాత నేను కూడా పోటీ పడాల్సి వస్తుంది. ప్రతి మహానాడులో తీర్మానాలపై జోక్యం చేసుకునేవాడిని. కానీ ఈసారి ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని మాత్రమే తీర్మానం చేశాను. ప్రతి తీర్మానంపై 23 నెలల పాలనను విశ్లేషించారు. పార్టీ ఏం సాధించింది? భవిష్యత్?లో ఏం సాధిస్తుందని? చెప్పారు.

'శాశ్వతంగా పార్టీని మోసింది, మోస్తోంది, మోయబోయేది కార్యకర్తలే. నాయకులు తోక జాడిస్తే అదే చివరి రోజు. తెలుగుదేశం శ్రేణుల బీమా కోసం రూ.150 కోట్లు ఖర్చు చేశాం. 35 ఏళ్ల క్రితం ఫ్యామిలీ బిజినెస్ పెట్టించాను. నా వద్ద నుంచి ఏమీ ఆశించరు. నాపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని శాశ్వతంగా నిలబెట్టుకోవాల్సి ఉంది. విజయాలకు కారణమైన టీడీపీ కుటుంబానికి శాశ్వతంగా రుణపడి ఉన్నా. మై హెల్త్ యాప్ ద్వారా టీడీపీ కుటుంబసభ్యులను ఆదుకుంటాం. కేడర్?ను నీతి, నిజాయితీగా పైకి తీసుకొచ్చే బాధ్యత తీసుకుంటా. ఎథికల్, ఎకనమిక్, ఎంపవర్‌మెంట్ సాధించడం నా కోరిక' అని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

**రాష్ట్రాభివృద్ధికి ప్రధాని సహకరిస్తున్నారు**

ఆనాడు హైదరాబాద్‌ను అభివృద్ధి చేశామని చంద్రబాబు గుర్తుచేశారు. విభజన తర్వాత తెలంగాణకు హైదరాబాద్ వెళ్లినా బాధపడలేదన్నారు. రెండు ప్రాంతాలకు సమన్యాయం చేయాలని ఆరోజు కోరినట్లు చెప్పారు. 2014 నుంచి 2019 వరకు రాత్రింబవళ్లు కష్టపడి పనిచేశామని తెలిపారు. పార్టీ, నాయకుడిపై నమ్మకంతో అమరావతి కోసం రైతులు భూములిచ్చారని వివరించారు. రాష్ట్రంలో అభివృద్ధి పనులకు ప్రధాని మోదీ సహకరిస్తున్నట్లు పేర్కొన్నారు. వెంటిలేటర్‌పై ఉన్న ఆర్థిక వ్యవస్థను, కేంద్ర ఆర్థిక సాయంతో ఆక్సిజన్ అందించామని గుర్తుచేశారు.

## ఏపీలో 457 కి.మీ. హైస్పీడ్ రోడ్ కారిడార్

సరకు రవాణా వేగంగా సాగేలా పశ్చిమ బెంగాల్‌లో ఖరగ్‌పూర్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి వరకు నిర్మించతలపెట్టిన హైస్పీడ్ రోడ్ కారిడార్ మన రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాల మీదుగా వెళ్లనుంది. కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ (మోర్త్) మొత్తం మూడు ఆప్షన్లను సూచించింది. అందులో ఏజెన్సీ ప్రాంతాన్ని ఎక్కువగా కవర్‌చేసేలా ఉన్న ఎలైన్‌మెంట్‌కు కూటమి ప్రభుత్వం ప్రాథమికంగా అంగీకారం తెలిపింది. ఈ 4 వరుసల కారిడార్‌కు ఆనుకొని అనేక ప్రాంతాలు అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంది. అందుకే రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఎన్‌హెచ్-516కి సమాంతరంగా.. మోర్త్ సూచించిన ఆప్షన్ 1: కోల్‌కతా-చెన్నై మధ్య ప్రస్తుతమున్న ఎన్‌హెచ్-16లో ఖరగ్‌పూర్ నుంచి విజయవాడ సమీపంలో అమరావతి ఔటర్ రింగ్‌రోడ్ వరకు హైవేను హైస్పీడ్ కారిడార్‌గా మార్చేలా సూచించారు. ఆప్షన్ 2: ఇందులో పశ్చిమబెంగాల్, ఒడిశాలలోని బహరగోరా, ఝార్ఖండ్, భంజనగర్, కామాఖ్యనగర్, పద్మాపూర్ మీదుగా రాష్ట్రంలోకి ప్రవేశించి పార్వతీపురం, కురుపాం, సాలూరు, పాడేరు, చింతపల్లి, గోకవరం, మక్కువ, అరకు, కన్నాపురం, కామవరపుకోట, ద్వారకా తిరుమల, జంగారెడ్డిగూడెం, దేవరపల్లి, నూజివీడు మీదుగా ఆగిరిపల్లి సమీపంలో అమరావతి ఔటర్ రింగ్ రోడ్‌లో కలుస్తుంది.ఆప్షన్ 3: ఖరగ్‌పూర్ నుంచి పశ్చిమబెంగాల్, ఝార్ఖండ్, ఒడిశా మీదుగా వచ్చి ఏపీ సరిహద్దులో కుంట మీదుగా చింతూరు, చింతలపూడి, కుకునూరు, విస్సన్నపేట మీదుగా మైలవరం సమీపంలో అమరావతి ఔటర్ రింగ్ రోడ్‌ను కలిసేలా ప్రతిపాదించారు.

ఇందులో రెండో ఆప్షన్ ఎలైన్‌మెంట్‌కు రాష్ట్రప్రభుత్వం సమ్మతి తెలిపింది. ఇది విజయనగరం-రాజమహేంద్రవరం మధ్య ఏజెన్సీ ప్రాంతాల మీదుగా విస్తరణ పనులు జరుగుతున్న 'ఎన్‌హెచ్-516ఇ'కి అనేక చోట్ల సమాంతరంగా వెళ్తుంది.

ప్రాజెక్ట్‌కు రూ.75,629 కోట్లు అవుతుందని అంచనా : రాష్ట్ర ప్రభుత్వం సమ్మతి తెలిపిన మార్గం మొత్తం 1,107 కి.మీ. (పశ్చిమబెంగాల్‌లో 65 కి.మీ., ఝార్ఖండ్- 63, ఒడిశా- 522, ఏపీలో 457 కి.మీ.). ఇందులో 1,057 కి.మీ. గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ ఉంది. అలాగే ఆంధ్రప్రేదశ్?లో అల్లూరి సీతారామరాజు జిల్లాలో 202 కి.మీ., పార్వతీపురం మన్యం జిల్లాలో 116 కి.మీ., ఏలూరు జిల్లాలో 111 కి.మీ., తూర్పుగోదావరి జిల్లాలో 28, మేరకు ఉంటుంది. ఈ కారిడార్ ప్రస్తుతమున్న కోల్‌కతా-చెన్నై హైవేకు గరిష్ఠంగా 120 కి.మీ., కనిష్ఠంగా 20 కి.మీ., దూరం నుంచి వెళ్లనుంది.

అలాగే గంటకు 100 నుంచి 120 కి.మీ. వేగంతో వాహనాలు వెళ్లేలా దీన్ని నిర్మించాలని అధికారులు భావిస్తున్నారు. ప్రాజెక్ట్‌కు రూ.75,629 కోట్లు అవుతుందని అంచనా ఉంది.

## ఫ్యూచర్ సిటీ దేశానికే తలమానికం

-మొదటిపేజీ తరువాయి

నిలవబోతుందని పేర్కొన్నారు.

నగర అభివృద్ధి పనులకు మరింత వేగం

ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయం ద్వారా నగర అభివృద్ధి పనులకు మరింత వేగం చేకూరుతుందని అన్నారు. నిర్మాణ పనులను నాణ్యతతో, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. దేశంలోనే అత్యుత్తమ మౌలిక వసతులు, సాంకేతిక పరిజ్ఞానం, సుస్థిర అభివృద్ధి ప్రమాణాలతో ఫ్యూచర్ సిటీని తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రులు స్పష్టం చేశారు.



"లక్షలాది మందికి ఉపాధి, వారికి ఉద్యోగ భద్రత కల్పించే ఒక మంచి ఆలోచనతో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నాం. ప్రపంచంలో ఏ దేశానికి ఏ రాష్ట్రానికి రాని ఆలోచన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సహచర మంత్రివర్గానికి వచ్చింది. సీఎం, మంత్రివర్గ కలిసి చేస్తున్న ఈ మంచి కార్యక్రమానికి ప్రతిపక్షాలు కూడా సహకరిస్తాయని అనుకుంటున్నాం. మరింత ఉత్సాహంతో పని చేస్తున్నాం. ఫ్యూచర్ సిటీ దేశానికి తలమానికం కానుంది. ఫ్యూచర్ సిటీ దేశానికే ఆదర్శంగా నిలిచే విధంగా రూపుదిద్దుకుంటోంది"

"అత్యుత్తమ సాంకేతికతతో రాష్ట్ర ప్రభుత్వం ఫ్యూచర్ సిటీని నిర్మిస్తోంది. గ్లోబల్ ప్రజెన్స్ ఉన్న కార్యాలయాలు కూడా ఫ్యూచర్ సిటీ నుంచే నడపాలనే ఉద్దేశ్యంతో ముందుకు వెళ్తున్నాం. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్శిటీని ఏర్పాటు చేస్తున్నాం. బీఆర్ఎస్ నేతలు హరీశ్ రావు, కేటీఆర్?లు ఏదిపడితే అది మాట్లాడతారు. హైదరాబాద్? బ్రాండ్ ఇమేజ్?ను చెడగొట్టే ప్రయత్నం ఎవరూ చేసిన ఊరుకునేది లేదు. మీరు ప్రయత్నం చేస్తూనే ఉండండి. మేము మా పనితనం చూపిస్తూనే ఉంటాం" – శ్రీధర్ బాబు, మంత్రి

## సంక్షేమ పథకాలపై యూనిఫైడ్ కార్డు

-మొదటిపేజీ తరువాయి

అందుబాటులోకి వస్తుందని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ డేటాను అన్ని కోణాల్లో ఏఐ సహాయంతో విశ్లేషిస్తే సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత పెరుగుతుందని అన్నారు. ఈ విధానం అనుసరించడం వల్ల నిజమైన అర్హులకు పథకాలు మరింత కచ్చితంగా చేరుతాయని, అదే సమయంలో అనర్హులను గుర్తించడం సులభమవుతుందని అభిప్రాయపడ్డారు. ప్రతి శాఖ వేర్వేరుగా కార్డులు ఇచ్చే పద్ధతికి బదులు, ఐటీ శాఖ ఆధ్వర్యంలో సమగ్ర సంక్షేమ కార్డ్ ఉండాలని రేవంత్ రెడ్డి సూచించారు. టెక్నాలజీపై పట్టున్న, చురుగ్గా పనిచేసే యువ అధికారులను ఈ ప్రక్రియకు వినియోగించాలని చెప్పారు. ఈ కార్డులో ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి, ఫీజు రీయింబర్స్‌మెంట్, కార్మిక శాఖ, విద్యా శాఖ, బీమా పథకాలు, ప్రభుత్వం తీసుకొస్తున్న బీమా పథకాల వివరాలు ఉండాలని చెప్పారు. అవసరమైతే ఆధార్ నంబర్ తరహాలో రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక యూనిక్ ఐడెంటిటీ నంబర్ ఇచ్చేలా ఆలోచించాలని తెలిపారు.

ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల ఎస్?ఈఈఈపీసీ సర్వే వివరాలను కూడా ఈ కార్డ్‌కు అనుసంధానం చేయాలని చెప్పారు. లబ్ధిదారుల వివరాలతో పాటు వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఖ్య, ఇతర వివరాలను సేకరించాలని ఐటీ శాఖను ఆదేశించారు. ఏఐ ఆధారిత ప్రొఫైలింగ్ జరగాలని సూచించారు. ఎక్కడైనా మరణ ధృవీకరణ పత్రం జారీ అయితే, ఆ సమాచారం చేయూత పెన్షన్ డేటాబేస్‌కు చేరాలని, వెంటనే దాని ఆధారంగా చర్యలు మొదలయ్యేలా ఉండాలని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య ప్రొఫైల్‌ను కూడా సమగ్ర సంక్షేమ కార్డుతో లింక్ చేయాలని చెప్పారు. కేరళం నుంచి గల్ఫ్‌కు వలస వెళ్లే ఉద్యోగులకు అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని రేవంత్ రెడ్డి సూచించారు. నైపుణ్యాభివృద్ధి, శిక్షణ కార్యక్రమాలతో పాటు, పాస్‌పోర్టులు, వీసాల జారీకి సంబంధించిన సమాచారం ఒకేచోట అందుబాటులో ఉంచితే, అనధికార ఏజెంట్ల ప్రమేయం తగ్గుతుందని తెలిపారు. పేదలకు సంక్షేమ ఫలాలు ఖచ్చితంగా చేరేలా, తెలంగాణ ప్రభుత్వం అమలు చేసే ప్రతి పథకం ప్రభావాన్ని అంచనా వేసేలా సమగ్ర సంక్షేమ కార్డు ఉండాలని సీఎం స్పష్టం చేశారు. ఈ కార్డులపై మంత్రి శ్రీధర్ బాబు, సీఎస్ కె. రామకృష్ణారావు సీఎం ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్ రెడ్డి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టితో పాటు ఇతర ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి ఈ విషయంపై ప్రత్యేకంగా చర్చించారు.

## తెలంగాణలో రాబోయేది

## బిజెపి డబుల్ ఇంజన్ సర్కారే:

**రంగారెడ్డి జిల్లా మే 28** మోయినాబాద్‌లో నిర్వహించిన "పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ్ మహాభియాన్" రంగారెడ్డి జిల్లా బిజెపి ప్రశిక్షణా తరగతుల్లో బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ముఖ్య అతిథిగా పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మారుతున్న కాలంతో పాటు పార్టీ సిద్ధాంతాలు, విధానాలపై కార్యకర్తలకు పూర్తి అవగాహన కల్పించడానికే ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.మహిళల, పిల్లల హక్కుల కోసమే 'యూనిఫామ్ సివిల్ కోడ్' (జఅఅ):బిజెపి సిద్ధాంతంలో, మేనిఫెస్టోలో భాగమైన ఆర్టికల్ 370 రద్దును ఏ విధంగా సాధించామో, అదే విధంగా దేశానికి యూనిఫామ్ సివిల్ కోడ్ (జఅఅ) కూడా అంతే అవసరమని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే ఉత్తరాఖండ్, గోవా, అస్సాం రాష్ట్రాలు ఈ చట్టాన్ని తీసుకొచ్చాయని.. అస్సాం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అత్యంత ప్రశంసనీయమని కొనియాడారు."జఅఅ అంటే ఏదో ఒక మతానికి వ్యతిరేకం కాదు. దీనివల్ల దేశంలోని మహిళలకు, చిన్న పిల్లలకు చట్టబద్ధమైన ఆస్తి హక్కులు, అడాప్షన్ హక్కులు లభిస్తాయి. షెడ్యూల్డ్ తెగల (ఀతీఙఎజీశ్రీఙ) సంస్కృతీ, సాంప్రదాయాలకు మినహాయింపు ఇస్తూ.. దేశంలోని మిగతా అందరికీ ఒకే సివిల్ చట్టం వర్తిస్తుంది. ట్రిపుల్ తలాక్ రద్దుతో ముస్లిం మహిళలకు న్యాయం చేసిన ప్రధాని నరేంద్ర మోదీ గారిని దేశవ్యాప్తంగా మహిళలు స్వాగతిస్తున్నారని ఆయన గుర్తుచేశారు.ఓటర్ల జాబితా ప్రక్షాళన (ూఎఖీ) పై సుప్రీంకోర్టు ఇచ్చిన స్పష్టమైన తీర్పును భారతీయ జనతా పార్టీ స్వాగతిస్తోందని రాంచందర్ రావు గారు తెలిపారు. దొంగ ఓటర్లు, చనిపోయిన వారి ఓట్లను తొలగించేందుకు ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా తీసుకున్న ఈ నిర్ణయంపై కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. గతంలో కాంగ్రెస్ హయాంలో 10 సార్లు ఈ ప్రక్షాళన జరిగినా మాట్లాడని వారు.. ఇప్పుడు ఓటమి భయంతోనే ఈవీఎంలపై, ఎస్ఐఆర్ (ూఎఖీ) లపై సాకులు వెతుకుతున్నారని, తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఎద్దేవా చేశారు.మరోవైపు కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీల మెంటాలిటీ ఒకటేనని, యువతను రెచ్చగొట్టి రైల్వే స్టేషన్లు, ఆఫీసులు తగలబెట్టించేటువంటి విచ్ఛిన్నకర శక్తులకు ఇరు పార్టీల నేతలు మద్దతు ఇస్తున్నారని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులను, విద్యార్థులను మోసం చేస్తే.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఉద్యోగాలు ఇవ్వకుండా, ఫీజ్ రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా విద్యార్థులు, యువత భవిష్యత్తుతో ఆడుకుంటోందని విమర్శించారు. రైతులకు ఇస్తామన్న రూ. 15,000 రైతు భరోసా ఇప్పటివరకు సరిగ్గా ఇవ్వలేదని, ఒకటో తేదీన జీతాలు ఇస్తామని గొప్పలు చెప్పుకోవడం తప్ప ఉద్యోగులకు, రిటైర్డ్ సిబ్బందికి పెన్షన్లు, బెనిఫిట్స్ ఇవ్వలేని చేతగాని స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని ధ్వజమెత్తారు.ఇటీవల కురిసిన అకాల వర్షాలకు అనేక చోట్ల కొనుగోలు కేంద్రాల్లోని రైతుల ధాన్యం, మక్కలు, జొన్నలు తడిసి ముద్దయ్యాయని, కొనే నాథుడు లేక రైతులు కన్నీరు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. "చివరి గింజ వరకు కొంటామని" చెప్పి, మాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం, తన చేతగానితనాన్ని కేంద్రం మీదకు నెడుతోందని విమర్శించారు. రైతుల హక్కుల కోసం బిజెపి చేపట్టిన 'రైతు గోస – బిజెపి భరోసా' యాత్ర నిర్మల్ (సారంగపూర్) తో ముగిసినా.. రైతులకు న్యాయం జరిగే వరకు బిజెపి పోరాటం ఆగదని హెచ్చరించారు. బిజెపి నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టి, హౌస్ అరెస్టులతో భయపెట్టాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.ప్రధాని నరేంద్ర మోదీ గారు ఈ దేశంలో అవినీతి రహిత, ప్రజా సంక్షేమ పాలన అందిస్తూ సరికొత్త రికార్డు సృష్టించారని కొనియాడారు. ప్రపంచ ఆర్థిక సంక్షోభంలో ఉన్నా.. భారతదేశం ఆర్థికంగా దూసుకుపోతూ త్వరలోనే మూడో స్థానానికి చేరబోతుందని, మోదీ గారి దార్శనికతతో 'వికసిత్ భారత్' సాధించి ప్రపంచంలోనే మొదటి స్థానంలో నిలుస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణకు కేంద్రం గత 12 ఏళ్లలో సుమారు రూ. 13 లక్షల కోట్లు కేటాయించిందని.. ప్రతినెలా 5 కిలోల ఉచిత బియ్యం, జాతీయ రహదారులు, ములుగులో సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ, బీబీనగర్ ఎయిమ్స్ (ంఎఎఓూ), వరంగల్-ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టులు, రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ పునరుద్ధరణ, జన్ ధన్ ఖాతాలు ఇవన్నీ మోదీ గారి వల్లే సాధ్యమయ్యాయని గుర్తుచేశారు.కార్యకర్తల శ్రమ, త్యాగాలు, ఎందరో సీనియర్ నాయకుల త్యాగాలతో నిర్మితమైన బిజెపి.. క్రమశిక్షణ గల 'క్యాడర్ బేస్' పార్టీ నుండి నేడు ప్రజల్లోకి దూసుకెళ్లి 'మాస్ బేస్' పార్టీగా అవతరిస్తోందని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పట్ల విసిగిపోయిన యువత, మహిళలు, ఐటీ ఉద్యోగులు, విద్యావంతులు ఒక కొత్త రాజకీయ మార్పును కోరుకుంటున్నారని, ఆ నమ్మకమే బిజెపి అని తెలిపారు.రాబోయే రోజుల్లో తెలంగాణలో బిజెపి అధికారంలోకి రావడం ఖాయమని, ఇక్కడ కూడా "డబుల్ ఇంజన్ సర్కార్" ఏర్పాటు కోసం రంగారెడ్డి జిల్లా నుంచే కార్యకర్తలంతా విభేదాలు పక్కనపెట్టి, సమన్వయంతో ఒక బృహత్తర లక్ష్యంతో కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

## జెన్‌జీ ఆశించే విధంగా సంస్కరణలు

-మొదటిపేజీ తరువాయి

మంగళగిరిలో ఆయన మీడియాతో చిట్?చాట్ నిర్వహించారు. సంస్కరణలపై ఇగోలు లేకుండా కూర్చుని ఎంతైనా చర్చించేందుకు తెలుగుదేశం పార్టీ అందరి వేదికని లోకేశ్ స్పష్టం చేశారు. రెండో రోజు మహానాడులో మధ్యాహ్నం వరకూ 11.27లక్షల మంది హాజరయ్యారని పేర్కొన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇస్తే తప్పేంటని ప్రశ్నించారు. అతివలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు టీడీపీ కట్టుబడి ఉందని తెలిపారు. అంతేకాక నియోజకవర్గాల్లో సమర్థ మహిళ నాయకత్వాన్ని ప్రోత్సహిస్తామని వివరించారు. ఈ సంస్కరణను ఓ క్రమపద్ధతిలో చేసి చూపెడతామన్నారు. డీఎస్సీలో ఒక్క నియామకమైనా నిబంధనలకు విరుద్ధంగా ఉందనే విషయాన్ని చూపే ధైర్యం గొడ్డలి పార్టీ నేతకు ఉందా అని లోకేశ్ ప్రశ్నించారు. దీనిపై ఎన్ని కోర్టు కేసులు వేసినా న్యాయస్థానం అన్నింటికీ క్లీన్?చిట్ ఇచ్చిందని గుర్తు చేశారు. జగన్ ట్యూబ్?లైట్ కాబట్టే నియామకాలు జరిగిన ఆరు నెలల తర్వాత డీఎస్సీపై అసత్య ప్రచారాలు చేస్తున్నాడని మండిపడ్డారు. రాజారెడ్డి రక్తచరిత్రపై జగనే ప్రస్తావన తెచ్చి ప్రజలందరికీ తెలిసేలా చేశారని లోకేశ్ ఎద్దేవా చేశారు.

# సంపాదకీయం

## ఒకవైపు శాంతి మంత్రం.. మరోవైపు యుద్ధ తంత్రం!

పశ్చిమాసియాలో త్వరలోనే శాంతి నెలకొంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచానికి శుభవార్త చెప్పారు. ఇరాన్ కూడా యురేనియం వదులుకునేందుకు సిద్ధమైంది. ఈ తరుణంలో ఇక అంతా మంచే జరుగుతుందని భావిస్తున్న వేళ అమెరికా ఆత్మరక్షణ పేరుతో ఇరాన్‌పై భీకర దాడులు మొదలు పెట్టింది. మరోమారు తన సైనిక బలాన్ని ప్రదర్శించింది. ఇరాన్ దక్షిణ తీర ప్రాంతాల్లోని బందర్ అబ్బాస్, క్వెష్మ్ పోర్టు సమీపంలోని సైనిక స్థావరాలు, క్షిపణి లాంచ్ ప్యాడ్లు, సముద్రంలో మైన్లు (మందుపాతరలు) పరచే బోట్లు, నేవీ బేస్‌లపై తీవ్ర దాడులు జరిపింది. అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రతినిధి కెప్టెన్ టిమోతీ హాకిన్స్ ఈ దాడులను “ఆత్మరక్షణ చర్య”గా సమర్థించారు. ఇరాన్ తీరం వెంట ఉన్న క్షిపణి స్థావరాలు తమ విమాన వాహక నౌకలు, యుద్ధ నౌకలకు నేరుగా ముప్పు కలిగించాయని, మందుపాతరలు పరచడానికి ప్రయత్నించే బోట్లను ధ్వంసం చేసినట్లు వెల్లడించారు. లర్క్ ద్వీపంలో కనీసం నలుగురు మరణించినట్లు సమాచారం. ఈ దాడుల్లో ఇజ్రాయెల్ కూడా పాల్గొన్నట్లు కొన్ని వార్తా వర్గాలు పేర్కొన్నాయి.ప్రపంచ ఇంధన మార్గాల్లో ఆక్సిజన్‌గా భావించే హోర్ముజ్ జలసంధి దాదాపు మూడు నెలలుగా స్తబ్దంగా మారింది. అమెరికా?ఇజ్రాయెల్ కూటమి, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు ఈ కీలకమైన నౌకా మార్గాన్ని అడ్డుకోవడంతో, గ్లోబల్ ఆర్థిక వ్యవస్థకు తీవ్రమైన హెచ్చరిక సంకేతాలు కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితి 1967 సూయజ్ కాలువ సంక్షోభాన్ని గుర్తు చేస్తోంది. 1967 అరబ్?ఇజ్రాయెల్ యుద్ధంలో సూయజ్ కాలువలో 15 నౌకలు చిక్కుకుపోయి, ఎనిమిదేళ్లపాటు అక్కడే కూరుకుపోయాయి. ‘ఎల్లో ఫ్లీట్’గా ప్రసిద్ధి చెందిన ఆ నౌకలు తుప్పు పట్టి, చరిత్రలో ఒక హెచ్చరికగా మిగిలిపోయాయి. ఇప్పుడు హోర్ముజ్‌లోనూ అదే దృశ్యం ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎన్ని రోజులు ఈ దిగ్బంధనం కొనసాగుతుందో, ఎన్ని ఓడలు ఈ జలసంధిలో నిలిచిపోతాయో ప్రస్తుతం ఎవరూ ఖచ్చితంగా చెప్పలేకపోతున్నారు. ఈ సంక్షోభం సైన్స్ ఫిక్షన్ లాగా అనిపించినా, వాస్తవం మాత్రం తీవ్రంగా ఉంది.సంక్షోభం ప్రారంభం నుంచి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ స్పష్టమైన దూరదృష్టితో ముందుకు వెళ్తోంది. హోర్ముజ్‌పై ఆధారపడకుండా చమురు రవాణా చేసేందుకు ప్రత్యామ్నాయ పైప్‌లైన్‌ల నిర్మాణాన్ని వేగవంతం చేసింది. 2027 నాటికి ఈ ప్రాజెక్టు పూర్తి కావొచ్చని అంచనాలు ఉన్నాయి. దౌత్య చర్చలు జరుగుతున్నా, దీర్ఘకాలిక ఉద్రిక్తతలు కొనసాగే అవకాశం ఉందని అబుదాబి అంచనా వేస్తోంది. ఇది ఒక దేశం మాత్రమే కాదు, మొత్తం గల్ఫ్ ప్రాంతం యొక్క భద్రతా వ్యూహంలో భాగం.సంక్షోభం త్వరలో ముగిసి, చమురు ధరలు అనియంత్రితంగా పెరగకుండా సమతుల్యత నిలుస్తుందని వారు నమ్ముతున్నారు. అయితే ఈ ఆశలు ఎంతవరకు వాస్తవ రూపం దాల్చేయనేది ప్రశ్నార్థకం. ప్రపంచవ్యాప్తంగా రోజుకు సుమారు 20 మిలియన్ బ్యారెల్స్ చమురు సరఫరా అంతరాయం కలిగింది. సౌదీ అరేబియా, యూఏఈ వంటి దేశాలు ప్రత్యామ్నాయ మార్గాలు, అత్యవసర నిల్వలు విడుదల చేయడం ద్వారా తాత్కాలికంగా పరిస్థితిని నియంత్రించగలిగాయి. కానీ ఈ నిల్వలు ఎప్పటికప్పుడు అయిపోతాయి.ఇరాన్ సంకల్పం. ఆర్థిక ఒత్తిడిఇరాన్ వైపు చూస్తే, తీవ్రమైన ఆర్థిక సవాళ్ల మధ్య కూడా వెనక్కి తగ్గే సంకేతాలు కనిపించడం లేదు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, కరెన్సీ విలువ క్షీణత వంటి సమస్యలు ఉన్నప్పటికీ, ఉనికి కోసం పోరాటం కొనసాగుతోంది. రెండు వైపులా ‘ముందుగా ఎవరు ఒప్పుకుంటారు’ అని వేచి చూడడం జరుగుతోంది. ఇలాంటి స్థిరత్వం లేని ఎదురు చూపు ప్రపంచానికి మరింత నష్టం కలిగిస్తుంది. హోర్ముజ్‌ను శాశ్వతంగా మూసివేయడం ఎవరికీ లాభదాయకం కాదు. త్వరిత తాత్కాలిక ఒప్పందం అవసరం. అయితే గత చరిత్ర చెప్పినట్లు, ఒక్కసారి సాధారణమైన సంక్షోభాలు కాలక్రమేణా దీర్ఘకాలిక సమస్యలుగా మారే ప్రమాదం ఉంది. ప్రపంచ ఇంధన భద్రత ఇకపై భౌగోళిక రాజకీయాలపై ఆధారపడి ఉండదు. వైవిధ్యపరమైన సరఫరా మార్గాలు, పునరుత్పాదక ఇంధనాల వైపు వేగవంతమైన మార్పు, ప్రాంతీయ దేశాల మధ్య సహకారం ? ఇవి భవిష్యత్ కోసం అనివార్యమైన అడుగులు.చరిత్ర నుంచి నేర్చుకోకపోతే, ఆర్థిక వ్యవస్థలు మాత్రమే కాదు, సమగ్ర ప్రపంచ స్థిరత్వం కూడా ప్రమాదంలో పడుతుంది. సమయం ఇంకా ఉంది, కానీ చాలా తక్కువగా ఉంది.ఏప్రిల్ 7న ప్రకటించిన సీజ్‌ఫైర్ అమలులో ఉన్నప్పటికీ ఇరాన్ తన సైనిక సామర్థ్యాన్ని వేగంగా పునరుద్ధరిస్తోందని అమెరికా ఇంటెలిజెన్స్ గుర్తించింది. ఇది ఇరాన్‌కు స్పష్టమైన హెచ్చరిక. దోహాలో జరుగుతున్న కీలక దౌత్య ప్రయత్నాలుదాడులు జరుగుతున్న అదే సమయంలో ఖతార్ రాజధాని దోహాలో ఇరాన్?అమెరికా దూతల మధ్య కీలక చర్చలు సాగుతున్నాయి. ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మహమ్మద్ బాఘర్ ఘాలిబఫ్ నేతృత్వంలోని బృందం ఈ సంప్రదింపుల్లో పాల్గొంటోంది. ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయీ మాట్లాడుతూ అనేక అంశాలపై అవగాహన కుదిరినట్లు, అయితే ఇంకా కొన్ని కీలక సమస్యలు మిగిలి ఉన్నాయని తెలిపారు.ఇరాన్ ప్రధాన దృష్టి యుద్ధ ముగింపు (లెబనాన్‌తో సహా) వైపే ఉందని, ప్రస్తుతం అణు అంశాలను చర్చించడం లేదని స్పష్టం చేశారు.యుద్ధం పూర్తిగా ముగిస్తే 60 రోజుల వ్యవధిలో అణు సంబంధిత చర్చలు ప్రారంభించవచ్చని సంకేతాలిచ్చారు. ఖతార్ మధ్యవర్తిత్వం ఈ చర్చలకు కీలకమవుతోంది. లెబనాన్‌పైనా దాడులు జరగకుండా ఒప్పందం చేసుకునే అవకాశం ఉంది.ఈ తరుణంలో అమెరికా 33 మిసైల్ సైట్లలో దాదాపు 30ను తిరిగి కార్యకలాపాలు ప్రారంభించింది. దేశవ్యాప్తంగా 70 శాతం మొబైల్ మిసైల్ లాంచర్లను మోహరించింది. ఇది ఇరాన్ ఎదురుదాడి సామర్థ్యాన్ని ఇప్పటికీ కాపాడుకోవాలన్న సంకల్పాన్ని ప్రతిబింబిస్తోంది. మరోవైపు అమెరికా దాడులు ఇరాన్‌ను మరింత ఒత్తిడికి గురి చేసి చర్చల టేబుల్ వద్ద రాజీకి సిద్ధం చేయడానికి ఉద్దేశించినట్లు కనిపిస్తోంది. ఈ ద్వంద్వ వ్యూహం (దాడి + దౌత్యం) మధ్యప్రాచ్య రాజకీయాల సారాంశాన్ని బయటపెడుతోంది. స్ట్రెయిట్ ఆఫ్ హోర్ముజ్ భద్రత, ఇరాన్ అణు కార్యక్రమ నియంత్రణ, ప్రాంతీయ స్థిరత్వం ? ఇవన్నీ అమెరికా స్ట్రాటజిక్ లక్ష్యాలు. ఇరాన్ మాత్రం ఆర్థిక ఒత్తిడి, సైనిక నష్టాల నుంచి బయటపడి తన ప్రాంతీయ ప్రభావాన్ని కాపాడుకోవాలని చూస్తోంది.ఈ చర్చలు విజయవంతమైతే మధ్యప్రాచ్యంలో కొత్త శాంతి అధ్యాయం మొదలవుతుంది. ఇరాన్ ఆయిల్ ఎగుమతులు సాఫీగా జరగడం, ఆర్థిక ఉక్కిరిబిక్కిరి తగ్గడం, ప్రాంతీయ ఉద్రిక్తతలు తగ్గడం వంటి సానుకూల ఫలితాలు వస్తాయి. కానీ ఒప్పందం కుదరకపోతే ఉద్రిక్తతలు మరింత పెరిగి పెద్ద యుద్ధంగా మారే ప్రమాదం ఉంది. ప్రస్తుతం రెండు వైపులా “ఒప్పందం కావాలి” అన్న కోరిక కనిపిస్తోంది. అయితే షరతులు, అణు అంశాలు, సైనిక నియంత్రణ వంటి విషయాల్లో ఇంకా తీవ్ర అసమ్మతి నెలకొని ఉంది.దోహా చర్చల ఫలితాలు రాబోయే రోజుల్లో ప్రపంచ రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపించవచ్చు. మధ్యప్రాచ్య శాంతి ఎప్పుడూ సులభం కాదు. బాంబులు పడుతున్నప్పుడే దౌత్యం నడుస్తున్న ఈ ఆటలో ఏ చిన్న తప్పిదం కూడా సమస్యగా మారుతుంది. ఈ సంక్లిష్టతల మధ్య నుంచి నిజమైన శాంతి ఎలా ఉద్భవిస్తుందో చూడాలి.

# పేరు వేతనాల పెంపు.. జరిగింది తగ్గింపు



రాష్ట్రంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల కనీస వేతనాలను భారీస్థాయిలో పెంచుతున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 21న ప్రకటించారు. పెరిగిన కనీస వేతనాలను జూన్ 1 నుంచి అన్ని సంస్థలకు అమలు చేస్తామని, ఇది అమలు జరిగేలా కార్మిక శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చామని సీఎం పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న 73 షెడ్యూల్ ఎంప్లాయిమెంటులో గల కోటి 11 లక్షల మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు, వారి కుటుంబాలకు మేలు జరుగనున్నది. అయితే, ప్రభుత్వం ప్రకటించిన కనీస వేతనాల పెంపు అసంబద్ధంగా, అన్యాయంగా ఉందనేది అర్థమవుతున్నది. 1948 నాటి కనీస వేతనాల చట్టం, కార్మిక సంఘాల డిమాండ్లు, 1991 నాటి సుప్రీంకోర్టు ఆదేశాలు, డాక్టర్ ఆండ్రాయిడ్ ఫార్ములా, రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలను కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదు. సర్కార్ నిర్ణయంతో కనీస వేతనాల పెంపు వల్ల రాష్ట్రంలోని అన్నిరంగాల్లో పనిచేసే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు లాభం చేకూరకపోగా తీరం నష్టం చేస్తుందనేది వాస్తవం. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేండ్లు దాటింది. ఎన్నికల సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి తమ ఎన్నికల ప్రణాళికలో కార్మికులకు ఇచ్చిన హామీల అమలుకు ఎంతమాత్రం సిద్ధం కాలేదని విశదమవుతున్నది. కార్మికుల కనీస వేతనాలను భారీగా పెంచుతున్నట్లు ప్రభుత్వం చేసిన ప్రకటనలు కూడా ప్రచారం ఘనం.. ఫలితం శూన్యం కానున్నది. కార్మికుల కరువుభత్యం కనీస వేతనాల్లో కలిపే ఆలోచన సైతం చేయలేదు. బీఆర్‌ఎస్ హయాంలో అన్‌స్కిల్డ్ కార్మికులకు కనీస వేతనం రూ.1,809గా నిర్ణయించి కరువుభత్యం (డీఏ) పాయింట్ ఒక్కింటికి రూ.12గా నిర్ణయించింది. కనీస వేతన సలహా బోర్డు సిఫార్సులను పరిగణనలోకి తీసుకున్నది. దీని ప్రకారం 2021 జూన్ 25న కేసీఆర్ సర్కార్ ఐదు జీవోలను జారీ చేసింది. కానీ ప్రస్తుత పాలకులు రెండున్నరేండ్ల కాలంలో గెజిట్ కూడా విడుదల చేయకుండా వదిలివేశారు. కాంగ్రెస్ సర్కార్ ఇప్పుడు కనీస వేతనాన్ని రూ.14 వేలకు కుదించటమే కాకుండా, డీఏ పాయింట్లను పరిగణనలోకి తీసుకోలేదు. ఈ నిర్ణయం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కోటి పది లక్షల మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు అన్యాయం చేయటమే అవుతుంది. ప్రభుత్వ వైఖరి పెట్టుబడిదారులు, యాజమాన్యాలకు మేలు చేసేదిగా ఉన్నదని స్పష్టమవుతున్నది. పెంచిన వేతనాల్లో పెరుగుదల లేకుండా ఉండటమే కాకుండా ప్రస్తుతం పొందుతున్న కనీస వేతనాలపై రూ.8,444 వరకు కార్మికుడు నష్టపోతున్న పరిస్థితి నెలకొననున్నది. కార్మికులను మభ్యపెట్టేందుకు కాంగ్రెస్ సర్కార్ పూనుకుంటున్నది. నిజంగా కార్మికుల వేతనాల పెంపునకు చిత్తశుద్ధితో కృషిచేయాలని భావిస్తే కార్మిక సంఘాలు, సంబంధిత అధికారులతో చర్చించాలి. ప్రస్తుతం అమలు జరుగుతున్న వేతనాలు, పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు, కార్మికుల జీవన ప్రమాణాలను గుర్తించటం ద్వారా సరైన నిర్ణయం తీసుకొని ఉండాల్సి ఉన్నది. కానీ ఈ దిశగా ప్రభుత్వం ప్రయత్నాలు చేయకపోవటంతో కనీస వేతనాలను పెంచాలనే నిజాయితీతో కూడిన ఆలోచన ఎంతమాత్రం లేదని స్పష్టమవుతున్నది. వాస్తవానికి నిత్యావసర సరుకుల ధరల పెరుగుదల, కార్మికుల జీవన ప్రమాణాలు, సుప్రీంకోర్టు ఆదేశాలను పరిగణనలోకి తీసుకున్నప్పుడు కార్మికుల కనీస వేతనం రూ.32 వేలుగా నిర్ణయించాల్సి ఉంటుంది. కార్మిక సంఘాలన్నీ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలనే డిమాండ్‌ను న్యాయబద్ధమైనదిగా తీసుకొని ప్రభుత్వం అంగీకరించాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం ఇప్పటికే అమలు జరుగుతున్న వేతనాల్లో కనీస వేతనంగా రూ.28,444 చెల్లిస్తున్నారు. కనీసం దీనినైనా పరిగణనలోకి తీసుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీసవేతనాలు అసంబద్ధంగా ఉన్నాయి. కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్నాటకలో కాంట్రాక్ట్ కార్మికుల కనీస వేతనం 60 శాతం అంటే రూ.19,300 నుంచి రూ.31,100 వరకు పెంచారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కనీస వేతనాల పెంపులో పక్క రాష్ట్రంలోని తమ స్వపక్షం తీసుకున్న నిర్ణయాన్ని కూడా పరిగణనలోకి తీసుకోకపోవడం విచిత్రం. ప్రభుత్వం పెంచిన కనీస వేతనాలను ఆయా యాజమాన్యాలు అమలు చేసేలా కార్మిక శాఖ అధికారులకు ఆదేశాలిస్తామని ప్రభుత్వం చెప్తున్నది. వాస్తవానికి కనీస వేతనాలు అమలు చేయించటానికి కార్మికశాఖ అధికారులకు సంపూర్ణ అధికారాలు అప్పగించాలంటే ముందుగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లపై స్పష్టమైన ప్రకటన చేయాలి. మోదీ సర్కార్ 29 కార్మిక చట్టాలను రద్దు చేసి తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తెలంగాణలో అమలు చేసేది లేదని ముందుగా ప్రకటించాలి. రాష్ట్ర క్యాబినెట్ ఈ మేరకు తీర్మానం చేయాల్సిన అవసరం ఎంతో ఉన్నది. కానీ ఈ కోడ్‌లను వ్యతిరేకించకుండా రాష్ట్రంలో కనీస వేతనాల అమలుకు అంగీకారం తెలుపుతూ కార్మిక అధికారులకు అధికారాలు ఇస్తామని ప్రకటించటం మరో మోసపూరితమైన ఆలోచన తప్ప ఆచరణకు తోడ్పడేది ఎంతమాత్రం కానేకాదు.

# క్వాడ్‌లో మళ్లీ చలనం



ఉందో, ముగిసిపోయిందో తెలియని స్థితిలో ఏడాదిగా దారీతెన్నూ లేకుండా ఉండిపోయిన చతుర్భుజ కూటమి(క్వాడ్)లో ఎందుకనో కొంత చలనం వచ్చింది. మంగళవారం సభ్య దేశాలైన భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా విదేశాంగ మంత్రుల సమావేశం జరగటం, చివరిలో ఒక ఉమ్మడి ప్రకటన వెలువడటం ఆర్నెల్ల ముందు కూడా ఊహకందనిది. ఎందుకంటే నిరుడు జనవరిలో రెండోసారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మిత్రులు, శత్రువులన్న విచక్షణ మరిచి అందరితో గిల్లికజ్జాలకు దిగడం మొదలెట్టారు. నిర్విచక్షణగా సుంకాలు విధిస్తూ అందరినీ సమానంగా ఇబ్బందిపెట్టారు. ఇలాంటి స్థితిలో అమెరికా చొరవతో ఏర్పడ్డ క్వాడ్ ఇక ముగిసిన అధ్యాయమని అందరూ అనుకున్నారు. నిజానికి ఆరంభంనుంచి క్వాడ్ ఏదో కారణంతో అస్తిత్వ సంక్షోభాన్ని ఎదుర్కొంటూనేవుంది. చైనాకు వ్యతిరేకంగా 2007లో తొలి సమావేశం జరుపుకోగా ఆ మరుసటి ఏడాదికే జపాన్, ఆస్ట్రేలియాలు వైదొలగాయి. ఆ రెండుచోట్లా పాలకులు మారటం ఇందుకొక కారణం. 2008లో అప్పటి మన ప్రధాని మన్మోహన్ సింగ్ ‘చైనాను కట్టడిచేసే ఎలాంటి కూటమిలోనూ భాగస్వాములం కాదల్చుకోలేదు’ అని కుండబద్దలు కొట్టారు. దాంతో దాదాపు పదేళ్లపాటు అది అచేతనావస్థలో పడింది. 2017 నాటికి దక్షిణ చైనా సముద్రం, తూర్పు చైనా సముద్రం ప్రాంతాల్లో చైనా పెత్తనం పెరగటంతో ట్రంప్ చొరవ తీసుకుని దానికి ప్రాణప్రతిష్ఠ చేశారు. అయినా కోవిడ్ కారణంగా తొలి శిఖరాగ్ర సమావేశం జరగటానికి నాలుగేళ్లు పట్టింది. కీలక ఖనిజాలు, ఇంధన భద్రత, సముద్రజలాల్లో ఇంటర్నెట్ కేబుల్స్ ఏర్పాటు, టెలికాం సాంకేతికత తదితర అంశాల్లో పరస్పరం సహకరించుకోవాలని విదేశాంగ మంత్రుల సదస్సు నిర్ణయించటం తాజా ప్రపంచ పరిణామాల పర్యవసానమే. హోర్మూజ్ జలసంధి ప్రతిష్ఠంభన... ఇంధన సరఫరా నిలిచిపోవటం, ఆ ప్రాంతంవైపు నుంచి వచ్చే అండర్ సీ కేబుల్స్ సైతం ప్రమాదంలో పడటం వగైరా అంశాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయాలు తీసుకున్నారు. ఆ ప్రాంతంలో నౌకలను అడ్డగిస్తున్న ఇరాన్ వైఖరిని, వచ్చే పోయే నౌకలవద్ద సుంకాలు వసూలు చేసే ఆలోచనను క్వాడ్ సమావేశం తప్పుబట్టింది. అనవసర యుద్ధంతో ఇంత వివాదానికి కారణమై, తాను సైతం హోర్మూజ్‌ను దిగ్బంధించిన అమెరికాకు జనాంతికంగానైనా మిగిలిన దేశాలు హితవు పలికాయా అన్నది తెలియదు. చైనాను నిరోధించి, ఇండో––పసిఫిక్ దేశాల భద్రతకు కృషిచేయాలని గతంలో చెప్పుకున్న సంకల్పం ఇప్పుడు తాత్కాలికంగా వెనక్కిపోయింది. ఈ ప్రాంతంలో నిఘా వ్యవస్థను పటిష్టం చేసి, ఎప్పటికప్పుడు క్వాడ్ దేశాల మధ్య సమాచారాన్ని ఇచ్చిపుచ్చు కోవాలని నిర్ణయించినా దీనర్థం క్వాడ్‌ను సైనికీకరణ చేయటం కాదని మన విదేశాంగ శాఖ వివరణనిచ్చింది. క్వాడ్ ఇంధన వేదికను ఈ ఏడాది ఆఖరులోగా నిర్వహించ బోతున్నామని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ప్రకటించారు. కానీ ఈ సంస్థ శిఖరాగ్ర సమావేశాలు ఎప్పుడో చెప్పకపోవటం సందే హాలకు తావిచ్చింది. విదే శాంగ మంత్రుల సమావేశంలోనే శిఖరాగ్ర తేదీలు ప్రకటించటం ఆనవాయితీ. వాస్తవా నికి అది 2024లోనే భారత్‌లో నిర్వహించాలి. కానీ వాయిదా పడింది. ఈలోగా సుంకాల వివాదం నేపథ్యంలో ట్రంప్ మన దేశం రావటానికి చొరవ చూపటం లేదు. క్వాడ్ మొదలయ్యే నాటికి చైనా దూకుడు మీదుంది. ముఖ్యంగా హిందూ సముద్ర ప్రాంత దేశాలమీదుగా అది ప్రారంభించదల్చుకున్న బెల్ట్ అండ్ రోడ్ ఇన్షియేటివ్ (బీఆర్ఐ) ప్రాజెక్టు భారత్ భద్రతకు ముప్పు తెస్తుందన్న సందేహం ఉంది. ఇక ఇరు దేశాల సరిహద్దుల్లో ఆ దేశం తరచు సృష్టించే వివాదాలు సరేసరి. ఇలాంటి నేపథ్యంలో క్వాడ్‌లో భాగస్వామ్యం కావటానికి మన దేశం ముందుకొచ్చింది. ఆనాటి పరిస్థితుల మాటెలావున్నా ఎవరికీ అంతుచిక్కని ట్రంప్ వంటి అధినేతను నమ్మి ముందుకెళ్లటం ఇప్పుడు సాధ్యమేనా? ఆయన చైనాతో సాన్నిహిత్యం కోసం తహతహలాడుతున్నారు. అది ఒక రూపం తీసుకుంటే క్వాడ్ కాడిపడేయరన్న గ్యారెంటీ ఏం లేదు. అందుకే రక్షణేతర రంగాల్లో భాగస్వామ్యం వరకూ ఫర్వాలేకున్నా, ఇతర విషయాల్లో మన దేశం ఆచితూచి అడుగేయక తప్పదు.

## కర్ణాటకలో రెండో కృష్ణుడు

**బెంగళూరు :** అధికారంలోకి రాకముందు కుర్చీల కోసం కొట్లాట.. అధికారం వచ్చిన తర్వాత పదవుల కోసం కొట్లాట.. కాంగ్రెస్ పార్టీలో రాజకీయాల గురించి ఢిల్లీకి సర్కిల్స్ ప్రాంతంలో బాగా పేరుపొందిన సామెత ఇది. ఈ సామెత సంవత్సరాల కాలం నాటిదైనప్పటికీ.. ఇప్పటికీ కొనసాగుతూనే ఉందంటే కాంగ్రెస్ పార్టీలో రాజకీయాలు ఏ స్థాయిలో ఉంటాయో అర్థం చేసుకోవచ్చు. దేశమంతా కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి. దక్షిణాది రాష్ట్రాలలో మాత్రం అనుకూలమైన వాతావరణం కొనసాగుతోంది. దక్షిణాది రాష్ట్రాలలో కేరళ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. తమిళనాడులో అధికార పార్టీలో భాగస్వామ్య పక్షంగా ఉంది.ఉన్న అధికారాన్ని సుస్థిరం చేసుకొని.. దేశవ్యాప్తంగా అధికారాన్ని దక్కించుకునే విధంగా కాంగ్రెస్ పార్టీ చేయాల్సి ఉండగా.. దక్షిణాది రాష్ట్రాలలో అందుకు భిన్నంగా సాగుతోంది. ముఖ్యంగా పదవుల కోసం నాయకుల మధ్య జరుగుతున్న పోరాటాలు ప్రజల్లో చులకన భావాన్ని కలిగిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలలో ప్రధానమైన కన్నడ సీమలో ప్రస్తుతం సీఎం మారతారు అనే చర్చ నడుస్తోంది. ముఖ్యమంత్రిగా ఉన్న సిద్ధరామయ్య రాజీనామా చేస్తారని వార్తలు వస్తున్నాయి.. కొత్త ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ ఈనెల 30న ప్రమాణస్వీకారం చేస్తారని కూడా తెలుస్తోంది.ముఖ్యమంత్రి స్థానం కోసం శివకుమార్ మధ్య.. సిద్ధరామయ్య మధ్య పోటీ ఎప్పటినుంచో సాగుతూనే ఉంది. ఇద్దరు కూడా బలమైన నాయకులు కావడంతో ఎవరి మనసు నొప్పించకుండా ఉండేందుకు అధిష్టానం నాయకత్వ మార్పు ప్రక్రియను చేపడుతున్నట్లు తెలుస్తోంది.. గతంలో సీఎం స్థానం కోసం శివకుమార్ అనేక రకాలుగా ప్రయత్నాలు చేశారు. ఈ పంచాయతీ ఢిల్లీ దాకా కూడా వెళ్ళింది. అధిష్టానం మధ్యలో జోక్యం చేసుకోవడంతో శివకుమార్ కాస్త వెనక్కి తగ్గారు. అప్పట్లోనే అధిష్టానం శివకుమార్ కు కొంత వ్యవధి ఇచ్చినట్టు తెలుస్తోంది. ఇప్పుడు ఆ వ్యవధి ముగిసిపోవడం శివకుమార్ అధిష్టానం ముందు ప్రస్తావించినట్టు తెలుస్తోంది. నీతో నాయకత్వ మార్పుకు అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు సమాచారం.అధిష్టానం చెప్పినట్టు సిద్ధరామయ్య నడుచుకుంటారని కర్ణాటక మీడియాలో వార్తలు వస్తున్నాయి. గురువారం సిద్ధరామయ్య తన మంత్రివర్గంలో ఉన్న వ్యక్తులకు అల్పాహార విందు ఇస్తారని.. ఆ తర్వాత లోక్ భవన్ కు వెళ్లి గవర్నర్ కు రాజీనామా పత్రం సమర్పిస్తారని తెలుస్తోంది.. గురువారం ఉదయాన్నే ఢిల్లీ నుంచి సిద్ధరామయ్య ఇంటికి వస్తారని.. ఆ తర్వాత వారిద్దరూ మీడియాతో మాట్లాడే అవకాశం ఉందని తెలుస్తోంది.ముఖ్యమంత్రి రేసులో ఉన్న వ్యక్తులలో డీకే శివకుమార్ తో పాటు పరమేశ్వర పేరు కూడా వినిపిస్తోంది.

# ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలి..

బక్రీద్ నేపథ్యంలో మరిపెడ చెక్ పోస్ట్ ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ డా.శబరీష్

అనుమానాస్పద వాహనాలపై ప్రత్యేక నిఘా ఉంచాలి..

పండుగ వేళ 24 గంటలు అప్రమత్తంగా విధులు నిర్వహించాలి..

ప్రజలు శాంతియుత వాతావరణంలో బక్రీద్ పండుగను జరుపుకోవాలి..






**మరిపెడ,మే28(సూర్యరేఖ)** బక్రీద్ పండుగ నేపథ్యంలో మరిపెడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ ను జిల్లా ఎస్పీ డా.శబరీష్ బుధవారం అర్ధరాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఎస్పి చెక్ పోస్ట్ వద్ద కొనసాగుతున్న వాహన తనిఖీలను పరిశీలించి విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు.అక్రమ పశువుల రవాణాను పూర్తిగా అరికట్టాలని,చెక్ పోస్ట్ గుండా వెళ్లే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు.పశువులను తరలించే వాహనాలకు సంబంధించిన అనుమతి పత్రాలు,రవాణా డాక్యుమెంట్లను తప్పనిసరిగా పరిశీలించాలని తెలిపారు.అనుమానాస్పద వాహనాలు లేదా వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని,అవసరమైతే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని సూచించారు.పండుగ సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సిబ్బంది 24గంటలు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని,విధుల్లో నిర్లక్ష్యం సహించబోమని ఎస్పీ స్పష్టం చేశారు.ప్రజలు శాంతియుత వాతావరణంలో బక్రీద్ పండుగను జరుపుకోవాలని,పోలీస్ శాఖకు సహకరించాలని ఎస్పీ కోరారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ 103వ జయంతిని ఘనంగా నిర్వహించిన టిడిపి టీఎన్టీయూసీ నాయకులు






**బెల్లంపల్లి,మే28(సూర్యరేఖ)** బెల్లంపల్లి పట్టణ తెలుగుదేశం పార్టీ,అనుబంధ కార్మిక సంఘం టీఎన్టీయూసీ కార్యాలయంలో గురువారం ఎన్టీఆర్ 103వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి,కేక్ కట్ చేసి నివాళులర్పించారు.టిడిపి పట్టణ అధ్యక్షుడు, టీఎన్టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మణిరామ్ సింగ్ మాట్లాడుతూ...తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు,మాజీ ముఖ్యమంత్రి కీర్తిశేషులు నందమూరి తారక రామారావు ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసి చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని అన్నారు.పార్టీ స్థాపించిన తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి వచ్చి రికార్డు సృష్టించారని గుర్తు చేశారు.ఎన్టీఆర్ హయాంలో రూ.2కిలో బియ్యం,మద్యపాన నిషేధం, పటేల్–-పట్వారి వ్యవస్థ రద్దు,మండల వ్యవస్థ ఏర్పాటు,జనతా వస్త్రాల పంపిణీ వంటి పథకాలు అమలు చేశారని తెలిపారు.అలాగే సింగరేణిలో 1985లో నిర్వహించిన పరుగు పందేల ద్వారా వేలాది మంది నిరుద్యోగ యువకులకు ఎలాంటి లంచాలు లేకుండా ఉద్యోగ అవకాశాలు కల్పించారని పేర్కొన్నారు.సింగరేణి ప్రైవేటీకరణను అడ్డుకుని కార్మికులకు లాభాల్లో వాటా కల్పించిన ఘనత టిడిపిదేనని అన్నారు.ప్రస్తుతం ప్రభుత్వాలు నిరుద్యోగ సమస్య పరిష్కారంపై దృష్టి పెట్టాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని,కాంట్రాక్ట్ కార్మికులను శాశ్వతీకరించాలని,సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బొల్లు మల్లయ్య,సిహెచ్ రమేష్, దాసరి శ్రీనివాస్,ఆర్ గంగాధర్ గౌడ్,ఓ జీవరత్నం, ఎస్కే అస్గర్ బాషా,ఎండి యాసీన్,ఎం. రాజయ్య, పుల్లూరి భూషణ్,బి.సత్యనారాయణ,మాదాసి గోపాల్,పి.రాములు, తివారి,గైని తిరుపతి పాల్గొన్నారు.

## మరిపెడలో ఘనంగా బక్రీద్ వేడుకలు..

ఈద్గాలు,మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు..

పెద్ద సంఖ్యలో పాల్గొన్న ముస్లిం సోదరులు..

శాంతి,సౌభ్రాతృత్వం కోసం మత పెద్దల ప్రార్థనలు..

ఒకరినొకరు ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు..

ఈద్గా వద్ద కట్టుదిట్టమైన పోలీస్ భద్రత..





**మరిపెడ,మే28(సూర్యరేఖ)**త్యాగానికి ప్రతీకగా భావించే బక్రీద్ పండుగను మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంతో పాటుగా మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం ముస్లిం మత పెద్దల ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు.బక్రీద్ పండుగను మరిపెడ పట్టణంలో ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు.బక్రీద్ పండుగ సందర్భంగా మరిపెడ పట్టణంలోని ఈద్గాలు,మస్జీద్ లలో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు ఈద్గాకు చేరుకుని సామూహిక నమాజ్‌లో పాల్గొన్నారు.మత పెద్దలు శాంతి,సౌభ్రాతృత్వం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.బక్రీద్ త్యాగానికి ప్రతీక అని,పరస్పర ప్రేమాభిమానాలతో పండుగను జరుపుకోవాలని సందేశం ఇచ్చారు.ప్రార్థనల అనంతరం ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చిన్నారులు,యువకులు కొత్త దుస్తుల్లో సందడి చేశారు.పలువురు ముస్లిం సోదరులు మాట్లాడుతూ...త్యాగ నిరతికి బక్రీద్ పండుగ నిదర్శనమని అన్నారు.ధనిక,పేద అన్న తారతమ్యం లేకుండా స్వార్థం,ద్వేషాలకు అతీతంగా ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ఈ పండుగను జరుపుకుంటున్నట్లు తెలిపారు.ప్రతి ఒక్కరూ దాన గుణం,సేవాగుణం అలవర్చుకోవాలని చెప్పారు.పండుగ సందర్భంగా ముస్లిం సోదరులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ, బంధుమిత్రులతో సంతోషంగా గడిపారు.బక్రీద్ విశిష్టతలో భాగమైన ఖుర్బానీని చుట్టుపక్కల వారికి దానంగా అందజేశారు.పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ఈద్గా పరిసరాల్లో భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.ప్రజలు శాంతియుత వాతావరణంలో పండుగను జరుపుకోవాలని అధికారులు కోరారు.


## లోడింగ్ కార్మికులను శాశ్వత కార్మికులుగా గుర్తించే వరకు పోరాటం కొనసాగిస్తాం..



**బెల్లంపల్లి,మే28(సూర్యరేఖ)** ఓరియెంట్(అదాని)సిమెంట్ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ గుర్తింపు సంఘం అధ్యక్షుడు కొక్కిరాల సత్యపాల్ రావు తమ సంఘం కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తుందని యూనియన్ నాయకులు తెలిపారు.ఎన్నో ఏళ్లుగా సేవలు అందిస్తున్న లోడింగ్ కార్మికుల సమస్యలను ఇప్పటివరకు ఏ సంఘం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.కార్మిక చట్టాల ప్రకారం లోడింగ్ కార్మికులను శాశ్వత కార్మికులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.గురువారం గుర్తింపు సంఘం నాయకులు,లోడింగ్ కార్మికులతో కలిసి హైదరాబాద్‌లో తెలంగాణ కార్మిక, ఉపాధి శిక్షణశాఖ కార్యదర్శి హరిచందన దాసరికి వినతిపత్రం అందజేశారు.అదేవిధంగా కార్మికుల సంక్షేమ మండలి సీఈఓ డాక్టర్ గంగాధర్,కమిషనర్ ఆఫ్ లేబర్ పమీల సత్పతి,జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ వరంగల్,చీఫ్ కమిషనర్ ఆఫ్ లేబర్ (సెంట్రల్) హైదరాబాద్ అధికారులను కలిసి సమస్యలను వివరించారు.ఈ సందర్భంగా అధికారులు సానుకూలంగా స్పందించి కార్మిక చట్టాల ప్రకారం న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి భీమిని మహేందర్,వర్కింగ్ ప్రెసిడెంట్లు మెరుగు శంకర్,సతీష్ రెడ్డి, సత్యనారాయణ, లోడింగ్ పెద్దమనుషులు పార్వతి పెద్దిరాజు, అరుణ్, రమేష్, మల్లేష్,శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

## మహిళ కడుపు నుంచి 4 కిలోల కణితి తొలగింపు..

అరుదైన శస్త్రచికిత్స చేసిన కల్లూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యులు బి.రమేష్



**ఖమ్మం,మే 28(సూర్యరేఖ)** కడుపులో నొప్పి,శ్వాస ఇబ్బందితో బాధపడుతూ చికిత్స కోసం వచ్చిన 38 సంవత్సరాల మహిళ కడుపు నుంచి 4 కిలోల కణితి తొలగించి ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడినట్లు కల్లూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యులు బానోత్ రమేష్ ఆధ్వర్యంలో వైద్య బృందం విజయవంతంగా కడుపులో నుంచి నాలుగు కేజీల కనితిని తొలగించారు.గురువారం కల్లూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యులు బి.రమేష్ విలేకరుల సమావేశంలో అరుదైన శస్త్రచికిత్స వివరాలను మీడియాకు వివరించారు.పందిలపల్లి,చెరువు మాదారంకు చెందిన తూటిపల్లి జ్యోతి(38)ఏళ్ల తీవ్ర అనారోగ్యంతో తమ ఆసుపత్రికి చికిత్స కల్లూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కు వచ్చారు.ఆమెకు వైద్య పరీక్షలు చేయగా కడుపులో 4 కిలోల కణితి ఉన్నట్లు గుర్తించారు.అన్ని వైద్య పరీక్షలు నిర్వహించి ఆపరేషన్ చేసి కణితి తొలగించారు.డాక్టర్ అశోక్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా రోగి కుటుంబ సభ్యులు వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## మండల వ్యాప్తంగా ఘనంగా బక్రీద్ పండుగ వేడుకలు..





**నిజాంపేట,జూన్7(సూర్యరేఖ)** మండల వ్యాప్తంగా గురువారం బక్రీద్ పండుగ సందర్భంగా ఈద్గాలో ముస్లిం సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు.ఈ మేరకు మండల కేంద్రంలోని మసీదులో ముస్లిం మత పెద్ద జనాబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...త్యాగానికి ప్రతీకగా బక్రీద్ పండుగను కొలుస్తామన్నారు. మసీదులో ప్రత్యేక ప్రార్థనలు అనంతరం ముస్లిం సోదరులు ఒకరికొకరు ఆలింగనం చేసుకొని ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలిపారు.ఆఅల్లా దయతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసం తోషాలతో ఉండాలని అల్లాకు దువా చేశామన్నారు.ఈ కార్యక్రమంలో ముస్లిం కులస్తులు మైనోద్దీన్,ఏక్బాల్,ఇబ్రహీం,మాజీ కోఆప్షన్ అబ్దుల్ అజీజ్,నసీరుద్దీన్,తలహా, సిద్ధిక్,బాబు మియా, షాదుల్లా, ఖలీల్, అజీజ్, రఫిక్, హుస్సేన్, రియాజ్, ఫిరోజ్, పాషాభాయ్,తదితరులు పాల్గొన్నారు.

# డబ్బు ఎందుకు అవసరం.

ప్రాథమిక అవసరాల నుంచి భవిష్యత్ భద్రత వరకు డబ్బుదే కీలక పాత్ర..

ఆర్థిక స్థిరత్వం లేకుంటే కుటుంబాలపై పెరుగుతున్న భారం..

**కొల్చారం,మే28(సూర్యరేఖ)** నేటి సమాజంలో డబ్బు ప్రతి మనిషి జీవితంలో విడదీయరాని భాగంగా మారింది.ఒకప్పుడు వస్తువుల మార్పిడి విధానంతో అవసరాలు తీర్చుకునే కాలం ఉండేది.కానీ కాలక్రమేణా సమాజ అభివృద్ధి,జనాభా పెరుగుదల,ఆధునిక జీవనశైలి కారణంగా డబ్బు ప్రధాన అవసరంగా మారింది.ప్రస్తుతం పుట్టిన పిల్లవాడి నుంచి వృద్ధుడి వరకు ప్రతి ఒక్కరి జీవితంలో డబ్బు కీలక పాత్ర పోషిస్తోంది.మనిషి జీవనానికి అవసరమైన ఆహారం,దుస్తులు,నివాసం వంటి ప్రాథమిక అవసరాలను తీర్చుకోవడానికి డబ్బు తప్పనిసరి.కుటుంబ నిర్వహణ,విద్యుత్ బిల్లులు, ఇంటిఅద్దె,రవాణా,నిత్యావసర సరుకుల కొనుగోలు వంటి ప్రతి అంశం డబ్బుతోనే ముడిపడి ఉంది.రోజువారీ కూలీ చేసేవారి నుంచి పెద్ద వ్యాపారుల వరకు అందరూ తమ జీవనోపాధి కోసం ఆర్థిక వనరులపైనే ఆధారపడుతున్నారు.

**విద్య,వైద్యం ఖర్చులతో పెరుగుతున్న ఆర్థిక భారం..**

ప్రస్తుతం విద్య,వైద్యం రంగాల్లో ఖర్చులు భారీగా పెరిగాయి.పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలంటే తల్లిదండ్రులు వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది.అలాగే చిన్న అనారోగ్యానికి కూడా ఆసుపత్రుల్లో అధిక వ్యయం అవుతోంది.ఇలాంటి పరిస్థితుల్లో కుటుంబ ఆర్థిక స్థితి బలంగా ఉండాల్సిన అవసరం మరింత పెరిగింది.వ్యవసాయ రంగంలోనూ డబ్బు కీలకపాత్రపోషిస్తోంది.విత్తనాలు,

ఎరువులు,పురుగుమందులు,కూలీల ఖర్చులు,యంత్రాల వినియోగం వంటి ప్రతి దశలో రైతుకు పెట్టుబడి అవసరం అవుతోంది.పంట చేతికి వచ్చేవరకు అప్పులపైనే ఆధారపడే పరిస్థితి కనిపిస్తోంది.అలాగే చిన్న వ్యాపారం ప్రారంభించాలన్నా,స్వయం ఉపాధి చేపట్టాలన్నా డబ్బు ప్రధాన ఆధారంగా మారింది.

**భవిష్యత్ భద్రతకు పొదుపు అవసరం..**

డబ్బు కేవలం ఖర్చుల కోసమే కాదు,భవిష్యత్తు భద్రతకు కూడా అవసరం..అత్యవసర పరిస్థితుల్లో పొదుపు చేసిన డబ్బు కుటుంబానికి అండగా నిలుస్తుంది.అనారోగ్యం,ప్రమాదాలు,ఉద్యోగ నష్టం వంటి సందర్భాల్లో ఆర్థిక నిల్వలు ఎంతో ఉపయోగపడతాయి.అందుకే చాలామంది



బ్యాంకు పొదుపులు,బీమా పాలసీలు,పెట్టుబడులపై దృష్టి పెడుతున్నారు. సమాజంలో ఆర్థికంగా బలమైన వ్యక్తులకు గౌరవం,గుర్తింపు ఎక్కువగా లభిస్తున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.డబ్బు ఉన్నవారికి మెరుగైన అవకాశాలు లభిస్తున్నాయి.అయితే డబ్బు ఉన్నంత మాత్రాన మనిషి గొప్పవాడవడంలేదని,మానవత్వం,మంచితనం,కుటుంబ బంధాలు కూడా అంతే ముఖ్యమని పెద్దలు చెబుతున్నారు.నిపుణుల అభిప్రాయం ప్రకారం డబ్బు సంపాదించడం ఎంత ముఖ్యమో,దాన్ని సక్రమంగా వినియోగించడం కూడా అంతే అవసరం.అక్రమ మార్గాల్లో సంపాదించిన ధనం తాత్కాలిక సౌకర్యాలు కలిగించినా,శాశ్వత ఆనందాన్ని ఇవ్వదని వారు సూచిస్తున్నారు. కష్టపడి,నిజాయితీగా సంపాదించిన డబ్బే మనశ్శాంతిని ఇస్తుందని చెబుతున్నారు.ప్రస్తుతం యువతలో డబ్బు ప్రాధాన్యం మరింత పెరిగింది.మంచి ఉద్యోగాలు,వ్యాపార అవకాశాలు,విదేశీ ఉపాధి కోసం యువత పోటీ పడుతోంది.ఆధునిక జీవనశైలి,సోషల్ మీడియా ప్రభావంతో ఖర్చులు పెరుగుతుండటంతో ఆదాయం పెంచుకోవాలనే ఆలోచన కూడా ఎక్కువవుతోంది.దమొత్తంగా చూస్తే డబ్బు మనిషి జీవితాన్ని సులభతరం చేసే ముఖ్యమైన సాధనం.అవసరాలను తీర్చుకోవడం నుంచి భవిష్యత్తును నిర్మించుకోవడం వరకు ప్రతి దశలో డబ్బు కీలక పాత్ర పోషిస్తోంది.అయితే డబ్బుతో పాటు మానవ విలువలు,ఆరోగ్యం,సంబం ధాలు,సేవాభావం కూడా సమానంగా ముఖ్యమని సమాజం గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉంది.

## విద్యుత్ షాక్ తో పడిపోయిన కార్మికుడికి సమయస్ఫూర్తితో సీపీఆర్ చేసి ప్రాణాలు నిలిపిన టప్పాచబుత్రా పోలీస్ కానిస్టేబుల్..





**నాంపల్లి,హైదరాబాద్,మే28(సూర్యరేఖ)** కార్వాన్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో అసిస్టెంట్ లైన్మ్యాన్గా విధులు నిర్వహిస్తున్న రాజునాయక్ (44) కాంట్రాక్ట్ కార్మికుడు,కార్వాన్ ప్రాంతంలోని కుమ్మరవాడి హనుమాన్ దేవాలయం సమీపంలో ఒక విద్యుత్ స్తంభంపై మరమ్మతు పనులు చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు లైవ్ హైటెన్షన్ తీగలు తాకడంతో తీవ్రమైన విద్యుత్ ఘాతానికి గురై,స్తంభం పైనుండి కింద పడిపోయాడు.దీనితో ఆయన శ్వాస ఆగిపోయి,గుండె కొట్టుకోవడం నెమ్మదించి అక్కడికక్కడే స్పృహ కోల్పోయారు.ఆ సమయంలో సమీపంలోనే బ్లూ కోల్ట్స్× గస్తీ విధుల్లో ఉన్న టప్పాచబుత్రా పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ పి.సి.4938 బి.సురేష్ అక్కడ జరుగుతున్న కలకలాన్ని గమనించి క్షణం కూడా ఆలస్యం చేయకుండా ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాద తీవ్రతను గమనించి బాధితుడి ముక్కు వద్ద శ్వాస ఆడటం లేదని గ్రహించి సకాలంలో బాధితుడి ఛాతిపై క్రమబద్ధంగా ఒత్తిడి తీసుకురావడంతో కొద్దిసేపటికే రాజునాయక్ గుండె స్పందన పునరుద్ధరించబడి,ఊపిరి పీల్చుకోవడం ప్రారంభించారు.స్థానికుల సహాయంతో కానిస్టేబుల్ సురేష్ బాధితుడిని మెరుగైన వైద్యం కొరకు అత్యవసర వాహనంలో ఆసుపత్రికి తరలించారు.ప్రస్తుతం సదరు విద్యుత్ కార్మికుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.ఆయన ఆరోగ్యం ప్రస్తుతం స్థిరంగా ఉందని,ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు ధృవీకరించారు.ప్రమాదం జరిగిన వెంటనే 'గోల్డెన్ అవర్'లో పోలీస్ సకాలంలో స్పందించి సీపీఆర్ అందించడం వల్లే ప్రాణాపాయం తప్పిందని,లేనిచో ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉండేదని వైద్య నిపుణులు కొనియాడారు. టప్పాచబుత్రా పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ జి. బాలకృష్ణ మాట్లాడుతూ...ఆపత్కాలంలో అసాధారణ సమయస్ఫూర్తిని,ధైర్యసాహసాలను ప్రదర్శించి ఒక మానవ ప్రాణాన్ని కాపాడిన కానిస్టేబుల్ బి.సురేష్ ను ప్రత్యేకంగా అభినందించారు.సమాజ రక్షణలో పోలీసులు ఎల్లప్పుడూ ముందుంటారని ఈ ఘటన మరోసారి నిరూపించిందని ఆయన పేర్కొన్నారు.

## రైతుల ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం విఫలం..

డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్

**నిజాంపేట,మే28(సూర్యరేఖ)** ఆరుగాలం కష్టపడి పండించిన వరి,మొక్కజొన్న ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం చెందిందని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ అన్నారు.గురువారం నిజాంపేట మండల కేంద్రంలోని మార్కెట్ యార్డు,నందిగామ కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రైతులు ధాన్యం తీసుకువచ్చి నెలరోజులవుతున్న కొనుగోలు కేంద్రాల నుండి కొనుగోలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం వల్ల రైతు నరకయాతన పడుతున్నారని అన్నారు.ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామని అదనపు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి,పౌర సరఫరాలశాఖ మంత్రి మాటలకు చేతలకు పొంతన లేదని అన్నారు.తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో కొనుగోలు జరగడంలేదని అన్నారు. నిజాంపేట మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రంలో దాదాపు



500 మందికి పైగా రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకోవడానికి రాగా ఇప్పటివరకు కేవలం 338 మంది రైతుల నుండి మాత్రమే కొనుగోలు చేశారని ఇంకా120 మంది రైతులు తమ ధాన్యాన్ని విక్రయించేందుకు ఎదురుచూపులు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.వర్షాల వల్ల ధాన్యం తడవకుండా అదనపు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించిన కొనుగోలు కేంద్రాలలో ఎలాంటి అదనపు ఏర్పాట్లు చేయలేదన్నారు.500 మంది రైతులకు కేవలం 25తార్పాలిన్ కవర్లను మాత్రమే ప్రభుత్వం పంపిణీ చేసిందన్నారు.ఒక రైతు కిరాయికి 5కవర్లను తీసుకుంటే రోజుకు ఒక్కొక్క కవర్ కు 20చొప్పున దాదాపు నెలవుకు 3000 రూపాయలకు పైగా కవర్ ల కిరాయి చెల్లించాల్సి వస్తుందని రైతులు ఆవేదన చెందుతున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో దళిత బహుజన ఫ్రంట్ జిల్లా అధ్యక్షులు దుబాసి సంజీవ్ రైతులు శ్రీనివాస్,బాలయ్య శ్రీశైలం,వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన సర్పంచ్



**నిజాంపేట,మే28(సూర్యరేఖ)** మండల పరిధిలోని రజాక్ పల్లి గ్రామానికి చెందిన బక్కొల్ల దేవుని కొమరయ్య (70)అనారోగ్యంతో మరణించడం జరిగింది.గ్రామ సర్పంచ్ కనకరాజు,వారి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రమేష్,వార్డు సభ్యులు నవీన్,కుంట నర్సింలు, బొజ్జ స్వామి, రాజ్యం,సత్యనారాయణ,స్వామి,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నిత్యం ప్రమాదాలు పట్టించుకోని ఆర్అండ్ బి అధికారులు..





**నిజాంపేట,మే28(సూర్యరేఖ)** మండల పరిధిలోని నందిగామ గ్రామ శివారులో గల బ్రిడ్జి వంతెన వద్ద మక్కల లోడ్ తో వెళ్తున్న లారీ అదుపుతప్పి బోల్తాపడడం జరిగింది.ఈ మేరకు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...ఆదిలాబాద్ నుండి వస్తున్న మక్కల లోడ్ లారీ సిద్దిపేట జిల్లా, చేర్యాలకు వెళుతున్న క్రమంలో నందిగామ వద్ద బోల్తా కొట్టింది.ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ హాని జరగలేదు.గత వర్షాకాలం కృంగిపోయి దెబ్బతిన్న బ్రిడ్జి మళ్లీ వర్షాకాలం వస్తున్నప్పటికీ బ్రిడ్జి నిర్మాణ పనులపై అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు.ఈ బ్రిడ్జి వద్ద నిత్యం ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్న అధికారులకు మాత్రం లెక్క లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రయాణికులు మండిపడుతు న్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు చొరవ చూపి బ్రిడ్జి నిర్మాణ పనులను చేపట్టి ప్రమాదాలను నివారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి..

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బాణాల రాజన్న



**మరిపెడ,మే28(సూర్యరేఖ)** జూన్ 2,3వ తేదీలలో కేసముద్రం మండల కేంద్రంలో జరుగనున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బాణాల రాజన్న పిలుపునిచ్చారు .గురువారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం గుర్రప్పతండా గ్రామపంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు.అనంతరం రాజన్న మాట్లాడుతూ...కనీస సౌకర్యాలు మంచినీరు,టెంటు,పనిముట్లు,ప్రాథమిక కిట్టు,ఎండ వేడిమికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు కూలీలకు అందించాలని డిమాండ్ చేశారు.పెండింగ్ లో ఉన్న ఉపాధి డబ్బులను తక్షణమే చెల్లించి కూలీలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సంఘం మరిపెడ మండల ఉపాధ్యక్షులు పోలేపాక గణేష్,ఉపాధి కార్మికులు కళావ రాములు, గుగులోతు వీరన్న,బానోతు వెంకటయ్య,శాంత, ఆమ్లా సుగుణ,రమేష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు

# ఎన్టీఆర్ ఆశయ సాధన, సంక్షేమం కోసం సీఎం రేవంత్ రెడ్డి కృషి..





ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి

**ఉప్పల్,మే28(సూర్యరేఖ)**

ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి గురువారం ఉదయం కాకతీయ సేవ సమితి ఆధ్వర్యంలో మీర్పేట్ హెచ్‌బీ కాలనీలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ..."తెలుగు జాతి ఆత్మగౌరవానికి ప్రతీక గా నిలిచిన మహనీయుడు ఎన్టీఆర్ అని,సినిమా రంగంలో విశ్వవిఖ్యాత నటసార్వభౌముడిగా వెలుగొందుతూనే,రాజకీయ రంగంలో పేదల పక్షపాతిగా,సంక్షేమ పాలనకు ఆద్యుడిగా చరిత్రలో నిలిచిపోయారని పేర్కొన్నారు.రెండు రూపాయలకే కిలో బియ్యం, పేదలకు ఇళ్లు,మహిళలకు ఆస్తిలో సమాన హక్కు వంటి విప్లవాత్మక పథకాలతో సామాన్యుడి గుండెల్లో చిరస్థాయిగా నిలిచారు.తెలుగు వారి ఆత్మగౌరవం కోసం పార్టీ పెట్టి,బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారం అందించిన ఎన్టీఆర్ మహనీయుడన్నారు.ఆ మహనీయుడి ఆశయాల సాధనకు, సంక్షేమ పాలనకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంది.సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నాం"అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాకతీయ సేవ సమితి జి.ఉమా మహేశ్వరరావు,(చిన్న)జి.సాయి సుధీర్,డివిజన్ అధ్యక్షులు పోలేపాక అంజయ్య,కాపర్ సాయిగౌడ్,సరే కిట్టు,రాయని ఉదయ్ కిరణ్., అనిల్ గుప్తా,శ్రీకాంత్,జెమినీ,సమ్మయ్య,వేణు,బెస్త రమేష్, కృష్ణ నాయక్,రూపిందర్ రెడ్డి,నిక్కీ,కోయగూర బాలరాజ్,పర్వతాలు,టిల్లు ముదిరాజ్,నవీన్ జయంత్ విజయ్ రెడ్డి,శంకర్,ప్రదీప్,బాలకృష్ణ,రాణి, సురేష్ గౌడ్,మల్లికార్జున,యాదగిరి,శ్రవణ్ గౌడ్,పాల ప్రసాద్,సంబశివారావు,వీరా భద్రరావు, అమరకుమార్,కిషోర్,సురేష్ గౌడ్,డివిజన్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు,స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎన్టీఆర్ కి నివాళులు అర్పించారు.

# తెలుగువారి ఆత్మగౌరవ ప్రతీక ఎన్టీఆర్..





స్వర్గీయ ఎన్టీఆర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి..

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**కాప్రా,మే28(సూర్యరేఖ)**దస్వర్ణీయ నందమూరి తారక రామారావు 103వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని డాక్టర్ ఏఎస్ రావు నగర్ డివిజన్ పరిధిలోని హైటెన్షన్ రోడ్‌లో కమ్మవారి సేవా సమితి,జమ్మిగడ్డలో ఎన్టీఆర్ అభిమాన సంఘం,మీర్ పేట హౌసింగ్ బోర్డు డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ అభిమాన సంఘం,ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జయంతి వేడుకలకు ముఖ్యఅతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహానేత ఎన్టీఆర్ రాజకీయాల్లోనే కాకుండా సినీరంగంలో కూడా చెరగని ముద్ర వేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు.పేద ప్రజల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని తెలిపారు.తెలుగు జాతి గర్వించదగ్గ మహానుభావుడైన ఎన్టీఆర్ ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.సమాజ సేవ,ప్రజా సంక్షేమం పట్ల ఆయన చూపిన నిబద్ధత ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుభాస్ రెడ్డి,మాజీ ఎమ్మెల్సీ జనార్ధన్ రెడ్డి,మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సోమ శేఖర్ రెడ్డి,టీడీపీ,బిఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## చిల్కానగర్,బీరప్పగడ్డ ముస్లిం సోదరులకు బక్రీదు శుభాకాంక్షలు తెలిపిన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు

బన్నాల ప్రవీణ్ ముదిరాజ్



**ఉప్పల్,మే28(సూర్యరేఖ)**బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ బక్రీదు పర్వదినాన్ని పురస్కరించుకొని చిల్కానగర్ ఈద్గాలో మస్జిద్ కమిటీ ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థన కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రార్థన అనంతరం ముస్లిం సోదరులకు బక్రీదు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...త్యాగానికి ప్రతిరూపమైన బక్రీదు పండుగను ముస్లిం సోదర సోదరీమణులు సుఖసంతోషాలతో వారి కుటుంబ సభ్యులతో కలిసి అంగరంగ వైభవంగా జరుపుకోవాలని,ఆఅల్లా ఆశీస్సులు డివిజన్ ప్రజలందరిపై ఉండాలని అన్నారు.కార్యక్రమంలో మస్జిద్ కమిటీ సభ్యులు అధ్యక్షులు హనీఫ్ , ఖబరస్థాన్ కమిటీ అధ్యక్షులు అబ్బు బాయ్,కమిటీ సభ్యులు అల్తాఫ్,ఇమాం, మహమూద్,షఫీ, హనీఫ్,గౌస్,భాష,మహమ్మద్,బాబా,మరియు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎద్దుల కొండల్ రెడ్డి,జల్లి మోహన్,బాణాల నారాయణరెడ్డి,అశోక్ చారి,రవీందర్ గౌడ్,ముస్లిం సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడు ఎన్టీఆర్

టిడిపి సీనియర్ నాయకులు డాక్టర్ అంతగల్ల అశోక్



**ఉప్పల్,మే28(సూర్యరేఖ)** తెలుగుదేశం అధినేత,మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు 103వ జయంతి సందర్భంగా చిలుకా నగర్ చౌరస్తాలో సీనియర్ తెలుగుదేశం నాయకులు డాక్టర్ అంతగల్ల అశోక్ ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ అంతగల్ల అశోక్ మాట్లాడుతూ...తెలుగు ప్రజల గుండెల్లో నందమూరి తారకరామారావు చిరస్మరణీయుడుగా ఉంటాడని పేర్కొన్నారు.రాజకీయ, సాంస్కృతిక మరియు సంక్షేమ రంగాలలో ఆయన ప్రవేశపెట్టిన ఎన్నో సంస్కరణలు నేటికీ తెలుగు ప్రజల హృదయాల్లో చెరగని ముద్రవేశాయని గుర్తు చేశారు. రాజకీయాలను సామాన్యుడి చెంతకు చేర్చిన నాయకుడు ఎన్టీఆర్ అని రాజకీయ వ్యవస్థను ప్రక్షాళన చేసి,పేద వర్గాలకు అభ్యున్నతిని చూపించారన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీరామ్ మల్లేష్ యాదవ్, ఇమామ్, కృష్ణారెడ్డి,బజార్ హేమంత్ గౌడ్, శంకరయ్య,మదుసూదన్ రెడ్డి,రాజు, ఎల్లయ్య,శివ, కన్నయ్య తదితరులు పాల్గొని ఎన్టీఆర్ కు ఘనంగా నివాళులర్పించారు.

## వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి..

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బాణాల రాజన్న



**మరిపెడ,మే28(సూర్యరేఖ)**జూన్ 2,3వ తేదీలలో కేసముద్రం మండల కేంద్రంలో జరుగనున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బాణాల రాజన్న పిలుపునిచ్చారు .గురువారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం గుర్రప్పతండా గ్రామపంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు.అనంతరం రాజన్న మాట్లాడుతూ... కనీస సౌకర్యాలుమంచినీరు ,టెంటు, పనిముట్లు,ప్రాథమిక కిట్టు,ఎండ వేడిమికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు కూలీలకు అందించాలని డిమాండ్ చేశారు.పెండింగ్ లో ఉన్న ఉపాధి డబ్బులను తక్షణమే చెల్లించి కూలీలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సంఘం మరిపెడ మండల ఉపాధ్యక్షులు పోలేపాక గణేష్,ఉపాధి కార్మికులు కళావ రాములు, గుగులోతు వీరన్న,బానోతు వెంకటయ్య,శాంత,ఆమ్లా సుగుణ,రమేష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు

## వీర్ సావర్కర్ ఆశయాలు యువతకు ఆదర్శం..

జయంతి సందర్భంగా నివాళులర్పించిన రాజేష్ పిప్ హాల్ దంపతులు



**మందమర్రి,మే28(సూర్యరేఖ)** స్వాతంత్ర్య సమరయోధుడు వినాయక్ దామోదర్ సావర్కర్ (వీర్ సావర్కర్)143వ జయంతిని మాజీ ఆర్మీ జవాన్,ప్రస్తుతం ఎస్ అండ్ పీసీ ఉద్యోగిగా పనిచేస్తున్న రాజేష్ పిప్ హాల్,రాణి పిప్ హాల్ దంపతులు గురువారం తమ నివాసంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సావర్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వీర్ సావర్కర్ దేశభక్తి,త్యాగం,ధైర్యసాహసాలకు ప్రతీకగా నిలిచారని కొనియాడారు .మహారాష్ట్రలోని భాగూర్ గ్రామంలో 1883మే 28న జన్మించిన ఆయన చిన్ననాటి నుంచే దేశ స్వాతంత్ర్యం కోసం ఉద్యమించారని తెలిపారు.విద్యార్థి దశలోనే విప్లవ భావజాలంతో యువతను ఏకం చేస్తూ"అభినవ్ భారత్"సంస్థను ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. లండన్‌లో విద్యాభ్యాసం చేస్తున్న సమయంలో ఇండియా హౌస్ ద్వారా భారత విప్లవకారులకు మార్గదర్శకుడిగా వ్యవహరించారని పేర్కొన్నారు. బ్రిటిష్ ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించినందుకు ఆయనపై కేసులు నమోదు చేసి, అండమాన్ సెల్యులార్ జైలుకు తరలించి కఠిన కారాగార శిక్ష విధించారని తెలిపారు.జైలు జీవితం గడుపుతూ కూడా రచనల ద్వారా దేశభక్తిని చాటారని,"ది ఇండియన్ వార్ ఆఫ్ ఇండిపెండెన్స్ 1857"వంటి గ్రంథాలను రచించి యువతలో చైతన్యం నింపారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సిహెచ్.రమేష్,మహేందర్,రాజు,శంకర్,డి.తిరుపతి, జా,సుశీల, లక్ష్మి, చంద్రకళ, నిర్మల,రజిత,శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన కల్లూరు మున్సిపల్ చైర్మన్,కౌన్సిలర్లు,



**ఖమ్మం,మే28(సూర్యరేఖ)**కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని కాంగ్రెస్ మైనార్టీ నాయకులు షేక్ మైబు కుటుంబ సభ్యులకు,షేక్ బాజీ మైనార్టీ నాయకులు,కుటుంబ సభ్యుల ఇంటికి వెళ్లి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.భక్తి శ్రద్ధలకు, మానవత్వానికి ప్రతీకగా జరుపుకునే ఈ పండుగ రోజున..అల్లాహ్ దీవెనలతో ఆ కుటుంబ సభ్యులందరికీ ఆయురారోగ్యాలు,అష్ట ఐశ్వర్యాలు కలగాలని కల్లూరు మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్,వార్డు కౌన్సిలర్లు,ఉబ్బన రాంబాబు,యాస నాగమణి శ్రీకాంత్,శీలం కృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు డి.రవికుమార్, పాల్గొని ఆశీర్వదించారు.

## వేగంగా ధాన్యం అన్లోడింగ్ జరగాలి..

జిల్లా అదనపు కలెక్టర్ నగేష్



**కొల్చారం,మే28(సూర్యరేఖ)** వేగంగా ధాన్యం అన్లోడింగ్ జరగాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ గోడౌన్ నిర్వాహకులను ఆదేశించారు. గురువారం కొల్చారం మండల వరిగుంతం గ్రామంలోని గోడౌను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వరి ధాన్యం కొనుగోలు,నిల్వ కోసం ఏర్పాటు చేసిన గిడ్డంగిని పరిశీలించారు.సేకరించిన వరి ధాన్యాన్ని ఈ గిడ్డంగిలో నిల్వ చేయనున్నట్లు తెలిపారు. గిడ్డంగిలోని నిల్వ సామర్థ్యం,అందుబాటులో ఉన్న సౌకర్యాలు ,భద్రతా ఏర్పాట్లను పరిశీలించి సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు అందించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ ధాన్యం అన్లోడింగ్ త్వరగా జరగాలని,లారీలను,లేబర్ ను అందుబాటులో ఉంచుకోవాలని,అన్లోడింగ్ ఆలస్యం జరగకుండా మరింత పకడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన

చిల్కానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ములకలపల్లి రాజేష్ ముదిరాజ్



**ఉప్పల్,మే28(సూర్యరేఖ)** "హజ్రత్ ఇబ్రహీం త్యాగానికి ప్రతీకగా నిర్వహించుకునే బక్రీద్(ఈద్–ఉల్–అదా)పర్వదినం సందర్భంగా ముస్లిం సోదరులకు చిల్కానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ములకలపల్లి రాజేష్ ముదిరాజ్ శుభాకాంక్షలు తెలిపారు. ఉప్పల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి ఆదేశాలతో డివిజన్ పరిధిలోని పెద్ద మసీదులో చిల్కానగర్ డివిజన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు మొయినుద్దీన్ ను మర్యాదపూర్వకంగా కలిసి చిన్నారులకు స్వీట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా రాజేష్ ముదిరాజ్ మాట్లాడుతూ... స్వార్థం,అసూయ ,రాగద్వేషాలను విడిచిపెట్టి మానవులలో త్యాగాన్ని వ్యాపింప చేయడమే బక్రీద్ పండుగ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.త్యాగబుద్ధిని,నిజమైన భక్తి ప్రపత్తులు కలిగి ఉన్నవారే దైవ కృపకు పాత్రులు అవుతారు అనే సూక్తిని బక్రీద్ మనకు తెలియజేస్తోందని అన్నారు.అల్లా ఆశీస్సులు డివిజన్ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గండికోట గణేష్,దండగుల శంకర్, నల్లవెల్లి మహేందర్,బి.ఎం.కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధల మధ్య అంగరంగ వైభవంగా సర్పంచ్ రంజిత్ కుమార్ తనయుడు భూక్యభువన్ నాయక్ పుట్టినరోజు వేడుకలు...

ఆలయంలో ప్రత్యేక పూజలు..ఫోన్ ద్వారా శుభాకాంక్షలు తెలిపిన మండల ప్రజా ప్రతినిధులు..



**కారేపల్లి,మే28(సూర్యరేఖ)** సింగరేణి మండలం గాదేపాడు గ్రామపంచాయతీ సర్పంచ్ల సంఘం అధ్యక్షులు, భూక్యరంజిత్ కుమార్ తనయుడు భూక్య భువన్ నాయక్ ఆరవ పుట్టినరోజు వేడుకలు భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి,చిన్నారి భువన్ నాయక్ ఆయురారోగ్యాలతో,విద్యాభివృద్ధితో, సుఖసంతోషాలతో ఎదగాలని దేవుడిని ప్రార్థించారు. అనంతరం కుటుంబ సభ్యులు భువన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి ఆశీర్వదించారు. అలాగే మండలంలోని పలువురు సర్పంచ్‌లు భూక్య రంజిత్ కుమార్‌కు ఫోన్ చేసి చిన్నారి భువన్ నాయక్‌కు హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా భూక్యరంజిత్ కుమార్ మాట్లాడుతూ.. "మా కుమారుడు భువన్ నాయక్‌పై మీ అందరి ప్రేమ,ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నాం. శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ మా కుటుంబం తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు"అని తెలిపారు.

## కేరళ మాజీ సీఎం పినరాయి విజయన్ పై ఈడి దాడులను ఖండిస్తున్నాం..

కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మ దగ్ధం చేసిన సిపిఎం నాయకులు

సిపిఎం పార్టీ నాయకులు డి.నర్సింగరావు



**మేడ్చల్,మే28(సూర్యరేఖ)** కేరళ మాజీ సీఎం పినరాయి విజయన్ పైన ఎలాంటి కేసులు లేకుండా ఈడిని ఉపయోగించుకొని బిజెపి దాడులు చేయించడం సరైన పద్ధతి కాదని సిపిఎం పార్టీ మేడ్చల్ మండల కమిటీ సభ్యులు డి. నరసింగరావు అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ...కేరళలో నిర్వహించిన సోదాల సందర్భంగా ఎలాంటి అవినీతి జరిగిందో చెప్పకుండానే చేతులు ముడుచుకొని వెళ్లిపోవడం అనేది పినరాయి విజయన్ సిపిఎం పార్టీ యొక్క నిజాయితీ స్పష్టంగా కనపడుతుందని తెలియజేశారు.ఈడిని ఉపయోగించుకొని దాడులు చేసినంత మాత్రాన ఎవరు కృంగిపోరని,ప్రజల కోసం నిరంతరం పనిచేస్తూనే ఉంటారని,ఇది బిజెపి కాంగ్రెస్ గుర్తుంచుకోవాలని అన్నారు.అత్యధికంగా అవినీతి చేసినటువంటి వారు బిజెపిలోనే ఉన్నారని, అత్యధిక రేపిస్టులు బిజెపిలోనే ఉన్నారని బిజెపి తర్వాత కాంగ్రెస్ లో కూడా ఉన్నారని విమర్శించారు.ఈడి దాడులు చేయడం వల్ల దేశ ప్రజలకు సిపిఎం పార్టీ యొక్క నిజాయితీ స్పష్టంగా కనబడిందని,దీనివల్ల సిపిఎం పార్టీకి లాభం జరిగిందని అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు యాదగిరి,దేవమ్మ, సంపూర్ణ,సత్యమని, బాలమని,ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మేడ్చల్‌లో ఎన్‌టీఆర్ జయంతి వేడుకలు..



**మేడ్చల్,మే28(సూర్యరేఖ )** మేడ్చల్ పట్టణంలో ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి,తెలుగు ప్రజల ఆత్మగౌరవ ప్రతీక నందమూరి తారక రామారావ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పట్టణంలోని ఎన్‌టీఆర్ విగ్రహాన్ని పసుపు జెండాలు, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. పార్టీ నాయకులు,కార్యకర్తలు కలిసి ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన తెలుగు ప్రజలకు అందించిన సేవలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా ఎన్‌టీఆర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు,కార్యకర్తలు ,అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాయికోడ్ మండల కేంద్రంలో ఘనంగా బక్రీద్ వేడుకలు..

ఈద్గాలు,మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు..

పెద్ద సంఖ్యలో పాల్గొన్న ముస్లిం సోదరులు..





**అందోల్,మే28 (సూర్యరేఖ)** త్యాగానికి ప్రతీకగా భావించే బక్రీద్ పండుగను సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండల కేంద్రంతో పాటుగా మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం ముస్లిం మత పెద్దల ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో ఘనంగా బాక్రీద్ పండగ జరుపుకున్నారు.బక్రీద్ పండుగ సందర్భంగా ఈద్గాలు,మజీద్ లలో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు ఈద్గాకు చేరుకుని సామూహిక నమాజ్‌లో పాల్గొన్నారు.మత పెద్దలు శాంతి, సౌభ్రాతృత్వం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.బక్రీద్ త్యాగానికి ప్రతీక అని,పరస్పర ప్రేమాభిమానాలతో పండుగను జరుపుకుంటామని సందేశం ఇచ్చారు.ప్రార్థనల అనంతరం ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.చిన్నారులు,యువకులు కొత్త దుస్తుల్లో సందడి చేశారు.పలువురు ముస్లిం సోదరులు మాట్లాడుతూ...త్యాగ నిరతికి బక్రీద్ పండుగ నిదర్శనమని అన్నారు.ధనిక,పేద అన్న తారతమ్యం లేకుండా స్వార్థం,ద్వేషాలకు అతీతంగా ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ఈ పండుగను జరుపుకుంటున్నట్లు తెలిపారు.మండల కాంగ్రెస్ పార్టీ యువనాయకుడు మక్షుద్ అందచేశారు.ఈ కార్యక్రమంలో మైనార్టీ పెద్దలు, యువకులు,చిన్న పెద్ద తేడా లేకుంటా పాల్గొన్నారు.

## సమన్వయంతో పనిచేస్తేనే లక్ష్యాల సాధన..

ఏరియా జీఎం రాధాకృష్ణ



**మందమర్రి,మే28(సూర్యరేఖ)**సింగరేణి సంస్థ అభివృద్ధికి అన్ని విభాగాలు సమిష్టిగా కృషి చేయాలని మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.రాధాకృష్ణ సూచించారు. గురువారం ఏరియా జీఎం కార్యాలయంలో పర్సనల్, అకౌంట్స్,సివిల్ విభాగాల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ...విభాగాల వారీగా కొనసాగుతున్న పనులు,సాధించిన ప్రగతి,ఎదురవుతున్న సమస్యలపై జీఎం సుదీర్ఘంగా చర్చించారు.సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలంటే అధికారులు పరస్పర సహకారంతో ముందుకు సాగాలని పేర్కొన్నారు.ప్రతి విభాగం సంస్థకు కీలకమైందని,బాధ్యతాయుతమైన విధానంతో పని చేస్తేనే మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయని తెలిపారు.మందమర్రి ఏరియాను సింగరేణిలో ఆదర్శంగా నిలబెట్టేందుకు అధికారులు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమీక్ష సమావేశంలో ఏజీఎం (ఎఫ్ అండ్ ఏ)ఆర్వీఎస్ఆర్కే ప్రసాద్,డీజీఎం పర్సనల్ సీహెచ్ అశోక్,డీజీఎం ఐఈడీ కిరణ్ కుమార్, సివిల్ ఎస్ఈ శ్రీధర్,సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సత్యనారాయణతో పాటు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## గుండ్ల పోచంపల్లిలో సీఐటీయూ మున్సిపల్ కార్మికుల నూతన కమిటీ ఎన్నిక..



**మేడ్చల్,మే28(సూర్యరేఖ)**గుండ్ల పోచంపల్లి డివిజన్ లో సీఐటీయూ మున్సిపల్ కార్మికుల నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా సిఐటియు మేడ్చల్ మండల కార్యదర్శి ఎం.నరేష్ మాట్లాడుతూ... గుండ్లపోచంపల్లి డివిజన్ పరిధిలో పని చేస్తున్న మున్సిపల్ కార్మికులు అనేక రకాల ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వారి సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ నిరంతరం పోరాటం చేస్తుందని అన్నారు.మున్సిపల్ కార్మికులను హర్యానా,ఢిల్లీ రాష్ట్రాల లాగా ఇక్కడ ఉన్న కార్మికులను పర్మనెంట్ చేయాలని,కనీస వేతనం 26వేల రూపాయలు ఇవ్వాలని,25 లక్షల ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రవేశపెట్టాలని, వారంలో ఒక రోజు సెలవు,పండుగ సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.సిఐటియు గుండ్ల పోచంపల్లి మున్సిపల్ కార్మికుల యూనియన్ అధ్యక్ష కార్యదర్శులుగా సంతోష్ గణేష్ లను ఎన్నుకోవడం జరిగిందని అన్నారు.అధ్యక్షులుగా ఎం.నరేష్,ట్రెజరర్ గా రాజ్ కుమార్, ఉపాధ్యక్షులుగా శ్రీను,మంజుల,లక్ష్మణ్, జయమ్మ,సహాయ కార్యదర్శులుగా లక్ష్మి,సత్యజీ, కమల,శ్రీకాంత్,రజిత,స్వామి,కమిటీ సభ్యులుగా శివ,కృష్ణ, వెంకటయ్య, ఉమా రాణి,నిర్మల,నర్సింహా, నగేష్,ఏలీయా, నాగమణి,పద్మ, విజయ్, సలహాదారులుగా వీరబాబులను కమిటీ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగిందన్నారు.

## పుదుచ్చేరి ముఖ్యమంత్రి రంగస్వామిని మర్యాదపూర్వకంగా కలిసిన

ఎన్విరాన్మెంట్ వాటర్ హార్వెస్టింగ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బైరి శ్రీనివాస్ గౌడ్



**ఉప్పల్, మే28 (సూర్యరేఖ)** పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్. రంగస్వామిని ముఖ్యమంత్రి నివాసంలో గ్రీన్ పీస్ ఎన్విరాన్మెంట్ వాటర్ హార్వెస్టింగ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బైరి శ్రీనివాస్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఏప్రిల్9న పుదుచ్చేరి సార్వత్రిక ఎన్నికలు ఏఐఎన్ఆర్సి పార్టీకి 18సీట్లుతో విజయం సాధిస్తుందని మార్చి 29న ప్రకటించిన గ్రీన్ పీస్ ఎన్విరాన్‌మెంట్ వాటర్ హార్వెస్టింగ్ ఫౌండేషన్,సర్వే ఫలితాలు వెల్లడించింది. సర్వే ఫలితాలు నిజం కావడంతో పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామిని బైరి శ్రీనివాస్ గౌడ్ కలవడం జరిగింది.పర్యావర్ణం హితం కోసం విశేషంగా కృషి చేస్తున్నా గ్రీన్ పీస్ ఎన్విరాన్‌మెంట్ వాటర్ హార్వెస్టింగ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బైరి శ్రీనివాస్ గౌడ్ ను సీఎం అభినందించారు.

Printed and Published Mekkonda Premraj onbehalf of MPR Publications and Printed at H.No. 5-4-23, Bhavanicolony, Premavathipet, Rajendranagar, Rangareddy,Telangana 500030,RNI NO.TGTEL/25/A1713

# ఘనంగా కారేపల్లిలో ఎన్టీఆర్ 103వ జయంతి వేడుకలు..

"సమాజమే దేవాలయం..ప్రజలే దేవుళ్లు" సిద్ధాంతంతో చిరస్థాయిగా నిలిచిన మహానేత ఎన్టీఆర్

ఎన్టీఆర్ సేవలను స్మరించిన గుగులోత్ హర్షనాయక్

**కారేపల్లి,మే28(సూర్యరేఖ)** తెలుగు జాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు,మాజీ ముఖ్యమంత్రి,మహానేత స్వర్గీయ నందమూరి తారక రామారావు(ఎన్టీఆర్)103వ జయంతి వేడుకలను కారేపల్లి మండల యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం అత్యంత ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి,విగ్రహానికి పూలమాలలు వేసి నాయకులు ఘనంగా నివాళులర్పించారు.కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుగులోత్ హర్షనాయక్ మాట్లాడుతూ..తెలుగు ప్రజల గౌరవాన్ని దేశవ్యాప్తంగా చాటిచెప్పిన మహోన్నత నాయకుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. సినీ రంగంలో అపార కీర్తిని సంపాదించిన ఆయన, రాజకీయాల్లో ప్రజాసేవకు సరికొత్త అర్థం చెప్పిన అరుదైన నాయకుడని పేర్కొన్నారు. "సమాజమే దేవాలయం..ప్రజలే దేవుళ్లు అనే మహోన్నత సిద్ధాంతాన్ని జీవితాంతం ఆచరించిన ప్రజానాయకుడు ఎన్టీఆర్.ఆయన కేవలం సినీ నటుడు మాత్రమే కాదు..తెలుగు జాతి గర్వకారణం, పేద ప్రజల ఆశాకిరణం,అణగారిన వర్గాల అండదండ"అని హర్షనాయక్ అన్నారు. తెలుగు వారి ఆత్మగౌరవాన్ని ఢిల్లీ స్థాయిలో నిలబెట్టిన ధీశాలి ఎన్టీఆర్ అని గుర్తుచేసిన ఆయన, పేదల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన "రెండు రూపాయలకే కిలో బియ్యం"పథకం దేశ రాజకీయ చరిత్రలోనే సంక్షేమ పాలనకు మార్గదర్శకంగా నిలిచిందన్నారు.సినిమాల్లో శ్రీరాముడు,శ్రీకృష్ణుడి పాత్రలతో కోట్లాది అభిమానుల మనసులు గెలుచుకున్న ఎన్టీఆర్,నిజ జీవితంలో పేదలు, బడుగు బలహీన వర్గాల కోసం పోరాడి నిజమైన "ప్రజా దేవుడు"గా నిలిచారని స్పష్టం చేశారు. తెలుగు జాతి ఉన్నంతకాలం ఎన్టీఆర్ సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గుగులోత్ రాజేష్ నాయక్,యువజన కాంగ్రెస్ నాయకులు గుగులోత్ కిరణ్ కుమార్, దసానియా ఉపేందర్ సింగ్,తదితరులు పాల్గొన్నారు



## బెల్లంపల్లిలో ఎండదెబ్బకు వ్యక్తి మృతి..

**బెల్లంపల్లి,మే28(సూర్యరేఖ)**



బెల్లంపల్లి పట్టణంలోని 33వ వార్డు హనుమాన్ బస్తికి చెందిన పూసల మొగిలి ఎండదెబ్బతో మృతి చెందిన ఘటన విషాదాన్ని కలిగించింది కాంగ్రెస్ ఆఫీస్ లైన్‌లో ఇస్త్రీ లాండ్రీ షాప్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్న మొగిలి గత వారం రోజులుగా తీవ్ర ఎండలు,వడగాల్పుల కారణంగా అనారోగ్యానికి గురయ్యాడు. స్థానికులు గమనించి కౌన్సిలర్ పోలు ఉమాదేవి శ్రీనివాస్‌కు సమాచారం అందించారు. వెంటనే ఆమె 108సిబ్బందికి సమాచారం ఇవ్వగా, వారు వచ్చి పరిశీలించి ఎండదెబ్బతో మృతి చెందినట్లు నిర్ధారించారు.మొగిలి భార్య ఇప్పటికే మృతి చెందగా,ఆయన ఒంటరిగా నివసించేవాడు. ఆయనకు ఒక కుమార్తె గోదావరిఖనిలో ఉన్నట్లు స్థానికులు తెలిపారు.

## ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకొని 26వ సారి రక్తదానం చేసిన

టిడిపి సీనియర్ నాయకులు పబ్బతి శేఖర్ రెడ్డి

శేఖర్ రెడ్డిని అభినందించిన ఎన్టీఆర్ ట్రస్ట్ చైర్మన్ నారా భువనేశ్వరి

**ఉప్పల్,మే28(సూర్యరేఖ)** మాజీ ముఖ్యమంత్రి,తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నటరత్న నందమూరి తారకరామారావు 103వ జయంతి సందర్బంగా ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ లో రక్తా దాన శిబిరంలో ఉప్పల్ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పబ్బతి శేఖర్ రెడ్డి 26వ సారి రక్తధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ ట్రస్ట్ చైర్మన్ నారా భువనేశ్వరి రక్తదాన శిబిరానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి 26సార్లు రక్తదానం చేసినందుకు పబ్బతి శేఖర్ రెడ్డికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలోరాష్ట్ర నాయకులు తాళికోట హరికృష్ణ, టీజీకె మూర్తి,కుతాడి నరసింహా,సంధ్యపోగు రాజశేఖర్,సాయినాగార్జున,నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# బాల్కసుమన్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతల ఆగ్రహం..

**మందమర్రి,మే28(సూర్యరేఖ)** చెన్నూరు మాజీ ఎమ్మెల్యే,పెద్దపల్లి మాజీ ఎంపీ, మంచిర్యాల జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు.ఈ మేరకు మందమర్రి పట్టణ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం పట్టణ ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు.పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మంద తిరుమల్ రెడ్డి మాట్లాడుతూ...బీఆర్ఎస్ పాలనలో టీబీజీకేఎస్ నాయకులను అడ్డంగా పెట్టుకొని సింగరేణి కార్మికులను మోసం చేశారని ఆరోపించారు.కారుణ్య నియామకాల పేరిట డబ్బులు వసూలు చేసి అనేక కుటుంబాలను ఇబ్బందులకు గురి చేశారని విమర్శించారు.ఈ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మంద తిరుమల్ రెడ్డి,ఎస్సీ సెల్ జిల్లా ఛైర్మన్ పైడిమల్ల నర్సింగ్,అధికార ప్రతినిధి సట్ల సంతోష్,నాయకులు సొత్కు సుదర్శన్,లు మాట్లాడుతూ...ప్రస్తుతం ప్రజా సమస్యలపై పోరాడాల్సిన ప్రతిపక్ష నాయకులు ప్రజలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడటం బాధ్యతారాహిత్యమని అన్నారు.బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యలు కార్మికుల్లో భయాందోళనలు కలిగించేలా ఉన్నాయని పేర్కొన్నారు.యువతను తప్పుదోవ పట్టిస్తూ రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవాలని చూస్తున్నారని ఆరోపించిన కాంగ్రెస్ నాయకులు,యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తోందని,ముఖ్యంగా మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి చెన్నూరు నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే బీఆర్ఎస్ నేతలు



విమర్శలు చేస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ పట్టణ అధ్యక్షులు నోముల ఉపేందర్ గౌడ్,పట్టణ మహిళా అధ్యక్షురాలు గడ్డం రజిని,సేవాదళ్ పట్టణ అధ్యక్షులు సొత్కు ఉదయ్,నేరువట్ల శ్రీనివాస్, సేవాదళ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎండీ పాషా,పట్టణ ఉపాధ్యక్షులు,వీరన్న,బండి శంకర్,బేర వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శులు వనం నర్సయ్య,దుర్గం ప్రభాకర్,కొలిపాక సదానందం, పట్టణ అధికార ప్రతినిధి సట్ల సంతోష్,మహిళా నాయకులు బత్తుల సరిత,రాధ,సమత,మహిళా సీనియర్ నాయకురాలు పోచంపల్లి లక్ష్మీ పట్టణ కార్యదర్శి రెడ్డి ఐలయ్య, నాయకులు ఎర్ర రాజు,తుంగపిండి శంకర్,ఆడెపు వేణు,సామెల్,మధు,సంపత్,రవి,రామ్,గాదె రాములు,నామిని ముత్తయ్య,రాజేష్,యూత్ కాంగ్రెస్ నాయకులు రాయబారపు కిరణ్,సంజీవ్, మీడియా అండ్ కమ్యూనికేషన్స్ ఇంచార్జ్ చిప్పకుర్తి శశిధర్,సోషల్ మీడియా ఇంచార్జ్ మూడారపు శేఖర్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యసభ సభ్యురాలు రేణుక చౌదరి నిధులతో సీసీ రోడ్ పనులకు శ్రీకారం..

భాగ్యనగర్ తండాలో రూ.4లక్షల అభివృద్ధి పనుల ప్రారంభం..


గ్రామ అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించాలని ప్రజాప్రతినిధుల విజ్ఞప్తి..



**కారేపల్లి,మే28(సూర్యరేఖ)** సింగరేణి మండలం భాగ్యనగర్ తండా గ్రామపంచాయతీలో రాజ్యసభ సభ్యురాలు,మాజీ కేంద్ర మంత్రి గారపాటి రేణుకచౌదరి నిధులతో మంజూరైన సీసీ రోడ్ పనులను ఘనంగా ప్రారంభించారు.గుగులోత్ బిచ్చ ఇంటి నుండి ఆలోత్ రాందాస్ ఇంటి వరకు రూ.4లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ నిర్మాణ పనులకు గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ గుగులోత్ బీక్కు లాల్ నాయక్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఉపసర్పంచ్ బీక్కులాల్ నాయక్ మాట్లాడుతూ... వెనుకబడిన గ్రామపంచాయతీల అభివృద్ధికి రాజ్యసభ నిధుల ద్వారా సహకారం అందిస్తున్న రేణుక చౌదరికి గ్రామ ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.గ్రామంలో ఇంకా అనేక రహదారులు అభివృద్ధికి నోచుకోక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, మరిన్ని నిధులు మంజూరు చేసి గ్రామాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. సీసీ రోడ్ నిర్మాణంతో స్థానిక ప్రజలకు రాకపోకల సౌకర్యం మెరుగుప డటంతో పాటు వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తొలగిపోతాయని గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఈశ్వరి నందరాజు పోలంపల్లి,మాజీ సర్పంచ్ దారావత్ బద్రునాయక్, వార్డు సభ్యులు గుగులోత్ నాగేష్, తేజావత్ భూలి,భూక్యకిషన్ నాయక్,యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుగులోత్ హర్షనాయక్, గుగులోత్ వీరన్న,తారాచంద్,రాందాస్,బిచ్చ,ఆలోత్ శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

## రామంతపూర్ లో ఘనంగా బక్రీద్ వేడుకలు..





**ఉప్పల్,మే28(సూర్యరేఖ)** త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ (ఈద్-ఉల్-అజ్హా) పండుగను రామంతపూర్ పెద్ద మసీదులో గురువారం ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా ముస్లిం మత గురువులు బక్రీద్ పండుగ ప్రాముఖ్యతను, దాని విశిష్టతను భక్తులకు వివరించారు.పవిత్ర ఖురాన్ బోధనలను ప్రతి ఒక్కరూ తూ.చా. తప్పకుండా పాటించాలని పిలుపునిచ్చారు. సమాజంలో శాంతియుతంగా జీవించాల న్నారు. ప్రార్థనల అనంతరం చిన్న,పెద్ద ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ 'ఈద్ ముబారక్' అంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎంఎ జలీల్ పాషా, ప్రెసిడెంట్ తాఫిక్,సెక్రటరీ పాషా జహంగీర్, మహమ్మద్ గౌస్,ఫైయాజ్,అహ్మద్, నయీమ్,ఖుర్షిడ్ సహాబ్,వాసీద్ అలీ ఆఫ్సర్, అజాజ్,ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

## రాయికోడ్ మండల కేంద్రంలో ఘనంగా బక్రీద్ వేడుకలు...

ఈద్గాలు,మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు..

పెద్ద సంఖ్యలో పాల్గొన్న ముస్లిం సోదరులు..



**అందోల్,మే28(సూర్యరేఖ)** సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం మాటూరు గ్రామంలో గురువారం ముస్లిం మత పెద్దల ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో ఘనంగా బాక్రీద్ పండగ జరుపుకున్నారు.బక్రీద్ పండుగ సందర్భంగా పట్టణంలోని ఈద్గాలు,మజీద్ లలో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు ఈద్గాకు చేరుకుని సామూహిక నమాజ్‌లో పాల్గొన్నారు.మత పెద్దలు శాంతి, సౌభ్రాతృత్వం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.బక్రీద్ త్యాగానికి ప్రతీక అని,పరస్పర ప్రేమాభిమానాలతో పండుగను జరుపుకుంటామని సందేశం ఇచ్చారు.ప్రార్థనల అనంతరం ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చిన్నారులు,యువకులు కొత్త దుస్తుల్లో సందడి చేశారు.పలువురు ముస్లిం సోదరులు మాట్లాడుతూ...త్యాగ నిరతికి బక్రీద్ పండుగ నిదర్శనమని అన్నారు.ధనిక,పేద అన్న తారతమ్యం లేకుండా స్వార్థం,ద్వేషాలకు అతీతంగా ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ఈ పండుగను జరుపుకుంటున్నట్లు తెలిపారు.ప్రతి ఒక్కరూ దాన గుణం,సేవాగుణం అలవర్చుకోవాలని చెప్పారు.పండుగ సందర్భంగా ముస్లిం సోదరులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ, బంధుమిత్రులతో సంతోషంగా గడిపారు.బక్రీద్ విశిష్టతలో భాగమైన ఖుర్బానీని చుట్టుపక్కల వారికి దానంగా అందజేశారు మండల కాంగ్రెస్ పార్టీ యువనాయకుడు మక్షుద్ అందచేశారు ఈకార్యక్రమంలో మైనార్టీ పెద్దలు,యువకులు,చిన్న పెద్ద తేడా లేకుంటా పాల్గొన్నారు.

## కొల్చారం మండల వ్యాప్తంగా ఘనంగా బక్రీద్ పండగ వేడుకలు...



**కొల్చారం,మే28 (సూర్యరేఖ)** బక్రీద్ పండగ త్యాగానికి ప్రతీక అని కొల్చారం మస్జిద్ ఇమామ్ దావుద్ ఖాన్ అన్నారు. కొల్చారం మండల వ్యాప్తంగా బక్రీద్ పండగను ముస్లిం సోదరులు అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. కొల్చారం ఈద్ గా వద్ద ముస్లిం సోదరులు ప్రత్యేక సామూహిక ప్రార్థనలు చేశారు.ఇమామ్ దావుద్ ఖాన్ ముస్లిం సోదరులను ఉదేశించి శాంతి సందేశాన్ని ఇచ్చారు.అంతరం ఒకరిని ఒకరు ఆలింగనం చేసుకొని ముస్లిం సోదరులు పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.అంతరం గ్రామంలోని ప్రసిద్ధ షేక్ షాబొద్దిన్ దర్గా వద్ద ప్రార్థనలు చేశారు.ఈ సందర్భంగా ఇమామ్ దావుద్ ఖాన్,గ్రామ ముస్లిం సంఘం అధ్యక్షుడు అరిఫోద్దీన్,మాజీ కోఆప్షన్ సభ్యులు ఖదీర్ లు మాట్లాడుతూ...పండగ శు భాకాంక్షలు తెలిపారు.బక్రీద్ పండగ త్యాగానికి ప్రతీక అని అన్నారు.ఈ కార్యక్రమంలో సమీర్, మున్ను,ఖాలీమ్,సయ్యద్ అక్రమ్,హైమద్,ఆర్షద్, సాజిద్,ఫాహాద్,తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా ఎన్టీఆర్ 103వ జయంతి వేడుకలు..





తెలుగుదేశం శ్రేణుల్లో ఉత్సాహ తరంగాలు..
500 మందికి పైగా కార్యకర్తల సందడి...పార్టీ పండుగలా మారిన మహానాడు
మందమర్రిలో విజయవంతమైన వర్చువల్ మహానాడు..
ఎన్టీఆర్ ఆశయాల సాధనే లక్ష్యం..
పెద్దపల్లి పార్లమెంట్ టిడిపి కన్వీనర్ సంజయ్ కుమార్

**మందమర్రి,మే28(సూర్యరేఖ)** తెలుగుజాతి గౌరవాన్ని ప్రపంచ పటంలో నిలబెట్టిన మహానటుడు,మహానాయకుడు,తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారకరామారావు(ఎన్టీఆర్)103వ జయంతి వేడుకలు మందమర్రి పట్టణంలో గురువారం అత్యంత ఘనంగా,ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు.పట్టణమంతా పసుపు జెండాలతో కళకళలాడగా,తెలుగు తమ్ముళ్ల నినాదాలతో కమ్యూనిటీ హాల్ ప్రాంతం మార్మోగిపోయింది.పార్టీ శ్రేణులు,అభిమానులు,మహిళలు,యువకులు భారీ సంఖ్యలో తరలివచ్చి ఎన్టీఆర్‌కు ఘన నివాళులు అర్పించారు.ఈ నెల 27,28 తేదీల్లో నిర్వహించిన వర్చువల్ మహానాడు కార్యక్రమం మందమర్రిలో పార్టీ శ్రేణుల అపూర్వ భాగస్వామ్యంతో విజయవంతమైంది.స్థానిక కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన భారీ డిజిటల్ స్క్రీన్‌ల ద్వారా మహానాడు ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించేందుకు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలివచ్చారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పెద్దపల్లి పార్లమెంట్ టిడిపి కన్వీనర్ సంజయ్ కుమార్ తొలుత పార్టీ జెండాను ఆవిష్కరించి,అనంతరం ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి ఆయన సేవలను స్మరించుకున్నారు.అనంతరం ఎన్టీఆర్ 103వ జయంతిని పురస్కరించుకుని భారీ కేక్ కట్ చేసి నాయకులు,కార్యకర్తలకు మిఠాయిలు పంచిపెట్టారు.డప్పుల మోగింపు,జై ఎన్టీఆర్ నినాదాలు,తెలుగు దేశం పార్టీ జెండాలతో కార్యకర్తలు ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు.మహిళా నాయకులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.ఈ సందర్భంగా పెద్దపల్లి పార్లమెంట్ టిడిపి కన్వీనర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ... "మహానాడు అనేది కేవలం సమావేశం మాత్రమే కాదు...అది ప్రతి తెలుగు తమ్ముడి భావోద్వేగం, కార్యకర్తల పండుగ"అని పేర్కొన్నారు.తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు ఎన్టీఆర్ రాజకీయాల్లోకి వచ్చిచరిత్ర సృష్టించారని కొనియాడారు.పేదల సంక్షేమం,మహిళల గౌరవం, రైతుల అభ్యున్నతి కోసం ఎన్టీఆర్ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఈసారి మహానాడును నెల్లూరులో నిర్వహించాలని నిర్ణయించినప్పటికీ, పార్టీ పొదుపు చర్యల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రతి కార్యకర్త నేరుగా వీక్షించే విధంగా అత్యాధునిక సాంకేతికతతో వర్చువల్ మహానాడు నిర్వహించడం అభినందనీయమన్నారు.మందమర్రి, రామకృష్ణాపూర్,బెల్లంపల్లి,చెన్నూరు పరిసర ప్రాంతాల నుండి దాదాపు 500మందికి పైగా నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి మహానాడు ప్రసంగాలను ఆసక్తిగా వీక్షించారు. మొత్తంగా మందమర్రిలో నిర్వహించిన ఎన్టీఆర్ జయంతి వేడుకలు పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపగా,వర్చువల్ మహానాడు కార్యక్రమం కార్యకర్తల్లో ఐక్యత,ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచిందని నాయకులు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్యనేతలు వాసాల సంపత్, పెద్దపల్లి సత్యనారాయణ,రాష్ట్ర నాయకులు ఎండి శారీఫా, ఉమామహేశ్వర్ రావు,అక్కపాక తిరుపతి, ఉప్పునూటి రామకృష్ణ,తలారి రాజు,కారం రాజు, మహిళా నాయకులు జూపాక సంధ్య,సుగుణక్క, సామ కవిత,కోలా కిషన్,కోడివారి కవిత,చిటకెల రాయలింగు,మామిడాల భాగ్య,రజిత,కళమ్మ, పార్వతమ్మతో పాటు పెద్ద సంఖ్యలో తెలుగు తమ్ముళ్లు,అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# రామాయంపేట పోలీసుల మెరుపు ఆపరేషన్..

మూడు గంటల్లోనే దొంగల అరెస్ట్..రూ.2.80 లక్షల విలువైన 4.5 తులాల బంగారం స్వాధీనం..



**రామాయంపేట,మే28(సూర్యరేఖ)** ప్రయాణికురాలి బ్యాగ్‌లోని బంగారు ఆభరణాలను అపహరించిన ఇద్దరు మహిళా దొంగలను రామాయంపేట పోలీసులు కేవలం మూడు గంటల వ్యవధిలోనే పట్టుకొని,వారి వద్ద నుండి మొత్తం 49.100 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకొని అరెస్టు చేశారు.సీసీ కెమెరాల ఆధారంగా పక్కా సమాచారంతో వెంటాడి,మరో బస్సులో పారిపోతున్న నిందితులను బోయిన్ పల్లి వద్ద అదుపులోకి తీసుకోవడం పోలీసుల చాకచక్యానికి నిదర్శనంగా నిలిచింది.రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం భీముని మల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన సుద్దాల దేవాలక్ష్మి(45)తన కుమార్తె ఇంట్లో జరిగిన బోనాల ఉత్సవాలకు హాజరై తిరుగు ప్రయాణంలో ఈ దొంగతనానికి గురయ్యారు. ఈనెల 27తేదీ బుధవారం అక్కన్నపేట నుండి రామాయంపేటకు చేరుకున్న ఆమె,కామారెడ్డి వైపు వెళ్లే ఆర్మూర్ డిపో బస్సు ఎక్కే సమయంలో తన భుజానికి తగిలించుకున్న సంచిని ఎవరో లాగుతున్నట్లు అనుమానం రావడంతో వెంటనే తనిఖీ చేయగా,అందులోని బంగారు ఆభరణాలు కనిపించలేదు.దీంతో ఆమె రామాయంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు అందుకున్న వెంటనే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.బస్టాండ్ పరిసరాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించగా,ముఖాలకు స్కార్ఫ్‌లు కట్టుకున్న ఇద్దరు యువతులు అనుమానాస్పదంగా సంచరిస్తూ బాధితురాలి బ్యాగ్ నుంచి ఆభరణాలను అపహరించినట్లు గుర్తించారు.అనంతరం వారు మెదక్ వెళ్లే బస్సులో ఎక్కినట్లు పోలీసులు గుర్తించారు.మెదక్ బస్టాండ్ సీసీ కెమెరాల ఆధారంగా ఆ ఇద్దరు మహిళలు అక్కడి నుంచి బోధన్ డిపోకు చెందిన జేబీఎస్ వెళ్లే బస్సులో ప్రయాణిస్తున్నట్లు పోలీసులు నిర్ధారించారు.వెంటనే బస్సు కండక్టర్‌తో సంప్రదించి,బోయిన్పల్లి పోలీస్ స్టేషన్ వద్ద బస్సును ఆపించారు.అక్కడికి చేరుకున్న రామాయంపేట పోలీస్ సిబ్బంది ఇద్దరు మహిళా నిందితులను అదుపులోకి తీసుకొని,వారి వద్ద నుంచి దొంగిలించిన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.అరెస్టు చేసిన నిందితులు కర్ణాటక రాష్ట్రంలోని కలబుర్గికి చెందిన శ్వేత కాలే (23),మహారాష్ట్రలోని పూణే నగరానికి చెందిన శిల్పావేలు (20)గా పోలీసులు గుర్తించారు.వీరిపై ఇప్పటికే పలు దొంగతనం కేసులు నమోదై ఉన్నట్లు వెల్లడించారు. నిందితుల వద్ద నుండి 20.200 గ్రామల బంగారు గొలుసు,24.200 గ్రాముల బంగారు హారం, 4.700 గ్రాముల బంగారు ఉంగరం స్వాధీనం చేసుకున్నారు.మొత్తం బంగారం విలువ సుమారు రూ.2.80 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.ఈ కేసును డీఎస్పీ జె.సరేందర్ గౌడ్ పర్యవేక్షణలో,సీఐ బి.సైదా ఆధ్వర్యంలో ఎస్సై ఆర్. బాలరాజు,సిబ్బంది నరేష్,భాస్కర్,సూర్యప్రకాశ్ తదితరులు ఛేదించారు.కేసు విచారణలో సహకరించిన బస్సు డ్రైవర్,కండక్టర్‌ల చాకచక్యాన్ని ఉన్నతాధికారులు అభినందించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.వి.శ్రీనివాసరావు ఐపీఎస్ మాట్లాడుతూ..."ప్రయాణికులు బస్టాండ్‌లు,రద్దీ ప్రాంతాల్లో తమ విలువైన వస్తువుల విషయంలో అప్రమత్తంగా ఉండాలి"అని సూచించారు.కేసును వేగంగా ఛేదించిన పోలీసు బృందానికి ప్రత్యేక రివార్డులు అందజేయనున్నట్లు తెలిపారు.

## 9మంది పేకాట రాయిల్లు అరెస్ట్..

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా ఆర్పి గార్డెన్..



**బెల్లంపల్లి,మే28(సూర్యరేఖ)** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామపంచాయతీలోని తిరుమల హిల్స్ లో ఆర్ పి గార్డెన్ లో పేకాట ఆడుతున్న పలువురిని అరెస్టు చేసినట్లు తాళ్ల గురజాల ఎస్ఐ బి.రామకృష్ణ తెలిపారు.ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం...పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్ పి గార్డెన్లో పేకాట ఆడుతున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు ఆకస్మిక దాడి చేయగా 9మంది పేకాట ఆడుతు పట్టుబడినట్లు తెలిపారు.గార్డెన్లో పేకాట ఆడుతున్న జె.క్రాంతి కుమార్,డి.శ్రీనివాస్,ఎ.పోశం,తొంగల వెంకటేష్,గొడిశల మణిరాజ్,గాజు గంగాధర్,సింగతి రవి,సలేందర్ కేశవ్,ఎండి హఫీజ్ అనే 9మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు.పేకాట రాయుళ్ల వద్ద నుండి1లక్ష 28వేల240 రూపాయలు,8సెల్ ఫోన్స్ స్వాధినం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.కాగా ఈ ఫంక్షన్ హాల్ పరిధిలో గత కొద్ది కాలంగా అసాంఘిక కార్యకలాపాలు ఉధృతంగా సాగుతున్నాయని పలువురు ఫిర్యాదులు చేసినట్లు సమాచారం.పేకాట రాయులతో పాటు ఇతర అసాంఘిక కార్యకలాపాలను కొనసాగించడానికి ఫంక్షన్ హాల్ యజమాని పూర్తి సహకారాలు ఉన్నట్లు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

## ఉస్మానియా యూనివర్సిటీలో డా.బుల్లెట్ కృష్ణ నాయక్‌కు ఘన సన్మానం..

బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియామకం పట్ల ఉస్మానియా యూనివర్సిటీ నాయకుల అభినందనలు..



**మరిపెడ,మే28(సూర్యరేఖ)** బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఇటీవల నియమితులైన తెలంగాణ ఉద్యమకారుడు,బీజేపీ సీనియర్ నాయకుడు, డోర్నకల్ నియోజకవర్గం మరిపెడ మండలానికి చెందిన డా.బుల్లెట్ కృష్ణ నాయక్‌ను ఉద్యమాల పురిటిగడ్డ ఉస్మానియా యూనివర్సిటీ హైదరాబాద్ లో యూనివర్సిటీ నాయకులు ఘన సన్మానం నిర్వహించారు.ఈ సందర్భంగా బుల్లెట్ కృష్ణను తెలంగాణ ఉద్యమకారులు,ఉస్మానియా యూనివర్సిటీ జేఏసీ నాయకులు,గిరిజన జేఏసీ నాయకులు కలిసి ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం డా.కృష్ణ నాయక్ మాట్లాడుతూ....తనకు అవకాశం కల్పించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు,బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు నేనావత్ రవినాయక్ లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రవి నాయక్,చందు నాయక్,వెంకన్న నాయక్,భాస్కర్ నాయక్,సురేష్ నాయక్,రవి,శ్రీను,యాకుబ్,నరేష్,ధర్మ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ మార్కులు సాధించిన గౌడ విద్యార్థిని విద్యార్థులకు సన్మానం..



**కామారెడ్డి,మే28(సూర్యరేఖ)** జై గౌడ ఉద్యమం ఆధ్వర్యంలో పదో తరగతి మరియు ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన గౌడ విద్యార్థులకు,అలాగే ఇటీవల ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన సర్పంచులు,కౌన్సిలర్లు మరియు ఇతర నాయకులకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు రంగోల్ల మురళి తెలిపారు.ఈ సన్మాన కార్యక్రమం శుక్రవారం కామారెడ్డి పట్టణంలోని కర్షక్ బీఈడీ కళాశాలలో వైభవంగా నిర్వహించబడనుంది.విద్య, సామాజిక సేవ మరియు ప్రజా నాయకత్వ రంగాల్లో ప్రతిభ కనబరిచిన గౌడ బంధువులను ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.జిల్లా అధ్యక్షుడు రంగోల్ల మురళి మాట్లాడుతూ...గౌడ సమాజ యువత విద్యారంగంలో మరింత ముందుకు రావాలని,అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించడం ద్వారా ఇతరులకు స్ఫూర్తిగా నిలపాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.అదేవిధంగా ఇటీవల గ్రామాలు,పట్టణాల్లో ప్రజా సేవకు ఎన్నికైన సర్పంచులు,కౌన్సిలర్లు మరియు ఇతర ప్రజా ప్రతినిధులను సన్మానించడం ద్వారా సమాజ ఐక్యతను చాటాలని అన్నారు.ఈ కార్యక్రమానికి గౌడ బంధువులు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.కార్యక్రమ ఏర్పాట్లలో జిల్లా ప్రధాన కార్యదర్శి అంకన్నగారి శ్రీనివాస్ గౌడ్, ఇందూరి సిద్ధాగౌడ్,నరేష్ గౌడ్,కరోల్ల శేఖర్ గౌడ్, అంకన్నగారి గంగాధర్ గౌడ్,శ్రీకాంత్ గౌడ్,దేవేందర్ గౌడ్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## లచ్చపేట మహాబాల రైస్ మిల్,ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్,అదనపు కలెక్టర్ విక్టర్,లు



**కామారెడ్డి,మే28(సూర్యరేఖ)** గురువారం జిల్లా కలెక్టర్ మాతారెడ్డి మండలంలోని వివిధ రైస్ మిల్లులను తనిఖీలు చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోళ్లు,అన్‌లోడింగ్ ప్రక్రియ,రవాణా ఏర్పాట్లను సమీక్షించారు.ధాన్యం సకాలంలో మిల్లులకు తరలించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.బక్రీద్ పండుగ సందర్భంగా డ్రైవర్ల కొరత లేకుండా రవాణా కార్యకలాపాలకు అంతరాయం కలగకుండా ఉండేందుకు జిల్లా కలెక్టర్ ఇటీవల రవాణాదారులతో సమావేశం నిర్వహించి,నిరంతర రవాణా సేవలు కొనసాగించాలని ఆదేశించారు.వరి రవాణాలో పాల్గొంటున్న డ్రైవర్ల సేవలను అభినందిస్తూ, ముఖ్యంగా మహారాష్ట్ర,కర్ణాటక రాష్ట్రాల నుంచి వచ్చిన డ్రైవర్లకు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ దుస్తులు,నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. జిల్లా యంత్రాంగం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని రవాణాదారులు,డ్రైవర్లు అభినందిస్తూ,వరి ధాన్యం సకాలంలో తరలింపునకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, రవాణాదారులు, డ్రైవర్లు,మిల్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఆవును జాతీయ జంతువుగా ప్రకటించాలని డిమాండ్ కు షబ్బీర్ అలీ మద్దతు..

**కామారెడ్డి,మే28(సూర్యరేఖ)**ఏపవిత్రమైన బక్రీద్ (ఈద్-ఉల్-అజ్హా)పర్వదినాన్ని పురస్కరించుకొని కామారెడ్డి పట్టణంలోని కోర్టు ఆవరణలో గల ఈద్గాలో నిర్వహించిన ప్రత్యేక నమాజ్ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ పాల్గొన్నారు. అనంతరం అక్కడికి విచ్చేసిన ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రసంగించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ...ఈద్-ఉల్-అజ్హా పండుగ విశ్వాసం,త్యాగం,కరుణ, మానవత్వం వంటి గొప్ప విలువలను సమాజానికి గుర్తు చేస్తుందని అన్నారు.ప్రతి ఇంటిలో శాంతి, సంతోషం,ఐశ్వర్యం,సౌభ్రాతృత్వం నిండాలని ఆకాంక్షించారు.సమాజ సేవ,ఐక్యత,సోదరభావం వంటి విలువలను ప్రతి ఒక్కరూ మరింత బలోపేతం చేసుకోవాలని పిలుపునిచ్చారు.కుల గణనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి అన్నారు. బీజేపీ రాజ్యాంగ విరుద్ధమైన చర్యలపై ధ్వజం ఎత్తారు.గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలనే ప్రతిపాదనకు మద్దతు తెలిపారు.కుల గణన మరియు ఎస్.ఐ.ఆర్ పై దేశంలో జరుగుతున్న ప్రస్తుత పరిణామాలు,కులగణన ప్రాధాన్యతపై వివరంగా మాట్లాడాతూ.. రాష్ట్రంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కులగణన(సెన్సస్) ప్రక్రియలో ప్రతి ఒక్కరూ ఎట్టి పరిస్థితుల్లోనూ తమ వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు.సమాజంలో అన్ని వర్గాలకు న్యాయం జరగాలంటే



కులగణన అత్యంత కీలకం..దీనిపై స్థానిక నాయకులు,ప్రభుత్వ అధికారులు ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలి" అని ఆయన ఆదేశించారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై షబ్బీర్ అలీ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.బీజేపీ ప్రభుత్వం తమకు వ్యతిరేకంగా ఉ

# యుగపురుషునికి నీరాజనం..

**బడుగు బలపీన వర్గాల ఆశాజ్యోతి ఎన్టీఆర్..**

**ప్రజలకు ఉత్తమ పాలన అందించిన వ్యక్తి..ఎన్టీఆర్**

**ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు..**

**రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**

**రాజేంద్రనగర్,మే28(సూర్యరేఖ)** భారతరత్న నందమూరి తారకరామారావు నేటి యువతకు ఆదర్శనీయుడని రాజేంద్రనగర్ నియోజకవర్గం శాసనసభ్యులు ప్రకాష్ గౌడ్ అన్నారు.పార్టీ పెట్టిన తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి వచ్చి చరిత్ర తిరిగరాసిన గొప్ప నాయకుడు ఎన్టీఆర్ అని వ్యాఖ్యానించారు. గురువారం ఎన్టీఆర్ 103వ జయంతి సందర్భంగా ఎమ్మెల్యే నివాసం వద్ద వేడుకలను నిర్వహించారు.ఈ మేరకు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కేక్ కట్ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహానేత,ప్రముఖ నటుడు,మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ సేవలు చిరస్మరణీయమన్నారు.ప్రజా సేవలోనూ,సినీ రంగంలోనూ ఎన్టీఆర్ చూపిన మార్గం భావితరాలకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.తెలుగుదేశం పార్టీ స్థాపనతో ఎన్టీఆర్ తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పారని కొనియాడారు.బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎన్టీఆర్ చేసిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు.ఆయన స్ఫూర్తితోనే తాను కూడా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పేద,మధ్యతరగతి ప్రజలకు ఉత్తమ పాలన అందించిన వ్యక్తి ఎన్టీఆర్ అని పేర్కొన్నారు. అయన బాటలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్నారని,అందుకు నిరంతరం కృషి చేస్తున్నాడని కొనియాడారు.ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్ర అభివృద్ధి, పేదలకు సంక్షేమం సాధ్యమైంది.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ టి.ప్రేమ్ దాస్ గౌడ్,సరికొండ వెంకటేష్,టి.ప్రేమ్ గౌడ్,సూరెడ్డి సాయిరెడ్డి,మాధవరెడ్డి,సోమ శ్రీనివాస్ గుప్తా, ధనంజయ, సానేం జీవన్ గౌడ్,సుధాకర్ గౌడ్, నారాయణ,సీనియర్ నాయకులు,పార్టీ



కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలి..

**జీహెచ్ఎంసీ ఎన్నికలకు సిద్ధం కండి:**

**పార్టీ నాయకులు,కార్యకర్తలు పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టాలి..**

**ముఖ్య నాయకుల సమావేశంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**

**రాజేంద్రనగర్,మే28(సూర్యరేఖ)** మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని భారీ మెజారిటీతో గెలిపించుకునే బాధ్యత ప్రతి ఒక్కరూ కార్యకర్త,నాయకునిపై ఉందని రాజేంద్రనగర్ నియోజకవర్గం శాసనసభ్యులు టి.ప్రకాష్ గౌడ్ అన్నారు.నియోజకవర్గం పరిధిలోని జీహెచ్ఎంసీ పరిధిలో పార్టీ సత్తా ఏంటో ప్రతిపక్షాలకు తెలియజేయాలని పిలుపునిచ్చారు.గురువారం మైలార్‌దేవ్‌పల్లి లోని ఎమ్మెల్యే నివాసంలో కాటేదాన్,మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ స్థాయి నాయకులు,మహిళా నాయకురాళ్లతో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ..రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో నాయకులు,కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కష్టపడాలని సూచించారు.ప్రతి బూత్ లెవెల్ మెంబర్లను గుర్తించి,బూత్ కమిటీలను వేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని దిశానిర్దేశం చేశారు.రానున్న ఎన్నికల్లో పార్టీ నిలబెట్టే అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి ఒక్కరూ అంకితభావంతో కృషి చేయాలని కోరారు.రాబోయే రోజుల్లో పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి ఖచ్చితంగా తగిన గుర్తింపు,మంచి స్థానాలు ఉంటాయని ఆయన హామీ ఇచ్చారు.ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని,అభివృద్ధి కార్యక్రమాలు, పథకాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యకర్తలు నిత్యం ప్రజల్లో ఉండాలని సూచించారు. ఏడాది కాలంలో ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేసింది.రాబోయే రోజుల్లో మరిన్ని పథకాలు అమలు చేస్తున్నాయని చెప్పారు.జీహెచ్‌సీ ఎన్నికల్లో నాయకులు,కార్యకర్తలు సమన్వయంతో చేయాలన్నారు.పార్టీ బలోపేతానికి,రాబోయే ఎన్నికల్లో విజయానికి ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలన్నారు.శ్రమించిన ప్రతి ఒక్కరికీ భవిష్యత్తులో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని శ్రేణులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ







కార్పొరేటర్ టి.ప్రేమ్ దాస్ గౌడ్,సరికొండ వెంకటేష్,టి.ప్రేమ్ గౌడ్,సూరెడ్డి సాయిరెడ్డి,మాధవరెడ్డి,సోమ శ్రీనివాస్ గుప్తా, ధనంజయ,సానేం జీవన్ గౌడ్,సుధాకర్ గౌడ్, నారాయణ,సీనియర్ నాయకులు,పార్టీ కార్యకర్తల, ఇతర ముఖ్య నాయకులు,మహిళా నాయకురాళ్లు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన సత్తుపల్లి, ఎమ్మెల్యే మట్టా రాగమైయి




**ఖమ్మం,మే28(సూర్యరేఖ)** కల్లూరు మండల పరిధిలోని బత్తులపల్లి గ్రామంలో మెయిన్ సెంటర్ లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు103వ వర్ధంతి సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించి వారు చేసిన సేవలు వారు చేసిన సంస్కరణ గురించి కొనియాడారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జి.ఉమాదేవి నాగరాజ్,కృష్ణారెడ్డి,పిచ్చిరెడ్డి,ఏసురెడ్డి వెంకటేశ్వరరావు,మండల నాయకులు పి. చంద్రరావు,ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి,కల్లూరు మున్సిపాలిటీ చైర్మన్ ధారావత్ మోహన్ నాయక్,టిడిపి నాయకులు జాస్తి శ్రీనివాసరావు,పార్టీ అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పారా అథ్లెటిక్స్‌లో దామరగిద్ద యువకుడి ప్రతిభ



**దామరగిద్ద,మే28(సూర్యరేఖ):** బెంగళూరులో జరుగుతున్న ఇండియన్ ఓపెన్ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో దామరగిద్ద మండల కేంద్రానికి చెందిన కనకప్ప ప్రతిభ కనబరిచాడు.టీ-44 విభాగంలో జరిగిన 100 మీటర్ల పరుగు పందెంలో 12.99 సెకన్ల టైమింగ్‌తో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించాడు.ఈ సందర్భంగా దామరగిద్ద గ్రామ సర్పంచ్ అద్దన్ కనికిరెడ్డి,గ్రామ నాయకులు,గ్రామ ప్రజలు కనకప్పను అభినందించారు.క్రీడల్లో మరింత రాణిస్తూ గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని,భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

## నారం నూతన డైరెక్టర్ ను సన్మానించిన బీజేపీ నాయకులు వై.శ్రీధర్



**రాజేంద్రనగర్,మే28(సూర్యరేఖ)** నారం డైరెక్టర్ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన మీనాక్షి సుందరం మరింత చురుగ్గా పని చేస్తూ నారం బలోపేతానికి కృషి చేయాలని బీజేపీ పార్టీ గోల్కొండ-గోషామహల్ ఇంచార్జ్ వై.శ్రీధర్ అన్నారు.ఐసీఏఆర్,ఐఐఏఆర్ నుంచి మీనాక్షి సుందరం ఐసిఏఆర్ సంబంధించిన నారం డైరెక్టర్ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా వారికి కలిసి మర్యాదపూర్వకంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఐఐఆర్ సీఈవో సదన్ను,జస్వంత్, ఈ.వేణుగోపాల్ తదితర అధికారులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

## దేవుడి లాంటి మనిషిపై నిందలు వేయడం సరికాదు..



**కామారెడ్డి,మే28(సూర్యరేఖ)** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పై మాట్లాడే ముందు ఆలోచించి మాట్లాడాలని కామారెడ్డి జిల్లా జనసేన పార్టీ నాయకులు నక్క మల్లేష్ అన్నారు.జనసేన విషయంలో తాను చేసిన వాక్యాలను వెనక్కి తీసుకుంటున్నట్లు ఇకపై జనసేన అధినేత పార్టీపై ఎలాంటి వ్యాఖ్యలు చేయనని పత్రిక ముఖంగా తెలియజేసిన ప్రొఫెసర్ నాగేశ్వర్ మాటతప్పి మళ్లీ ఇతరులతో ప్రెస్ మీట్ లు పెట్టించి పవన్ కళ్యాణ్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని,దేవుడు ఇలాంటి మంచి పవన్ కళ్యాణ్ అని నక్క మల్లేష్ పేర్కొన్నారు. కొండగట్టు అంజన్న దేవాలయానికి 36 కోట్ల నిధులు తెప్పించిన ఘనత మా నాయకుడిదని మల్లేష్ తెలిపారు.హైదరాబాదులో వరదలు వస్తే కోట్ల రూపాయలు విరాళంగా ఇచ్చిన ఘనత మా అధినేత పవన్ కళ్యాణ్ అని అన్నారు.ఇకపై అధినేతపై ఎవరు అనుచిత వ్యాఖ్యలు చేసిన ఊరుకునేలేదని మల్లేష్ హెచ్చరించారు.

# రాజేంద్రనగర్ లో ఘనంగా బక్రీద్ వేడుకలు





**రాజేంద్రనగర్,మే28(సూర్యరేఖ)** రాజేంద్రనగర్ సర్కిల్లో బక్రీద్ వేడుకలను పురస్కరించుకొని ఘనంగా జరుకున్నారు.అందులో భాగంగా హసన్‌నగర్ ఈద్గా అక్బరీ ఫాతిమాలో ఈద్-ఉల్-అజ్హా నమాజ్ నిర్వహించారు.ఇమామ్-ఓ-ఖతీబ్ రషీద్-ఉల్-ఖాద్రీ నమాజ్ నిర్వహించారు.ఉదయమే నూతన వస్త్రాలు ధరించి,ఈద్గా,దర్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు జరిపారు.ఆ తర్వాత ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.ఈ సందర్భంగా ముస్లింలందరికీ ఈద్ శుభాకాంక్షలు తెలియజేశారు.భారీ సంఖ్యలో ముస్లీంలు పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు.పలువురు ముస్లిం సోదరులు మాట్లాడుతూ...త్యాగ నిరతికి బక్రీద్ పండుగ నిదర్శనమని అన్నారు. ధనిక, పేద అన్న తారతమ్యం లేకుండా స్వార్థం, ద్వేషాలకు అతీతంగా ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ఈ పండుగను జరుపుకుంటున్నట్లు తెలిపారు.ప్రతి ఒక్కరూ దాన గుణం,సేవాగుణం అలవర్చుకోవాలని చెప్పారు. పండుగ సందర్భంగా ముస్లిం సోదరులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ, బంధుమిత్రులతో సంతోషంగా గడిపారు.బక్రీద్ విశిష్టతలో భాగమైన ఖుర్బానీని చుట్టుపక్కల వారికి దానంగా అందజేశారు.ఈ కార్యక్రమంలో హసన్‌నగర్ ఇంతేజామియా కమిటీ మస్జిద్-ఏ-అక్బరీ ఈద్గా,మదరసా, బాధ్యులు పాల్గొన్నారు.సదర్ మొహమ్మద్ నజీర్ ఖాన్ ఖాద్రీ,నాయబ్ సదర్ మొహమ్మద్ బాబా రజా,మొహమ్మద్ సమద్,మొహమ్మద్ ఖాన్,మొహమ్మద్ నజీర్ పాల్గొన్నారు.అంతేకాకుండా మొహమ్మద్ జహీరుద్దీన్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైఫల్యాలను మరిచించేందుకే బాల్క సుమన్‌పై కేసులు

మిర్యాల రాజిరెడ్డి



**మందమర్రి,మే28(సూర్యరేఖ)** రాష్ట్ర ప్రభుత్వం తన వైఫల్యాలను ప్రజల దృష్టికి రానీయకుండా మాజీ ఎంపీ,మాజీ ప్రభుత్వ విప్ బాల్క సుమన్‌పై తప్పుడు ప్రచారాలు నిర్వహిస్తూ అక్రమ కేసులు నమోదు చేస్తోందని బీఆర్ఎస్ అనుబంధ టీబీజీకేఎస్ యూనియన్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి ఆరోపించారు.గురువారం మందమర్రిలోని యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...సింగరేణి పరిరక్షణ కోసం హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో ఇటీవల నిర్వహించిన సమావేశంలో బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ,దాని అనుబంధ కార్మిక సంఘాలు వక్రీకరిస్తున్నాయని విమర్శించారు. కార్మికులను ఉద్యమాల దిశగా ఉత్తేజపరిచేందుకు చేసిన వ్యాఖ్యలను కావాలనే తప్పుగా ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.సింగరేణి సంస్థ పరిరక్షణ, కార్మికుల హక్కుల సాధన కోసం తెలంగాణ ఉద్యమ తరహాలో మిలిటెంట్ పోరాటాలు అవసరమని బాల్క సుమన్ సూచించారని,అయితే దానిని రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరించి కేసులు నమోదు చేయడం తగదన్నారు.ప్రస్తుతం గుర్తింపు సంఘాలైన ఐఎన్టీయూసీ,ఏఐటీయూసీలపై కార్మికులు విశ్వాసం కోల్పోయారని,సింగరేణి భవిష్యత్తు టీఆర్ఎస్--టీబీజీకేఎస్ చేతుల్లోనే సురక్షితంగా ఉంటుందని పేర్కొన్నారు.సింగరేణిలో కార్మిక వ్యతిరేక విధానాలు అమలవుతున్నాయని, గోల్డెన్ షేక్ హ్యాండ్,డిస్మిస్ వంటి పద్ధతులను మళ్లీ తీసుకురావడానికి యాజమాన్యం ప్రయత్నిస్తోందని ఆరోపించారు.తెలంగాణ ఏర్పాటుకు తర్వాత గత ప్రభుత్వం వేలాది మంది కార్మిక వారసులకు ఉద్యోగాలు కల్పించిందని,కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 30 నెలలు గడిచినా కొత్త గనులు ప్రారంభించలేదని విమర్శించారు.గత ఎనిమిది నెలలుగా మెడికల్ బోర్డులు నిర్వహించకపోవడంతో కార్మిక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. సింగరేణికి ట్రాన్స్‌కో,జెన్‌కో సంస్థల నుంచి రావాల్సిన రూ.54 వేల కోట్ల బకాయిలు చెల్లించడంలో ప్రభుత్వం విఫలమైందని,దీనివల్ల సంస్థ ఆర్థిక సంక్షోభంలోకి వెళ్లిందన్నారు.కార్మిక సంక్షేమం,సంస్థ పరిరక్షణ కోసం కార్మికులు ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.బాల్క సుమన్‌పై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్, కేంద్ర కమిటీ నాయకుడు ఓ.రాజశేఖర్,బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి బండారి సూరిబాబు,నాయకులు కొంగల తిరుపతిరెడ్డి,ఈశ్వర్,భూపెల్లి కనకయ్య, సీపెల్లి సాగర్,బెల్లం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ఝూన్సీలింగాపూర్‌లో భక్తి జ్వాలలు..

# పోలేరమ్మ జాతరతో మార్మోగిన లింగాపూర్.!





బోనమెత్తిన తిరుపతిరెడ్డి

రామాయంపేట,మే28(సూర్యరేఖ)

రామాయంపేట మండలం,ఝూన్సీలింగాపూర్ గ్రామంలో శ్రీపోలేరమ్మ అమ్మవారి 29వ వార్షికోత్సవ వేడుకలు గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు.గ్రామమంతా భక్తి పారవశ్యంలో మునిగిపోయింది.బోనాల ఊరేగింపుతో ఊరు ఉత్సవ శోభ సంతరించుకోగా,వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కంటారెడ్డి తిరుపతిరెడ్డి,షేర్ సుభాష్ రెడ్డి హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.గ్రామ వీధులన్నీ డప్పుల మోతలు,భక్తి గీతాలతో మార్మోగగా,మహిళలు సంప్రదాయ బోనాలతో నిర్వహించిన ఊరేగింపు కన్నులపండువగా సాగింది.అమ్మవారికి సమర్పించే బోనం స్వయంగా ఎత్తిన కంటారెడ్డి తిరుపతిరెడ్డి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ ప్రజల సంక్షేమం,పంటల సస్యశ్యామలత్వం కోసం అమ్మవారిని ప్రార్థించారు. షేర్ సుభాష్ రెడ్డి కూడా ఉత్సవాల్లో పాల్గొని భక్తులతో కలిసి ఊరేగింపులో నడిచారు.దవేడుకల సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ముఖ్యఅతిథులను శాలువాలతో



ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో రామాయంపేట బీఆర్ఎస్ నాయకులు మద్దెల రమేష్,బాసం శీను, మద్దూరి భానుచందర్,పోచమ్మల అశోక్.నరేష్, మహేష్ తదితరులు పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు.గ్రామంలో తెల్లవారుజాము నుంచే భక్తుల రద్దీ నెలకొనగా,పోలేరమ్మ జాతరతో ఝూన్సీలింగాపూర్ ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది.స్థానికులు ఈ ఉత్సవాన్ని గ్రామ ఐక్యతకు ప్రతీకగా అభివర్ణించారు.

## రైతులకు అండగా నిలిచిన శివంపేట్ మండల పిఎసిఎస్ చైర్మన్..



**శివంపేట,మే28(సూర్యరేఖ)** శివంపేట్ మండలంలోని కల్లాలలో ఉన్న వరి ధాన్యాన్ని తూప్రాన్ పట్టణంలోని గోదాములకు తరలింపు సందర్భంగా రైతులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు.శివంపేట్ మండల పిఎసిఎస్ చైర్మన్ చింతల వెంకట్రాంరెడ్డి ఈ సందర్భంగా తూప్రాన్ సీఐ వెంకట్ రాజుగౌడ్,తూప్రాన్ ఎస్ఐ గంగరాజు, తూప్రాన్ తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి,రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యాన్ని గోదాముల్లో నిల్వ చేసే విధంగా అన్ని చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.అలాగే శివంపేట్ మండలానికి చెందిన వరి ధాన్యం ట్రాక్టర్ల అన్‌లోడింగ్ ప్రక్రియను స్వయంగా పర్యవేక్షిస్తూ రైతులకు సహకారం అందించారు.పిఎసిఎస్ చైర్మన్ చింతల వెంకట్రాంరెడ్డి,శివంపేట్ పిఎసిఎస్ సీఈవో గొల్ల మధు యాదవ్,లు మాట్లాడుతూ...వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.రైతులకు న్యాయం జరిగేలా అన్ని విధాలుగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## ప్రశాంతంగా బక్రీద్ పండగ..

ర్థనలకు తరలివచ్చిన వారితో కిక్కిరిసిపోయిన ఈద్గాలు,మసీదులు..

పోలీసుల భద్రత చర్యలు..



**జల్ పల్లి,మే28(సూర్యరేఖ)** త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పండగను గురువారం ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.బక్రీద్ పండుగను పురస్కరించుకొని శివారు ప్రాంతమైన జిహెచ్ఎంసి జల్ పల్లి సర్కిల్ పరిధిలోని ఈద్గాలు,మసీదుల వద్ద ముస్లిం సహోదరులు ఉదయం 7గంటలకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ప్రార్థనలకు తరలివచ్చిన వారితో ఈద్గాలు,మసీదులు కిక్కిరిసిపోయాయి.ప్రార్థనల అనంతరం ముస్లిం సోదరులు పరస్పరం ఆత్మీయ అలింగనాలతో బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.బక్రీద్ సందర్భంగా శంషాబాద్ డిసిపి రాజేష్,ఏసిపి శ్రీకాంత్ గౌడ్,పహాడీ షరీఫ్ ఇన్స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి, ఇతర సబ్ ఇన్స్పెక్టర్లతో కలిసి జల్ పల్లి,షాహినగర్,పహాడీ షరీఫ్ పరిధిలోగల మసీదులు,ఈద్గాల వద్ద పోలీసుల ప్రత్యేక భద్రత చర్యలు ఏర్పాటు చేశారు.బక్రీద్ పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పండుగ సంతోషంగా జరుపుకునే విధంగా చర్యలు తీసుకున్నారు. శంషాబాద్ డిసిపి రాజేష్ నేతృత్వంలో పలు మసీదులు,ఈద్గాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.అనంతరం ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు

## ఇండ్లకు నీరు వదలం...ఇలా రోడ్డుపాలు చేస్తాం.!



**జల్ పల్లి,మే28(సూర్యరేఖ)** వేసవి కాలంలో ప్రజలు నీటి కోసం అల్లాడుతుంటే, అధికారుల నిర్లక్ష్యం కారణంగా నీరు రోడ్డుపై వృధాగా పోతుంది.జిహెచ్ఎంసి శంషాబాద్ జోన్, జల్ పల్లి సర్కిల్ పరిధిలో నీరు రాక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతుంటే,కొంతమంది వాటర్ వర్క్స్ అధికారుల నిర్లక్ష్యంతో శ్రీరామకాలనీ వినాయక సంఘం వీధిలో మంచినీటి పైప్ లైన్ కోసం గుంతలు తవ్వి వదిలేశారు.దీంతో అక్కడ నీరు వృధాగా పోతు,రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి.ఇది చూసిన స్థానిక ప్రజలు మంచినీరు వదలండి మహాప్రభో అని వేడుకుంటే,వారానికి ఒక్కసారి నీటిని వదలని అధికారులు,మేం ఇండ్లకు మంచినీటిని వదలం... ఇలా రోడ్డుపాలు చేస్తాం.! అన్నట్టుగా అధికారుల పనితీరు ఉందని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. మంచినీటి పైప్ లైన్ మరమ్మత్తుల కోసం తవ్వి, కనీసం తాత్కాలిక మరమ్మత్తులు కూడా చేయకుండా,ఇలా నీటిని వృధా చేయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు.శ్రీరామకాలనీ ప్రజలు మంచినీటి కోసం అల్లాడుతుంటే, అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.అధికారులు వెంటనే స్పందించి మంచినీటి పైప్ లైన్ కు మరమ్మత్తులు చేసి,నీరు వృధా కాకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు

# ఉమ్మడి రాష్ట్రాల తెలుగుజాతి ఆత్మగౌరవ ప్రతీక అన్న "నందమూరి తారక రామారావు" జయంతి వేడుకలు

**రాజన్న సిరిసిల్ల :** గురువారం రోజు మహానాడు రెండవ రోజు విశ్వవిఖ్యాత నట సార్వభౌముడు తెలుగువారి ఆత్మగౌరవ ప్రతీక అన్న నందమూరి తారక రామారావు జయంతి వేడుకల ఉత్సవాలను ఇల్లంతకుంట మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి దామెర సత్యం , పార్లమెంటు మాజీ ఉపాధ్యక్షుడు అన్నాడి నరేందర్ రెడ్డి ల ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ ఆవరణలో ఘనంగా నిర్వహించడం జరిగింది ముందుగా అన్నగారి చిత్రపటానికి పూలమాలలు వేసి,కేక్ కట్ చేసి స్వీట్లు మరియు పండ్లు పంపిణీ చేశారు.అనంతరం దామెర సత్యం మాట్లాడుతూ...తెలుగువారి ఆత్మగౌరవాన్ని కాపాడేందుకే ఎన్ టి ఆర్ , స్థాపించిన తెలుగుదేశం పార్టీ నేడు దేశంలోనే బలమైన సంస్థాగత నిర్మాణం కలిగిన పార్టీ గా నిలిచింది అన్నారు. పార్టీ కేవలం భావోద్వేగానికే పరిమితం కాకుండా పేద ప్రజలకు 2 రూ పాయలకు కిలో బియ్యం,పేదలకు ఇళ్లు, సగం ధరకే జనతా వస్త్రాలు, మహిళలకు ఆస్తిలో సగం వాటా, పటేల్ పట్వారీ వ్యవస్థ రద్దు, మాండలిక వ్యవస్థ ఏర్పాటు తో పాటు అనేకమైన సంక్షేమ , అభివృద్ధి పథకాలను రూపొందించి అమలు పరిచిన ఘనత అన్న నందమూరి తారక రామారావు గారికే దక్కింది అన్నారు. "సమాజమే దేవాలయం ప్రజలే దేవుల్లు" అనే నినాదంతో సామాన్యుల గుండెల్లో నిలిచారు అన్న ఎన్ టి ఆర్ . తెలుగు ప్రజల ఆస్తిగా, తెలుగు ప్రజల గౌరవ ప్రతీక గా ఆయన మన తెలుగు ప్రజలకు స్ఫూర్తి దాయకం అన్నారు.నేడు రాష్ట్రంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో సంక్షేమ హాస్టల్ లను పరిచయం చేసి మండలానికి జూనియర్ కళాశాల,డిగ్రీ కళాశాల,రోడ్లు, వాటర్ ట్యాంక్ లు, అంగన్వాడీ భవనాలు లాంటి అనేకమైన అభివృద్ధి కార్యక్రమాలు చేయడం జరిగింది.అలాగే అనంతరం విజనరీ లీడర్, ప్రియతమ నాయకుడు "నారా చంద్రబాబు నాయుడు" రాష్ట్రాన్ని అభివృద్ధి పదం లో నడిపిస్తూ, నారా లోకేష్ టెక్నాలజీ రంగాన్ని పటిష్ట పరచడం,తెలుగు జాతి



గుండెల్లో ఎప్పటికీ చెరిగిపోనీ ముద్ర వేశారని అన్నారు తెలంగాణ లో తెలుగుదేశం పార్టీ పూర్వ వైభవం కోసం ప్రతి నాయకుడు , కార్యకర్త పని చేయాలని పిలుపునిచ్చారు గతంలో తెలుగుదేశం పార్టీ చేసిన సేవలను , సంక్షేమ పథకాలను, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి రాబోయే రోజుల్లో తెలుగుదేశం పార్టీ బలోపేతం పైన అందరూ కూడా బలంగా కృషి చేయాలని అన్నారు. చంద్రబాబు నాయకత్వంలో మన లోకేష్ బాబు గారి వినూత్న ఆలోచనలతో పార్టీ మరింత ముందుకు తీసుక వెళ్లాలని , సూర్య చంద్రులు ఉన్నంతకాలం తెలుగుదేశం పార్టీ ఉంటుందని ఆయన అన్నారుఈ కార్యక్రమం లో దామెర సత్యం తో పాటు పార్లమెంటు ఉపాధ్యక్షుడు అన్నాడి నరేందర్ రెడ్డి,సీనియర్ నాయకులు ఎర్రోజు కిషన్ , మండల పార్టీ కన్వీనర్ గజభీమ్కర్ ఎల్లోజి , సీనియర్ నాయకులు కేతిరెడ్డి మల్లారెడ్డి, దొమ్మాటి లక్ష్మణ్ గౌడ్ , ఏమ్.డి.ఇస్మైల్, జి.వెంకటయ్య , మిద్దె మైసయ్య, దుర్శెట్టి బాలయ్య తదితర నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసారు

# కొనుగోళ్ల ప్రక్రియ ముగిసే వరకూ ఇదే చొరవతో పని చేయాలి

**రాజన్న సిరిసిల్ల :** ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ తుది దశకు చేరుకుందని ఈ ప్రక్రియ పూర్తి స్థాయిలో ముగిసే వరకూ అధికారులు ఇదే చొరవతో పని చేస్తూ రైతులకు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ధాన్యం సేకరణ,తడిసిన ధాన్యం విషయంలో రైతులు ఆందోళన చెందకుండా క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించడం, అన్ లోడింగ్ వేగవంతం చేయడం కోసం కొనుగోలు కేంద్రాల వద్ద నుండి అపరల్ పార్క్ కు హమాలీలను తరలించడం, ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియ,తదితర అంశాలపై అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, పౌర సరఫరాలు, సహకార శాఖ, గ్రామీణా భివృద్ధి శాఖ, మెప్మా, రవాణా, తదితర శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ గురువారం ఉదయం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో నిన్నటివరకు 2 లక్షల 23 వేల 709 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని కలెక్టర్ వెల్లడించారు. కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు అప్రమత్తంగా ఉండేలా చూడాలని, వర్షం కారణంగా ధాన్యం తడిస్తే రైతులు ఆందోళన చెందకుండా అధికారులు అవగాహన కల్పించి, ధాన్యం కొనుగోలు చేస్తామనే భరోసా క్షేత్ర స్థాయిలో కల్పించాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలు, మిల్లుల వారీగా ధాన్యం సేకరణ, అన్ లోడింగ్ పై ఆరా తీసి, ప్రక్రియ వేగవంతంగా సజావుగా పూర్తయ్యేవరకు అధికారులు ఇదే చొరవతో పని చేయాలని, రాబోయే వారం రోజుల్లోగా



కొనుగోళ్ల ప్రక్రియ పూర్తి చేసేలా చూడాలని అన్నారు. కొనుగోలు కేంద్రాలలో ఉన్న హమాలీలను ధాన్యం అన్ లోడింగ్ వేగవంతం చేయడం కోసం అపరల్ పార్క్ కు తరలించాలని, తద్వారా వాహనాలు తొందరగా అన్ లోడింగ్ జరిగి అవసరమైన కేంద్రాలకు వాహనాలను పంపడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి ఎప్పటికప్పుడు ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియ పూర్తి చేసేలా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేయాలని అధికారులకు సూచించారు. వాహనాల కొరత లేకుండా సరైన పర్యవేక్షణ చేయాలని, సంబంధిత ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు సరిపడా వాహనాలు సమకూర్చేలా చూడాలని ఆదేశించారు. మిల్లర్లు వారికి కేటాయించిన లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం అన్ లోడింగ్ వేగవంతం చేసేలా పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.

# ఈటెల, డీకేలలో ఎవరికి పదవి

**హైదరాబాద్ :** కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం త్వరలోనే భారీ మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో, తెలంగాణ బీజేపీ రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. రాష్ట్రం నుంచి ఎవరికి కేంద్ర కేబినెట్‌లో చోటు దక్కబోతోంది? ఎవరి పదవి ఊడనుంది? ఎవరికి కొత్త బాధ్యతలు రానున్నాయి? అనే అంశాలపై సర్వత్రా ఆసక్తికర చర్చ సాగుతోంది.ప్రస్తుత సమీ కరణాల ప్రకారం.. తెలంగాణ నుంచి కేంద్ర మంత్రివర్గంలో ఉన్న కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్ల పదవులకు ప్రస్తుతానికైతే ఎలాంటి ఢోకా లేదని ఢిల్లీ వర్గాల సమాచారం. అయితే, వారి శాఖల్లో మార్పులు చేర్పులు ఉండే అవకాశం ఉంది. కేంద్రంలో కిషన్ రెడ్డి పరపతి రోజురోజుకూ పెరుగుతోంది. అధిష్టానం వద్ద ఆయన మాటకే కీలక ప్రాధాన్యత లభిస్తోంది. రాష్ట్ర అధ్యక్షుడి ఎంపిక నుంచి మంత్రుల కోటా వరకు ఆయన అభిప్రాయం కీలకంగా మారింది. అయితే, మరోవైపు కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ పదవిపై వస్తున్న ఊహాగానాలకు అధిష్టానం చెక్ పెట్టినట్లు తెలుస్తోంది. కొడుకు వివాదం నేపథ్యంలో మంత్రి పదవి నుంచి తొలగిస్తారనే ప్రచారం సాగినప్పటికీ, అధిష్టానం బండి జోలికి వెళ్లేందుకు ఇష్టపడటం లేదు.గతంలో ఆయనను రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తొలగించడం వల్ల పార్టీ నష్టపోయిందని భావిస్తున్న హైకమాండ్, ఇప్పుడు మంత్రి పదవి నుంచి తప్పిస్తే మరింత ప్రతికూల ప్రభావం పడుతుందని అంచనా వేస్తోంది. రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు సైతం బండి సంజయ్ కుటుంబ వ్యవహారంపై డిఫెన్స్ చేస్తూ, అది చట్టపరిధిలోని అంశమని క్లీన్ చీట్ ఇచ్చే ప్రయత్నం చేశారు. కిషన్ రెడ్డి కూడా ఈ విషయంలో జోక్యం చేసుకోకుండా మిన్నకుండిపోయారు. మంత్రివర్గంలో కొత్తగా స్థానం సంపాదించుకునేందుకు రాష్ట్రం నుంచి గట్టి పోటీ నెలకొంది. కేంద్ర మంత్రి పదవి ఆశించిన వారిలో ధర్మపురి అర్వింద్‌తో పాటు ఈటల రాజేందర్, రఘునందన్ రావు, డీకే అరుణ ప్రధానంగా ఉన్నారు. బండి సంజయ్‌ను బర్తరఫ్ చేస్తే ఆ పదవి తనకే దక్కుతుందని అర్వింద్ ఆశలు పెట్టుకున్నప్పటికీ, బండి కంటిన్యూ అవుతుండటంతో ఆయన ఆశలు అడియాశలయ్యేలా



కనిపిస్తున్నాయి. మరోవైపు రఘునందన్ రావు పేరును అధిష్టానం సీరియస్‌గా పరిగణించడం లేదని తెలుస్తోంది.ప్రస్తుతం రేసులో అందరికంటే ముందు వరుసలో నిలిచింది ఇద్దరే. ఒకరు ఈటల రాజేందర్ కాగా, మరొకరు డీకే అరుణ. రాష్ట్రం నుంచి ఇప్పటికే ఇద్దరు మంత్రులు ఉన్నందున, వీరిద్దరికీ కలిపి పదవులు ఇవ్వడం కష్టమే. దీంతో ఈ ఇద్దరిలో ఆ ఛాన్స్ ఎవరికి దక్కుతుందనేది ఉత్కంఠ రేపుతోంది.ఈటల రాజేందర్ మంత్రి పదవి కోసం గట్టిగానే ప్రయత్నాలు సాగిస్తున్నారు. గతంలో పార్టీలో చేరిన సమయంలో ఆయనకు అధిష్టానం ఇచ్చిన హామీలు కూడా ఉన్నాయి. పైగా ఈటల బీసీ సామాజిక వర్గానికి చెందిన నాయకుడు కావడం, ఆయన సతీమణి రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో, ఆయనకు పదవి ఇస్తే రెండు వర్గాల నుంచి పార్టీకి మైలేజ్ వస్తుందని బీజేపీ భావించింది. ఇందులో కిషన్ రెడ్డి అభిప్రాయం అత్యంత కీలకంగా మారనుంది. కిషన్ రెడ్డి గనుక తన వీటో పవర్ ఉపయోగిస్తే, ఈటల కంటే డీకే అరుణ వైపే ఆయన మొగ్గు చూపే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. మరి కిషన్ రెడ్డి మాటను పరిగణనలోకి తీసుకుని డీకే అరుణకు ఛాన్స్ ఇస్తారా? లేక ముందే ఇచ్చిన మాట ప్రకారం బీసీ సమీకరణాలను పరిగణనలోకి తీసుకుని ఈటల రాజేందర్‌ను కేబినెట్‌లోకి తీసుకుంటారా? అనేది మోదీ తుది నిర్ణయంపైనే ఆధారపడి ఉంది.

## పవన్‌పై కామెంట్స్.. బీజేపీ ఫైర్

**హైదరాబాద్ :** ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు, ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై ఆంధ్రప్రదేశ్‌లో నమోదైన కేసుల విషయంలోలో హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సంఘీభావ సమావేశం ఇప్పుడు రెండు రాష్ట్రాల రాజకీయాల్లో తీవ్ర దుమారానికి దారితీసింది. నాగేశ్వర్‌కు మద్దతు తెలపాల్సిన వేదికపై, కొందరు వక్తలు ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ లక్ష్యంగా వ్యక్తిగత దూషణలకు దిగడం రాజకీయ రంగు పులుముకుంది. అభిప్రాయ ప్రకటనా స్వేచ్ఛను అణచివేస్తున్నారంటూ మొదలైన ఈ చర్చ, కొద్దిసేపటికే దారి తప్పింది. వేదికపై ఉన్న కొందరు వక్తలు ఏపీ రాజకీయాల గురించి మాట్లాడుతూ, పవన్ కల్యాణ్ వ్యక్తిగత జీవితం , ఆయన తీరుపై అత్యంత అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం వివాదాస్పదమయింది. సంఘీభావ సభ కాస్తా పవన్ కల్యాణ్ టార్గెట్ సభగా మారిపోయిందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిణామాలపై బీజేపీ సీనియర్ నేత విష్ణువర్ధన్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. పవన్ కల్యాణ్‌పై కొంతమంది చేసిన అనుచిత వ్యాఖ్యలు, తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల మధ్య ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నాలను ఏపీ బీజేపీ నుండి తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. 12 సంవత్సరాల తర్వాత కూడా ప్రాంతీయ భేదాలు, ప్రజల సెంటిమెంట్ రెచ్చగొట్టడం దేనికి సంకేతం? ప్రజాస్వామ్యంలో విమర్శలు సహజమే కానీ వ్యక్తిగత దూషణలు, ప్రాంతీయ భావోద్వేగాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలకు ఎలాంటి స్థానం లేదన్నారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ తన తప్పును తానే ఒప్పుకోవడం జరిగిందని గుర్తు చేశారు. ప్రజా వేదికలపై మాట్లాడే ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ప్రెస్ క్లబ్ సమావేశంలో చేసిన వ్యాఖ్యల వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో జనసేన శ్రేణులు భగ్గుమన్నాయి. పవన్ కల్యాణ్‌ను వ్యక్తిగతంగా దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. పవన్ గౌరవానికి భంగం కలిగించేలా మాట్లాడిన మేధావులను బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ వివాదంపై మేధావి వర్గంలో కూడా చీలిక కనిపిస్తోంది. నాగేశ్వర్‌పై కేసులను ఖండించడంలో తప్పు లేదని, కానీ అదే సమయంలో బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వ్యక్తులను వ్యక్తిగతంగా దూషించడం వల్ల అసలు సమస్య పక్కదారి పడుతుందని కొందరు సీనియర్ జర్నలిస్టులు అభిప్రాయపడుతున్నారు. రాజకీయ విమర్శలకు, వ్యక్తిగత దూషణలకు మధ్య ఉన్న గీతను మేధావులు గుర్తించకపోతే వారి విశ్వసనీయత దెబ్బతింటుందని హెచ్చరిస్తున్నారు.

## పార్క్ చేసిన వాహనాల నుంచి వస్తువుల మాయం

**అదిలాబాద్ :** హైవేలపై ప్రయాణించే లారీ డ్రైవర్లు, క్లీనర్లకు కునుకులేకుండా చేస్తున్న ఒక భారీ అంతర్రాష్ట్ర ముఠా ఆగడాలను ఆదిలాబాద్ జిల్లా పోలీసులు అడ్డుకున్నారు. పక్కా ప్లానింగ్‌తో అత్యంత సాంకేతిక పరిజ్ఞానంతో భారీ వాణిజ్య వాహనాలను మాయం చేస్తున్న ఈ ముఠా నెట్‌వర్క్ హర్యానా నుంచి మహారాష్ట్ర వరకు విస్తరించి ఉంది. ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ నేతృత్వంలో పోలీసులు చేపట్టిన ఆపరేషన్‌లో ముగ్గురు కీలక నిందితులు చిక్కారు. మావల బైపాస్ రోడ్డు వద్ద పోలీసులు సాధారణంగా వాహన తనిఖీలు చేస్తున్నారు. ఆ సమయంలో తెల్లటి టయోటా ఎటియోస్ కారు అనుమానాస్పదంగా కనిపించింది. పోలీసులను చూడగానే ఆ కారులో ఉన్న వారు పరారయ్యేందుకు ప్రయత్నించారు. అయితే అప్రమత్తమైన పోలీస్ బృందం వారిని వెంబడించి ముగ్గురును అదుపులోకితీసుకున్నారు. వారిని విచారిస్తే దేశవ్యాప్తంగా సాగుతున్న భారీ వాహనాల చోరీల వెనుక ఉన్న అసలు రహస్యాలు వెలుగులోకి వచ్చాయి. అరెస్టు అయిన నిందితులు అంతరాష్ట్ర నేరాల్లో ఆరితేరిన వారు. హర్యానాకు చెందిన సలీం వృత్తిరీత్యా ట్రక్ డ్రైవర్. హైవేలపై వాహనాల కదలికలపై ఇతనికి పూర్తి అవగాహన ఉంది. రెండో వ్యక్తి నఫీస్ ఖాన్. హర్యానాలోని మేవాత్ జిల్లాకు చెందిన ఇతను కూడా ట్రక్ డ్రైవరే. భారీ వాహనాలను సులువుగా నడపడంలో దిట్ట. ఇంతియాజ్ మూడోవాడు. రాజస్థాన్‌లోని భరత్‌పూర్ జిల్లాకు చెందిన మెకానికక్. వాహనాల లాక్ సిస్టమ్‌ను వైరింగ్‌ను నిమి?ల్లో ఛేదించడం ఇతని స్పెషాలిటీ. వీరితోపాటు మరో ఏడుగురు ఉన్నట్టు గుర్తించిన పోలీసులు వారిపై కేసులు పెట్టారు. తమ వద్ద ఉన్న టయోటా కారులో వివిధ రాష్ట్రాల హైవేలపై తిరుగుతూ పెట్రోల్ బంకులు, లేదా నిర్మానుష్య ప్రాంతాల్లో పార్క్ చేసిన ఐషర్, టిప్పర్ వంటి భారీ వాహనాలను లక్ష్యంగా చేసుకుంటారు. మెకానిక్ సహాయంతో వాహనం తలుపు గ్లాస్ పగులగొట్టి స్టీరింగ్ లాంగ్ విరగ్గొడతారు. ఇగ్నిషన్ వైరింగ్‌ను కట్ చేసి డైరెక్ట్ కనెక్షన్ ద్వారా వాహనాన్ని స్టార్ట్ చేస్తారు. దొంగలించిన వాహనాన్ని వెంటనే మహారాష్ట్ర లేదా గుజరాత్ రాష్ట్రాలకు తరలిస్తారు. దొంగలించిన వాహనాన్ని కేవలం గంటల వ్యవధిలోనే విడిభాగాలుగా విడగొట్టేస్తారు. ఆ భాగాలను విడివిడిగా అమ్మేస్తారు. ఆనవాళ్లు దొరక్కుండా చేస్తారు. నిందితుల నుంచి ప్రస్తుతం టయోటా కారుతోపాటు మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. వారిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

## శంషాబాద్ పేరు మార్చాలి

**హైదరాబాద్ :** దివంగత ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావు 103వ జయంతి వేడుకలు రెండు తెలుగు రాష్ట్రాల్లో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే అటు ఆంధ్రప్రదేశ్, ఇటు తెలంగాణ రాష్ట్రాల్లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చేసిన కృషిని.. ఆయన తీసుకువచ్చిన పథకాలను.. ప్రజలు, నాయకులు గుర్తు చేసుకుంటున్నారు. తెలంగాణలో పార్టీలకు అతీతంగా ఎన్టీఆర్‌కు నివాళులు అర్పిస్తున్నారు. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ సీనియర్ నేత, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు .. కీలక డిమాండ్ చేశారు.హైదరాబాద్ శంషాబాద్‌లో ఉన్న రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు నందమూరి తారకరామారావు పేరును పెట్టాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు పరిధిలోని వసంత్ నగర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించిన కూకట్‌పల్లి ఎమ్మెల్యే.. కీలక వ్యాఖ్యలు చేశారు. తాను రాజకీయాల్లోకి వచ్చిందే ఎన్టీఆర్ స్ఫూర్తితో అని వెల్లడించారు. తనకు ఓటు హక్కు వచ్చిన తర్వాత తొలి ఓటును టీడీపీకే వేశానని.. అందుకు కారణం ఎన్టీఆరేనని గుర్తు చేసుకున్నారు.గతంలో కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న సమయంలో చేసిన అరాచకాలను తట్టుకోలేక ఎన్టీఆర్.. టీడీపీని ఏర్పాటు చేసి.. కేవలం 9 నెలల్లోనే అధికారంలోకి వచ్చారని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత పటేల్, పట్వారీ వ్యవస్థను ఎన్టీఆర్ రద్దు చేశారని.. రెండు రూపాయలకే కిలో బియ్యం పథకాన్ని తీసుకువచ్చి.. పేదల ఆకలి తీర్చారని వెల్లడించారు. ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు.. ఇప్పుడు ఎన్నో పార్టీలకు ఆదర్శమని గుర్తు చేశారు.ఇక శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు ఎన్టీఆర్ పేరు పెట్టాలని డిమాండ్ చేసిన ఎమ్మెల్యే కృష్ణారావు.. కేపీహెచ్‌బీలోని 3 ఎకరాల్లో బీఆర్ఎస్ పార్టీ హయాంలో ఎన్టీఆర్ పేరు మీద ఒక పాఠశాల భవనాన్ని ప్రారంభించామని.. అయితే దాన్ని పూర్తి చేసే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని మాధవరం కృష్ణారావు తేల్చి చెప్పారు.

## తడిసిన ధాన్యం విషయంలో రైతులు ఆందోళన చెందవద్దు

**వర్షానికి తడిసిన 10 మెట్రిక్ టన్నుల ధాన్యం రైస్ మిల్లుకు తరలింపు**

**అధికార యంత్రాంగం ముమ్మర చర్యలు**

**రాజన్న సిరిసిల్ల :** తడిసిన ధాన్యం విషయంలో రైతులు ఆందోళన చెందవద్దని అధికార యంత్రాంగం భరోసా ఇస్తుంది. అకాల వర్షాలకు తడిసిన వెంటనే ధాన్యం రైస్ మిల్లుకు తరలించి రైతాంగానికి భరోసా ఇచ్చింది. జిల్లాలో అకాల వర్షం కురిసి ముస్తాబాద్ మండలం పోతుగల్ లోని ఐకేపీ కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడిసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా అధికార యంత్రాంగం వెంటనే స్పందించింది. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచనతో ఐకేపీ, పౌర సరఫరాల శాఖ అధికారులు కొనుగోలు కేంద్రానికి చేరుకొని దాదాపు 10 మెట్రిక్ టన్నుల తడిసిన ధాన్యాన్ని వెంటనే నామాపూర్ గ్రామంలోని బాలాజీ రైస్ ఇండస్ట్రీస్ కు తరలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనుగోలు చేసి భరోసా కల్పించారు. జిల్లాలో నిన్నటివరకు 2 లక్షల 23 వేల 709 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని వెల్లడించారు. కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు అప్రమత్తంగా ఉండేలా సూచనలు చేస్తున్నామని, వర్షం కారణంగా ధాన్యం తడిస్తే రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు. ధాన్యం కొనుగోలు చేస్తామని అధికారులు స్పష్టం చేశారు.

# జూన్‌లో టాలీవుడ్ జాతర..

## ‘పెద్ది’ నుంచి ‘స్వయంభూ’ వరకు భారీ రిలీజ్‌లు రెడీ!

2026 జూన్ నెల టాలీవుడ్ బాక్సాఫీస్‌కు భారీ వినోదాన్ని అందించేందుకు సిద్ధమవుతోంది. విభిన్న జోనర్లలో తెరకెక్కిన సినిమాలు వరుసగా థియేటర్లలోకి రానుండటంతో సినీ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా స్టార్ హీరోల చిత్రాలు, హారర్ కామెడీలు, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్లు, స్పోర్ట్స్ డ్రామాలు ఇలా అన్ని రకాల సినిమాలు ఈ నెలలో ప్రేక్షకులను అలరించబోతున్నాయి. జూన్ మొదటి వారంలోనే టాలీవుడ్ బాక్సాఫీస్‌కు భారీ ఊపు రానుంది. జూన్ 3న ‘అసురాసుర’ సినిమా విడుదల కానుంది. యాక్షన్, థ్రిల్లర్ ఎలిమెంట్స్‌తో తెరకెక్కిన ఈ మూవీపై ప్రేక్షకుల్లో ఆసక్తి కనిపిస్తోంది. ఇక జూన్ 4న మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటించిన భారీ పాన్ ఇండియా చిత్రం ‘పెద్ది’ థియేటర్లలోకి రానుంది. ఇప్పటికే ఈ సినిమాపై అంచనాలు తారాస్థాయికి చేరుకున్నాయి. ట్రైలర్, టీజర్లు సోషల్ మీడియాలో భారీ హైప్ క్రియేట్ చేశాయి. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో యాక్షన్, ఎమోషన్, స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్ ప్రధాన ఆకర్షణలుగా ఉండనున్నాయి. అదే వారంలో జూన్ 5న ‘రావ్ బహదూర్’ విడుదల కానుంది. అలాగే హాలీవుడ్ ఫాంటసీ యాక్షన్ చిత్రం ‘మాస్టర్స్ ఆఫ్ ది యూనివర్స్’ కూడా అదే రోజున ప్రేక్షకుల ముందుకు రానుంది. దీంతో మొదటి వారంలోనే బాక్సాఫీస్ వద్ద మంచి పోటీ కనిపించనుంది. జూన్ రెండో వారం మాత్రం కాస్త నెమ్మదిగా ఉండనుంది. జూన్ 11న ‘సంగీతం’ అనే సినిమా మాత్రమే విడుదల కానుంది. సంగీతం ప్రధానంగా తెరకెక్కిన ఈ చిత్రంపై సంగీత ప్రియుల్లో ఆసక్తి నెలకొంది. అయితే అసలు పోటీ మాత్రం జూన్ మూడో వారంలో కనిపించనుంది. జూన్ 19న ఒకేసారి నాలుగు సినిమాలు థియేటర్లలోకి రాబోతున్నాయి. ‘బాలన్ ది బాయ్’, ‘ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు’, హారర్ కామెడీ మూవీ ‘చెట్టు మీద దెయ్యం నాకేం భయం’, అలాగే ఫ్యామిలీ ఎమోషన్స్‌తో తెరకెక్కిన ‘మా ఇంటి బంగారం’ సినిమాలు ఒకేరోజు విడుదల కానున్నాయి. ఈ నాలుగు చిత్రాలు పూర్తిగా భిన్నమైన జోనర్లలో ఉండటంతో ప్రేక్షకులకు మంచి ఎంటర్‌టైన్‌మెంట్ ప్యాకేజ్ లభించే అవకాశం ఉంది. ముఖ్యంగా హారర్ కామెడీ సినిమాలకు ఇటీవల మంచి ఆదరణ లభిస్తున్న నేపథ్యంలో ‘చెట్టు మీద దెయ్యం నాకేం భయం’పై ప్రత్యేక ఆసక్తి కనిపిస్తోంది. జూన్ చివరి వారం మాత్రం బాక్సాఫీస్ వద్ద భారీ హంగామా ఉండనుంది. జూన్ 26న పీరియాడిక్ యాక్షన్ డ్రామా ‘స్వయంభూ’ విడుదల కానుంది. ఈ సినిమాపై ఇప్పటికే సినీ వర్గాల్లో మంచి బజ్ నెలకొంది. అదే రోజున స్పోర్ట్స్ డ్రామా ‘సూపర్ గోల్’ కూడా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక రాజకీయ నేపథ్యంతో తెరకెక్కిన ఇంటెన్స్ డ్రామా ‘లెనిన్’ కూడా జూన్ 26నే విడుదల కానుండటం విశేషం. దీంతో నెలాఖరులో మూడు ప్రధాన చిత్రాలు ఒకేసారి బాక్సాఫీస్ బరిలోకి దిగనున్నాయి. మొత్తం మీద చూస్తే 2026 జూన్ నెల టాలీవుడ్ ప్రేక్షకులకు ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇవ్వబోతోందనే చెప్పాలి. భారీ పాన్ ఇండియా సినిమాల నుంచి చిన్న కాన్సెప్ట్ మూవీస్ వరకు అన్ని రకాల చిత్రాలు ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నాయి. ఇక వీటిలో ఏ సినిమా బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తుందో చూడాలి.





## వాట్ ఏ ప్లాన్ గురూ.. మహేశ్ బాబు వారణాసి వైల్డ్ యాక్షన్ ఎపిసోడ్ ఆన్ ది వే.. !


మహేశ్ బాబు కాంపౌండ్ నుంచి రాబోతున్న మోస్ట్ అవెయిటెడ్ ప్రాజెక్ట్ వారణాసి స్టార్ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో బాలీవుడ్ భామ ప్రియాంకా చోప్రా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. మాలీవుడ్ స్టార్ యాక్టర్ పృథ్విరాజ్ సుకుమార్ కీ రోల్‌లో నటిస్తున్నాడు. మాధవన్, ప్రకాశ్ రాజ్ కీలకపాత్రల్లో నటిస్తున్నారు. మైథాలజీ, సైన్స్ ఫిక్షన్ జోనర్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తోన్న ఈ మూవీకి సంబంధించి ఏదో ఒక వార్త నెట్టింట వైరల్ అవుతూ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తుంది. షూటింగ్ దశలో ఉన్న వారణాసి కొత్త షెడ్యూల్ వార్త ఒకటి నెట్టింట హైప్ క్రియేట్ చేస్తోంది. జక్కన్న టీం నెక్స్ట్ సినిమాలో వచ్చే ఓ భారీ వైల్డ్ యాక్షన్ ఎపిసోడ్‌ను ప్లాన్ చేస్తుందట. ఒళ్లు గగుర్పొడిచే స్టంట్స్, భారీ సెట్స్, ఇంటెన్స్ యాక్షన్ కొరియోగ్రఫీ లాంటి కీ ఎలిమెంట్స్ తో ఈ షెడ్యూల్ కొనసాగనుందట. తాజా టాక్ ప్రకారం నాన్ స్టాప్ నెల పాటు రాజమౌళి టీం ప్లాన్ చేసినట్టు ఇన్‌సైడ్ టాక్. సినిమాలో ఇదే బిగ్గెస్ట్ యాక్షన్ సీక్వెన్స్ అని.. భారతీయ సినిమా చరిత్రలో ఇప్పటిదాకా ఎవరూ ప్రయత్నించని విధంగా ఈ సీక్వెన్స్ ఉండబోతుందన్న వార్త ఇప్పుడు మూవీ లవర్స్‌తోపాటు మహేశ్ బాబు అభిమానులను ఫుల్ ఖుషీ చేస్తోంది. ఇదే నిజమైతే జక్కన్న మరోసారి తన రికార్డులను తానే బీట్ చేయడం పక్కా అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ చిత్రాన్ని శ్రీ దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కేఎల్ నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీకి ఎంఎం కీరవాణి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రం రెండు పార్టులుగా రాబోతుంది. ఈ మూవీ ఫస్ట్ పార్ట్‌ను 2027 ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయన్నట్టు ఇప్పటికే ప్రకటించింది టీం. సెకండ్ పార్ట్ 2029లో వస్తుందని వార్తలు రాగా.. రాజమౌళి టీం రాబోయే రోజుల్లో ఏదైనా క్లారిటీ ఇస్తుందేమో చూడాలి.




## సూర్య ‘విశ్వనాథ్ అండ్ సన్స్’ విడుదల తేదీ ఖరారు!

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, టాలీవుడ్ డైరెక్టర్ వెంకీ అట్లూరి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ మూవీ ‘విశ్వనాథ్ అండ్ సన్స్’ విడుదల తేదీ తాజాగా ఖరారైంది. ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. స్వాతంత్ర్య దినోత్సవ లాంగ్ వీకెండ్‌ను టార్గెట్ చేస్తూ ఈ డేట్‌ను లాక్ చేసినట్లు తెలుస్తుంది. ‘సార్’, ‘లక్కీ భాస్కర్’ వంటి వరుస హిట్లతో జోరుమీదున్న వెంకీ అట్లూరి, ఈసారి సూర్యతో కలిసి ఒక విలక్షణమైన ఫ్యామిలీ ఎమోషనల్ డ్రామాను ప్రేక్షకు ముందుకు తీసుకురాబోతున్నారు. ఈ సినిమాలో సూర్య 40 ఏళ్ల అంతర్జాతీయ పిస్టల్ షూటర్ ‘సంజయ్ విశ్వనాథ్’ పాత్రలో సరికొత్త లుక్‌లో కనిపించబోతుండగా.. సూర్య సరసన యంగ్ బ్యూటీ మమితా బైజు కథానాయికగా నటిస్తుంది. సీనియర్ నటీమణులు రాధికా శరత్‌కుమార్, రవీనా టాండన్, మరియు భవాని శ్రీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తుండగా, నిమిష్ రవి సినిమాటోగ్రఫీని, నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలను నిర్వహిస్తున్నారు.

## భారతీయ ఇండీ సినిమాకు కేరాఫ్ అడ్రస్‌గా రానా



తెలుగు హీరో రానా దగ్గుబాటికి చెందిన ‘స్పిరిట్ మీడియా’ మన దేశంలో ఇండీ సినిమాలకు సరికొత్త ప్లాట్‌ఫామ్‌గా మారుతూ కొత్త ట్రెండ్ సెట్ చేస్తుంది. ఇండియాలోని అన్ని భాషలకు చెందిన చిన్న చిత్రాలను, క్రియేటివ్ కథలను సపోర్ట్ చేస్తూ వాటిని థియేటర్ల వరకు తీసుకురావడానికి స్పిరిట్ మీడియా గట్టిగా ప్రయత్నిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఫిల్మ్ ఫెస్టివల్స్ లో మంచి గుర్తింపు తెచ్చుకున్న సినిమాలను, మన నేటివిటీకి దగ్గరగా ఉండే నిజాయితీ గల కథలను ప్రేక్షకుల వద్దకు తీసుకెళ్లడమే స్పిరిట్ మీడియా మెయిన్ టార్గెట్. దీనివల్ల పెద్దగా గుర్తింపు లేని ఎంతోమంది ప్రతిభావంతులైన దర్శకులు, రచయితలకు తమ కథలను దేశవ్యాప్తంగా చూపించే ఒక అద్భుతమైన ఛాన్స్ దొరుకుతోంది. ఈ ఇండీ ఫిలిం మూవ్‌మెంట్‌లో ప్రస్తుతం నార్త్ ఈస్ట్ సినిమాలు చాలా స్పెషల్‌గా నిలుస్తూ వేగంగా ఎదుగుతున్నాయి. సిక్కిం, అసోం, మణిపూర్ లాంటి ప్రాంతాల నుండి వస్తున్న సినిమాలు ప్రేక్షకులకు ఒక సరికొత్త సినిమాటిక్ అనుభూతి ఇస్తున్నాయి. అక్కడి విభిన్నమైన కల్చర్‌ని, అచ్చమైన భావోద్వేగాలని చాలా రియలిస్టిక్‌గా చూపిస్తూ ప్రపంచవ్యాప్తంగా అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ఇందుకు బెస్ట్ ఎగ్జాంపుల్ గా ఈ శుక్రవారం థియేటర్లలోకి వస్తున్న సిక్కిం మూవీ ‘షేప్ ఆఫ్ మోమో’ని చెప్పుకోవచ్చు. ట్రిబేనీ రాయ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఇప్పటికే 15కి పైగా అంతర్జాతీయ అవార్డ్స్ గెలుచుకుంది. జోయా అక్తర్, పాయల్ కపాడియా లాంటి క్రేజీ మేకర్స్ ఈ ప్రాజెక్ట్‌కి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్ గా సపోర్ట్ ఇవ్వడం విశేషం. ఇలాంటి అద్భుతమైన సినిమాలను థియేటర్లకు తీసుకురావడం ద్వారా స్పిరిట్ మీడియా అన్ని ప్రాంతాల సినిమాలకు సమానమైన ఇంపార్టెన్స్ ఇస్తూ ఒక మంచి సినిమా కల్చర్ ని బిల్డ్ చేస్తోంది.

Printed and Published Mekkonda Premraj onbehalf of MPR Publications and Printed at H.No. 5-4-23,
Bhavanicolony, Premavathipet, Rajendranagar, Rangareddy,Telangana 500030,RNI NO.TGTEL/25/A1713